

# ఆంధ్రప్రభ

Estd. 1938
www.prabhanews.com
Journalism first!




సంపుటి:58 • సంచిక: 168 • ఆదివారం 6 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+4 • వెల: 6.00 • Published from:Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

## దుర్గాష్టమి



సర్వస్వరూపే సర్వేశే
సర్వశక్తి సమన్వితే
భయేభ్యస్త్రాహినో దేవీ
దుర్గే దేవీ నమోస్తుతే

చింతనలో...



బతుకమ్మ ఆడిపాడిన పీవీ సింధు



## నేడు సద్దుల బతుకమ్మ

## పూల దీవెన... బతుకమ్మ!

తెలంగాణ ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షిస్తున్నా

- సీఎం కేసీఆర్

లైఫ్‌లో...

2

## సరదాల దసరా

మిగతా పండుగలకు విభిన్నం
భక్తి పారవశ్యం... సామాజిక సాన్నిహిత్యం
సరదాలు.. సరసాలు.. విందులు వినోదాలు
పండుగల వేళ కొత్త అల్లుళ్లు.. దసరా బుల్లోళ్లే
ఆధునిక కాలంలోనూ వన్నె తగ్గని సంబురాలు




# సమ్మెపై నేడు కేసీఆర్ కీలక నిర్ణయం

వరంగల్ బస్టాండులో ప్రైవేటు వాహనాలు



సమ్మెలోనే కార్మికులు.. ప్రభావాన్ని
స్వయంగా పరిశీలించిన సీఎం కేసీఆర్
ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం దృష్టి
25వేల టికెట్ రిజర్వేషన్ల రద్దు
రూ.కోటి తిరిగి చెల్లింపు.. నేడూ తప్పదు
పండుగవేళ ప్రయాణికులకు కష్టాలు
సమ్మెకు రాజకీయ పార్టీల సంఘీభావం

# సమ్మెట!

## బస్సుల్లేక.. ఊరికి చేరలేక...

గడువు ముగిసింది.. పట్టు బిగిసింది • 9 వేల వాహనాలు నడిపాం: ఆర్టీసీ

ప్రభుత్వ డెడ్‌లైన్‌ను పట్టించుకోకుండా ఆర్టీసీ కార్మికులు సమ్మెలోకి వెళ్ళడంతో ఒకవైపు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూనే.. మరోవంక ఆర్టీసీపై కీలక నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఆదివారం మధ్యాహ్నం ప్రగతిభవన్‌లో మరోమారు ఆర్టీసీ, రవాణా, పోలీసు ఉన్నతాధికారులతో భేటీ కానున్న సీఎం ఆర్టీసీ భవిష్యత్‌పై చర్చించనున్నారు. కార్మికులు సమ్మెలోకి వెళ్తే కఠిన నిర్ణయాలుంటాయని ముందుగానే హెచ్చరించిన సీఎం సంస్థను ఏం చేయబోతున్నారన్న అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నష్టాలలో ఉన్న సంస్థను బతికించుకోవాలంటే కార్మికులు మరింత కష్టపడాలని, సంస్థను ఏ రకంగా ఆదుకోవాలన్న అంశాన్ని తమకు వదిలేయాలని గతంలో కేసీఆర్ పలు సందర్భాలలో తెలియజేశారు. అయినప్పటికీ కార్మికులు సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు మరికొన్ని డిమాండ్లతో సమ్మెకి వెళ్ళారు. సమ్మె నివారణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ కొన్ని కీలక సూచనలను చేసింది. ఈ సూచనలను పరిశీలించిన సీఎం చివరగా ప్రభుత్వ నిర్ణయాన్ని వెల్లడించవచ్చని అంటున్నారు.



చంచల్‌గూడ జైలుకు

## రవిప్రకాష్

నిధుల మళ్లింపు కేసులో అరెస్ట్
కోర్టుకు హాజరు.. రిమాండ్

7



నేడు ఆర్టీసీ, రవాణా, పోలీసు చీఫ్‌లతో

## సీఎం కేసీఆర్ సమీక్ష

త్రిసభ్య కమిటీ సూచనలపై సమాలోచనలు
పలు ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు
మహబూబాబాద్‌లో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ప్రభుత్వం చేసిన హెచ్చరికలను ఆర్టీసీ కార్మికులు పట్టించుకోలేదు. ఆర్టీసీ కార్మిక జేఏసీ పిలుపు మేరకు శనివారం కార్మికులంతా సమ్మెలో పాల్గొనడంతో బస్సులు రోడ్డెక్కలేదు. ఫలితంగా పండుగవేళ ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. శనివారం సాయంత్రం ఆరు గంటలలోగా విధులకు హాజరుకానిపక్షంలో ఉద్యోగులుగా గుర్తించబోమంటూ ప్రభుత్వం ప్రకటించిన డెడ్‌లైన్ ముగిసినా పెద్ద ప్రభావం కనిపించలేదు. సమ్మె ప్రభావాన్ని ప్రగతిభవన్‌నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పరిశీలించారు. దసరా వేళ ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వం ఇచ్చిన డెడ్‌లైన్ ముగిసిన నేపథ్యంలో ఆదివారంనాడు పరిస్థితిని సమీక్షించి కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. సమ్మెను ఎదుర్కొనేందుకు తాత్కాలిక పద్ధతిలో 6వేల మంది కార్మికులను రిక్రూట్ చేసుకుని 9వేల బస్సులను నడిపామని ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. మరోవైపు ఏపీ ఆర్టీసీ కార్మిక సంఘాలు తెలంగాణ కార్మికులకు సంఘీభావం ప్రకటించడం విశేషం. సంస్థలో పని చేస్తున్న దాదాపు 50 వేల మంది కార్మికులు సమ్మెలోకి వెళ్ళడంతో 3వ పేజీలో...



## రేపటి నుండి నిరవధిక దీక్ష

ఆర్టీసీ పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ సోమవారం నుంచి నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. చావో రేవో తేల్చుకునేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని, వారి ఆశలను అడియాశలుగా మార్చొద్దన్నారు. సంస్థ పరిరక్షణ కోసమే తాము పోరాటం చేస్తున్నామని, ఇందులో ఎలాంటి స్వార్థం లేదన్నారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసేంత వరకూ తాను దీక్షను కొనసాగిస్తానని ఆయన ప్రకటించారు.

### ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణ మాసం; తిథి: అష్టమి ఉ.10.54 వరకు, నక్షత్రం: పుర్వాషాడ మ.3.04 వరకు, అమృతకాలం: ఉ.9.55 నుండి ఉ.11.38 వరకు; వర్జ్యం: రా.11.51 నుండి సోమవారం ఉ.1:37 వరకు; దుర్ముహూర్తం: సా.4.23 నుండి సా. 5.10 వరకు; రాహుకాలం: సా.4.29 నుండి సా.5.57 వరకు; యమగండం: మ.12.04 నుండి మ.1.32 వరకు;



## ఖరీఫ్ ఖుషీ

రికార్డు స్థాయిలో పెరిగిన పంటల సాగు విస్తీర్ణం
7.37 లక్షల హెక్టార్లలో అధికంగా వరి పంట
అదేస్థాయిలో 19లక్షల హెక్టార్లు దాటిన పత్తి
ముగిసిన ఖరీఫ్.. తుది నివేదిక వెల్లడి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** గడిచిన దశాబ్దకాలం రికార్డులు బద్దలుకొట్టి ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ అత్యంత ఆశాజనకంగా కనిపిస్తోంది. ప్రతియేటా ఏదో ఒక రకరమైన విపత్కర పరిస్థితులు ఎదురై ముందడుగు వేసేందుకు ధైర్యం చేయలేని పరిస్థితులను అధిగమించి రైతులు లక్ష్యాన్ని ఢీకొట్టారు. ఫలితంగా 41 లక్షల హెక్టార్లు సాగు కావాల్సి ఉన్న వివిధ పంటలు ప్రస్తుతం 44 లక్షల హెక్టార్లు దాటాయి. సీజన్ ప్రారంభానికి దాదాపు నెల రోజుల ముందు నుంచి, అనంతరం మరో నెల రోజుల తర్వాత కూడా వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగాన్ని తీవ్రమైన ఆందోళనకు గురి చేశాయి. ఆ తరువాత వరుసగా మూడు తుపానులు రావడంతో వర్షాలు సాధారణ వర్షపాతాన్ని అధిగమించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు జలాశయాలన్నీ దాదాపు గరిష్టమట్టానికి చేరుకున్నాయి. అందుకు తోడు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, భరోసాతో అన్నదాతలు ఎక్కడా వెనకడుగు 5వ పేజీలో...

## రీసైక్లింగ్‌పై దృష్టి

### మరింత మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ

డంపింగ్ యార్డులు,
సీ అండ్ డీ ప్లాంట్ల
ఏర్పాటుకు స్థలసేకరణ
జీహెచ్ఎంసీ, కలెక్టర్లకు
మంత్రి కేటీఆర్
దిశానిర్దేశం



2

## 35 కోట్లతో దండుమల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ రెడీ

రూ.200 కోట్లు పెట్టుబడులు.. 8500 పరిశ్రమలు...
భవిష్యత్తులో రూ.1.6 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా

6

14 లక్షల మంది
హైస్కూలు
విద్యార్థులకు
పంపిణీ
చేయనున్న
విద్యాశాఖ




## స్కూలు పిల్లలకు డిక్షనరీలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆలోచిస్తోంది. ఇందుకు సంబంధించి ఎంత మందికి, ఏ ఏ తరగతులవారికి ఇవ్వాలని, ఎంత ఖర్చు అవుతుంది అనే వాటిపై లెక్కలు వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని రూపొందించడానికి ఓ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ నెల 14న ఈ కమిటీ సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటుంది. విద్యార్థులకు ఇంగ్లీష్- తెలుగు, తెలుగు-ఇంగ్లీష్ డిక్షనరీలను ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. అలాగే శంకరనారాయణ, ఆక్స్‌ఫర్ట్ డిక్షనరీల్లో వేటికి ఇవ్వాలన్న దానిపై కూడా ఓ నిర్ణయం తీసుకుంటారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ డిక్షనరీలు ఇవ్వాలని పాఠశాల విద్య శాఖ ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఆయా తరగతుల విద్యార్థులు మొత్తం 14,04,444 మంది ఉన్నారని, ప్రతి క్లాసులో సగటున 5వ పేజీలో...





## మొదటి ఘాట్‌రోడ్డులో 8అడుగుల నాగుపాము

**తిరుమల, ప్రభన్యూస్:** తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో శనివారం 8 అడుగుల నాగుపాము ప్రత్యక్షమై భక్తులను భయ భ్రాంతులకు గురిచేసింది. తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని అక్కగార్ల గుడి సమీపంలోని ఏనుగుల ఆర్చి వద్ద ఉన్న ఓ దుకాణంలోకి నాగుపాము దూరి అందరినీ హడలెత్తించింది. దీంతో పాములు పట్టే నిపుణుడైన భాస్కర్‌నాయుడుకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న భాస్కర్ నాయుడు చాకచక్యంగా పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాడు.



## మూసీ గేటు గల్లంతు

**సూర్యాపేట(రూరల్), ప్రభన్యూస్ :** సూర్యాపేట మండలంలోని మూసీ నది ప్రాజెక్టు కు చెందిన 6వ క్రస్టుగేట్ వరద ఉధృతికి గురై శనివారం గల్లంతు అయింది. దీంతో నిండుకుండలా ఉన్న మూసీ నదిలోని నీరు గేట్ లేకపోవడంతో వృధాగా వెళ్తున్నా యి. తెల్లవారే సరికి ప్రాజెక్టులోని నీరు ప్రాజెక్టు కింది ప్రాంతాలకు కాలువ ద్వారా వెళ్లే అవకాశం ఉంది. అసలే రాత్రివేళ కావడంతో నీటిని ఆపే ప్రయత్నం విఫలమయ్యే అవకాశం ఉంది. పైగా అధికారులు కూడా అందుబాటులో లేరు. మూసీ కింద గల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఆదేశాలు జారీచేశారు. మంత్రి జగదీష్ రెడ్డి సైతం శనివారం రాత్రి హుటాహుటిన మూసీ ప్రాజెక్టును సందర్శించి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. తక్షణమే నీటిని ఆపే ప్రయత్నాలు చేయాలని సూచించారు.



## మరింత మెరుగ్గా పారిశుధ్ధ్య నిర్వహణ

- దంపింగ్ యార్డులు, సీఅండ్‌డీ ప్లాంట్ల ఏర్పాటుకు స్థలాలు సేకరించాలి
- జీహెచ్‌ఎంసీ, కలెక్టర్లకు మంత్రి కేటీఆర్ ఆదేశం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** గ్రేటర్ హైదరాబాద్ వార్షిక కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా నిర్వహించాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. సర్కిళ్ళ వారీగా శానిటేషన్, పారిశుధ్య కార్మికుల సంక్షేమం, డంపింగ్ యార్డు, భవన నిర్మాణ రీసైక్లింగ్ ప్లాంట్లకు కావలసిన స్థలాలను ఎంపిక చేయాలని మంత్రి కేటీఆర్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం జీహెచ్‌ఎంసీ అధికారులు, శివారు జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్‌లో రహదారులు, పారిశుధ్య నిర్వహణకు తగు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలకు 18వేల మంది పనిచేస్తున్నప్పటికీ మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కోటి మందికిపైగా జనాభా ఉన్న నగరంలో మెరుగైన పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు నగరవాసుల భాగస్వామ్యం పెంచాల్సి ఉందన్నారు. స్వయం సహాయక బృందాలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, స్వచ్ఛంత సంస్థలకు భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. గార్బేజ్‌ను తరలించే ప్రస్తుత వాహనాల స్థానంలో ఘనవ్యర్థాల నిబంధనలను అనుసరించి ఆధునిక యంత్రాలను ప్రవేశపెట్టాలన్నారు. కార్మికులకు వ్యక్తిగత శుభ్రతకు చేతి గ్లౌజస్, మాస్కులు అంధించాలని సూచించారు. దీపావళి జీడిమెట్లలో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంట్‌ను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్, మునిసిపల్ పరిపాలనాశాఖ మంత్రి అర్వింద్ కుమార్, జీహెచ్ ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, మేడ్చల్ కలెక్టర్ రఘువీర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంత్‌రావు, హైదరాబాద్ కలెక్టర్ జి.రవి, రంగారెడ్డి ఇంఛార్జి కలెక్టర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరే.. అరరే!

- ముంబైలో హరిత హననం
- మెట్రో రైల్‌కార్ షెడ్ కోసం చెట్ల నరికివేత
- 2500 భారీ వృక్షాల తొలగింపు
- పర్యావరణ వేత్తల నిరసన
- స్టే ఇవ్వని ఉన్నత న్యాయస్థానం





**ముంబై:** దేశఆర్థిక రాజధాని ముంబై నగరంలోని ఆరే కాలనీ రణక్షేత్రంగా మారింది. పోలీసు బలగాలు, పర్యావరణ ఉద్యమకారులకు మధ్య ఘర్షణ జరిగింది. మెట్రోరైల్-3 కారు షెడ్ భవనాల నిర్మాణం కోసం చేపట్టిన చెట్ల నరికివేత ఉద్రిక్తతకు దారితీసింది. వేలాది వృక్షాల కూల్చివేత ప్రక్రియ మొదలైంది. చెట్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను ముంబై హైకోర్టు కొట్టివేసిన కొద్ది గంటల్లో అక్కడ నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక మెట్రో సిబ్బంది, మున్సిపల్ అధికారులు అక్కడకు చేరుకున్నారు. భారీ బుల్డోజర్లు, యంత్రాలతో చెట్ల నరికివేత చేపట్టారు. మొత్తం 2656 చెట్లకు గాను 400 చెట్లను నేలమట్టం చేశారు. ఈ విషయం తెలుసుకున్న పర్యావరణ వేత్తలు, స్వచ్ఛంద, సామాజిక కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. కాలనీలోని పిక్‌నిక్ పాయింట్ వద్ద పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. నిరసనకారులను నిలువరించే ప్రయత్నం చేశారు. తాత్కాలిక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా కొందరిని అదుపులోకి తీసుకున్నారు. 38 మందిని అరెస్టు చేయగా, వీరిలో 29మందిని శనివారం రిమాండ్‌కు తరలించారు. మరో వైపు ఆరే కాలనీలో 144 సెక్షన్ విధించారు. సుమారు 200 మంది పోలీసులు అక్కడ మోహరించారు. దాదాపు రెండేళ్ల నుంచి మెట్రో చర్యను నిరసిస్తూ పర్యావరణ ఉద్యమకారులు పోరాటం చేస్తున్నారు. కాగా, చెట్ల నరికివేతను కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ సమర్థించారు. అభివృద్ధి, పర్యావరణ సమతుల్యత ఒకే రీతిలో సాగాలన్నారు. ఢిల్లీలో తొలిసారి మెట్రో స్టేషన్ కోసం 25 చెట్లను నరికేశారని, అప్పుడు కూడా నిరసనలు వెల్లువెత్తాయని, కానీ ఇప్పుడు అక్కడ అటవీ శాతం పెరిగిందన్నారు. లక్నోలో మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

### కోర్టు తీర్పు వచ్చీరాగానే..

ఆరే కాలనీలో చెట్లను నరికివేయరాదంటూ దాఖలైన నాలుగు పటిషన్లను ముంబై హైకోర్టు కొట్టిపారేసింది. ఆ తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే చెట్ల తొలగింపు ప్రక్రియ మొదలైంది. వృక్షా లను పెకిలిస్తున్నట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్ కావడంతో భారీ సంఖ్యలో జనం గుమికూడారు.

ఆరే కాలనీలో కారు షెడ్డు కట్టాలని రెండేళ్ల నుంచి ప్రతిపాదన నడుస్తున్నది. అయితే పర్యావరణవేత్తలు చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా పోరాటం చేపట్టారు. ఈ ఉద్యమానికి సామాజిక ఉద్యమకారులు, బాలీవుడ్ అగ్ర స్టార్లు మద్దతుగా నిలిచారు. కానీ వీరి వాదనలు కోర్టులో నిలబడలేదు. ఆరే కాలనీ అడవి కాదని, పర్యావరణ నిబంధనలు వర్తించవని ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు ఈ అంశంపై దాఖలైన పిటిషన్ల తక్షణ విచారణకు ఎన్జీటీ నిరాకరించింది. పది రోజుల తర్వాత పటిషన్లను పరిశీలిస్తామని చెప్పింది. ముంబై మెట్రో రైల్ కార్పొరేషన్ (ఎంఎంఆర్‌సీ) చెట్లనరికివేతను అడ్డుకునే ప్రయత్నం చేసిన 60 మందిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఆరుగురు మహిళలు, అధికసంఖ్యలో విద్యార్థులు ఉన్నారు.

### శివసేన, కాంగ్రెస్ ఆగ్రహం

ఆరే కాలనీలో చెట్ల కూల్చివేతను బీజేపీ మిత్రపక్షం శివసేన తీవ్రంగా తప్పుబట్టింది. ఆ పార్టీ యువనేత ఆదిత్య ఠాక్రే, ఎంపీ సంజయ్‌రౌత్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఈ విషయంలో ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తంచేసింది. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితిలో చేసిన ప్రసంగానికి విరుద్ధంగా మెట్రో రైల్ చర్యలున్నాయని మండిపడింది. మరోవైపు, బీజేపీ-సేన ప్రభుత్వంపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఈ చర్య పర్యావరణంపై ప్రధాని మోడీ ద్వంద్వ విధానాలకు నిదర్శనమని ఆరోపించింది.

# సరదాల దసరా

## మిగతా పండుగలకు విభిన్నం

### అటు భక్తిపారవశ్యం.. ఇటు సామాజిక సాన్నిహిత్యం

- ఆటపాటల వెనుక విజయగాధలు
- పప్పు బెల్లాలు.. ఆరు వరహాల వెనుక గురుశిష్య బంధం
- పాలపిట్టా.. పూలబుట్టా..జమ్మిచెట్టు విజయవీచికలు
- ఆధునిక కాలంలోనూ వన్నె తగ్గని దశమి సంబురాలు



దసరా వచ్చిందంటే అదో సంబురం. వేకువ వేళ తెలుగువాకిళ్లలో కనిపించే సందడి అంతా... దసర బుల్లోళ్లలాంటి కొత్త అల్లుళ్ల ముఖాల్లోనూ, ఆ వెనుకే తిరుగుతూండే కొత్త పెళ్లికూతురి సిగ్గుల్లోనూ తొంగి చూస్తూంటుంది. తెలంగాణ ముంగిట బతుకమ్మ శోభ... ఆంధ్రలో కాస్త భిన్నం. రెండుచోట్లా శక్తిస్వరూపిణి దుర్గమ్మ పూజలతో భక్తి పారవశ్యం. పిండివంటల ఘుమఘుమలు.. విందులు వినోదాల్లా కాస్త తేడాలున్నా... అంతిమ లక్ష్యం ఆనందమే. ఆనందం వెనుక ఆత్మీయబంధం కనిపిస్తుంది. దుర్గాష్టమి మొదలు దశమి వరకు మూడురోజుల పాటు సాగే దసరా వేడుకల వెనుక విజయరహస్యం ఉంది. జమ్మిచెట్టు సాక్షిగా... ఆ ప్రత్యేకతలేమిటో ఈ వారం ప్రత్యేక కథనం...

### సెలవుల సరదా

అప్పట్లో దసరా వచ్చిందంటే..పిల్లల బడులకు ఆటవిడుపు. ముఖ్యంగా కొత్తబట్టలొస్తాయన్న ఆనందం. అదీ ఇప్పటి లాగా దసరా ముందురోజే డ్రెస్‌లు లభించేవి కావు. అందుకే వారం పది రోజుల ముందే కొత్తబట్టలు కొని, దర్జీకి ఇచ్చి కుట్టించుకోవాలి. అతను కుట్టకపోతే అనే భయం. కొత్తబట్టలు తొడుక్కోవానే ఆతృత.. అది పిల్లలకు కొత్త అనుభవం. ఇక పండగ వేళ బంధువులతో ఇండ్లన్నీ కళకళలాడేవి. దసరా రోజున..ఊరు ఊరే నూతన వస్త్రాలు ధరించి సరికొత్త అందాలు సంతరించుకునేది. దసరా అంటేనే సరదాలు మూటగట్టుకుని వచ్చే పండుగ.. ఇక దేవీ నవరాత్రుల సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో హరికథలు, బుర్రకథలు, జానపద- పౌరాణిక నాటకాలు, దసరా వేషగాళ్లు వీధుల్లో తిరగడాలు, ఇలా నవరాత్రుల సందర్భంగా జానపద కళలతో జనపదాలు... సరదాల పరదాల మాటున మిలమిలలాడేవి. ఇప్పుడు ఏ ఉత్సవం అయినా డీజేలు, సినిమా పాటలు, డ్యాన్స్‌లతో హోరెత్తుతున్నాయి.

### గురుశిష్య బంధానికి పల్లవి

గతంలో దసరా వచ్చిందంటే పిల్లలకు, పెద్దలకు ఓ పెద్దసంబరం.. ఆ రోజుల్లో వీధిబడులే విద్యాలయాలు. టీచర్‌ను అప్పట్లో అయ్యవారు అని పిలిచేవారు. దసరా ఉత్సవాల వేళ అయ్యవారు విద్యార్థులను వెంటతీసుకుని ఇంటింటికి వెళ్లి పాట పాడేవారు. అయ్యవారికి చాలు ఐదు వరహాలు. పిల్లవాళ్లకు చాలు పప్పు బెల్లాలు..అంటూ సాగిపోయే పాటల వెనుక గురుదక్షిణల పర్వం ఉండేది. గురుభక్తి పొంగిపొర్లేది. పాడించి.. గురుదక్షిణ స్వీకరించేవారు. గురువును గౌరవించాలనే భావనతో, ఏ ఇంటికి వెళ్లినా శక్తికొలది కానుకలు ఇచ్చేవారు. పిల్లలకు పప్పు బెల్లాలు పంచేవారు. దీనివల్ల పిల్లలకు పాడే గుణం, పది మందిలోకి వెళ్లి మాట్లాడే తత్వం అబ్బేది. అంటే ఇప్పుడు మనం చెప్పుకంటున్న స్టేజ్ ఫియర్ పోయేదన్నమాట. అంతేకాదు ఇలా చేసేటప్పుడు పిల్లల చేతిలో వెదురు బద్దతో చేసిన బాణాలు ఉండేవి. అవి పిల్లలే తయారు చేసుకునేవారు. వాటికి రంగు రంగుల కాగితాలు చుట్టి అందంగా చేసేవారు. విల్లు చివర పూల గుత్తులు అమర్చేవారు. చేతిలో విల్లంబులు ధరించి.. బుక్కాగులాలు చల్లుకుంటూ ఇంటింటికి తిరిగేవారు. ఇలా చేయడం వల్ల వారికి పనిచేసే తత్వం, సృజన అలవడేది. లక్ష్యసాధన, గురి కుదిరేవి. పాండవుల విజయగాథలు తెలుసుకునేవారు. దీనికి తోడు గురుశిష్యుల బంధం బలపడేది. ఇవన్నీ చూడటానికి వినోదంగానే కనిపించినా... తప్పనిసరిగా విద్యార్థినీ విద్యార్థులపై ప్రభావం చూపేవి. కొన్ని ప్రాంతాల్లో ఆయా ఊర్లకు వెళ్లే ప్రైవేటు బస్సులు ఆయుధ పూజ అనంతరం పిల్లలను బస్సులో ఎక్కించుకుని ఓ రౌండ్ చుట్టి వచ్చేవి. మరో వైపు... దసరా ఉత్సవాలు సరదాగా సాగినా పెద్దల పట్ల గౌరవాన్ని పెంచేవి. దసరా రోజు జమ్మి చెట్టును పూజించిన తర్వాత .. పత్రిని తెచ్చి పెద్దలకు అందించి, కాళ్లు మొక్కడం సంప్రదాయం. పెద్దలు పిల్లలను ఆశీర్వదించేవారు.

### బొమ్మల కొలువులు

పూర్వం దసరా నవరాత్రుల సందర్భంగా ఇళ్లల్లో బొమ్మలు కొలువు తీరేవి. రకరకాల బొమ్మలతో ఏర్పాటు చేసిన కొలువు చూడ ముచ్చటగా ఉండేవి. అయితే అందరు బొమ్మల కొలువు ఏర్పాటు చేయరు. చుట్టుపక్కల ఉన్న పిల్లలు బొమ్మల కొలువున్న ఇంటికి వెళ్లి ఆడుతూ పాడుతూ ఆనందించేవారు. ఇంటి యజమానులు పిల్లలకు శక్తికొలది తినుబండారాలు, పప్పుబెల్లాలు పంచేవారు.

### జనపదాల్లో జానపదాలు

ప్రకృతిని పూజించే పండుగ.. చెరువులు, కుంటలను శుద్ధి చేసే సామాజిక ప్రయోజనం.. దసరా పండుగ వర్షకాలం పోయి చలికాలం ప్రారంభమయ్యే దశలో వస్తుంది. పల్లెల్లో ఎక్కడ చూసినా పచ్చదనమే. తంగేడు ,జిల్లేడు, గడ్డి పూలు ప్రకృతి అందాలను చాటుతాయి. పెద్దల అమావాస్య(మహాలయ అమావాస్య) మొదలు దసరా ముందురోజు వరకు తొమ్మిది రోజులు ప్రకృతిలో లభించే పూలను కోసుకొని బతుకమ్మ ఆడిన తర్వాత వాటిని తీసుకొని వెళ్లి సమీపంలోని చెరువులు, కుంటల్లో వదిలి వచ్చేస్తారు. నీటిలోని క్రిమికీటకాలు నశిస్తాయి. నీరు క్లోరినేషన్ అవుతుందన్న మాట. ఇంటి ఆడపడు చుల బతుకమ్మల కోసం ఇంటిలోని అన్నదమ్ములు ఉదయమే లేచి, చేను, చెలకలు తిరిగి పూలు కోసుకొచ్చేవారు. దీనివల్ల వారికి ఉదయమే లేచే క్రమశిక్షణ అలవడుతుంది.

### ఇప్పుడు ఆధునిక హంగులు

నాటికి నేటికి దసరా సంబరాల సీన్ మారింది. అప్పట్లో లాగా దర్జీలతో బట్టలు కుట్టించుకునే అవసరం లేదు.. పండుగకు ఒకరోజు ముందు షాపింగ్ వెళితే రెడీమేడ్ డ్రెస్‌లు.. ఉద్యోగాల వేటలో విదేశాల్లో ఉండే కొడుకు, కూతురు ఇంటికి వచ్చే ఛాన్స్ మిస్.. ..అందరిదీ బిజీలైఫ్ కావడంతో పండుగలకు అమ్మమ్మ, తాతయ్య ఇళ్లకు వెళ్లే అవకాశం పిల్లలకు లేదు. సంప్రదాయాలు, బంధాలు పెనవేసుకునే అవకాశమూ నేటి పిలలు, పెద్దలకు లేకుండా పోయింది. ప్రస్తుతం నగరాల్లో బతుకమ్మ పూలు విక్రయాలు సాగుతున్న విషయం తెలిసిందే.

### పాల పిట్టకు ఎంత కష్టం

పాలపిట్ట...దసరా రోజు దీనికి ఎంతో ప్రాధాన్యం. దీనిని చూసిన తర్వాతే పాండవులకు విజయ పరంపర కొనసాగిందన్న విశ్వాసం. పూర్వం పల్లె పరిసరాల్లో పచ్చని చెట్లో...అడవులో ఉండేవి. ఊరి జనం పాల పిట్ట దర్శనం కోసం పొలాల్లోకి, అటవీ ప్రాంతంలోకి వెళ్లి , కలియతిరిగి దర్శనం చేసుకుని వచ్చేవారు. దీనివల్ల శారీరక వ్యాయామం కలిగేది. ఇక పట్టణాలలో అయితే శివారు గ్రామాలకు వాహనాలలో వెళ్లి పాలపిట్ట దర్శనం చేసుకుని వచ్చేవారు.. కానీ పంటపొలాల్లో, చెట్లమీద కనిపించే పాలపిట్ట ప్రస్తుతం కనుమరుగవుతోంది. దీంతో కొందరు పండుగ వేళ పాలపిట్టను పంజరంలో పెట్టుకుని, గుళ్ల వద్ద, నాలుగు రోడ్ల కూడళ్లలో నిలబడి పది రూపాయలు తీసుకుని చూపిస్తున్నారు., అంటే స్వేచ్ఛగా తిరుగాడే పాలపిట్టను కాకుండా దసరా రోజు పంజరంలో బందీ అయిన పాలపిట్టను చూడాల్సి వస్తుందన్న మాట!

### జమ్మి.. బహు గొప్ప సుమీ..

మన పూర్వీకులు పెట్టిన సంప్రదాయాలు, ఆచారాలు తూచ తప్పకుండా పాటిస్తున్నాం. కానీ నాటి పవిత్రత నేడు వ్యాపార వస్తువుగా మారడం ఇక్కడ గమనార్హం. పూర్వం నవరాత్రుల తర్వాత దసరా రోజు ప్రజలంతా గుడివద్ద చేరి, పురోహితుడిని తీసుకుని డప్పు చప్పుళ్లు, మంగళవాయిద్యాలతో జమ్మి చెట్టు వద్దకు వెళ్లి పూజించి.. కోర్కెలు తీర్చమని వేడుకుంటూ కాకితాల మీద..శమీశమీయతే పాపం..శమీ శత్రు వినాశనం...అన్న శ్లోకాన్ని, తమ కోర్కెల చిట్టాను రాసి, చెట్టు తొర్రలో వేసేవారు. ఆ తర్వాత జమ్మి ఆకు కోసుకుని వచ్చేవారు. దసరా ఉత్సవాల్లో అంతటి పవిత్రత ఆ చెట్టుకు ఉంది. ఎందుకంటే దసరా రోజే పాండవులు జమ్మి చెట్టుమీద దాచిన ఆయుధాలను తీసుకున్నారని, వాటితో యుద్ధం చేసి విజయం సాధించారని విశ్వాసం. అంటే జమ్మికి పూజిస్తే శత్రునాశనం తప్పదన్నది ఇందులోని పరమార్థం. కానీ ప్రస్తుతం పల్లెల్లోనే జమ్మి చెట్లు కనుమరుగయ్యాయి. పట్టణాలు నగరాల్లో జమ్మి ఆక ు దసరా రోజు వ్యాపార వస్తువుగా మారింది. ఆయల కమీటీలు గుళ్లవద్ద ఎక్కడినుంచో జమ్మి కొమ్మను తెచ్చి నాటుతున్నారు. స్థానికులు దానికే మొక్కి..శాస్త్రానికి అన్నట్లు....ఒకటి రెండు ఆకులు తెచ్చుకుంటున్నారు.

### గత వైభవం రావాలి



నాకు తెలిసి రాయల సీమలో ఆలయాల్లో దసరా ఉత్సవాలు జరిగేవి. ఇప్పటి లాగా వీధుల్లో నవరాత్రులు జరిగేవి కావు. కాకపోతే గ్రామాల్లో పట్టణాల్లో కొందరు బొమ్మల కొలువులు ఏర్పాటు చేసేవారు. పిల్లలమంతా కలిసి..అక్కడికి వెళ్లి ఆడిపాడి ఆనందించే వాళ్లం.. అయితే కొన్ని ప్రాంతాల్లో వీధిబడి పంతుళ్లు పిల్లలను తీసుకుని ఇంటింటికి తిరిగి గురుదక్షిణ తీసుకునేవారు. ఇప్పుడు అంతా హంగూ ఆర్భాటమే. పేరుకు సంప్రదాయం...ప్రస్తుతం అప్పటి ఆప్యాయతలు కనిపించడం లేదు. సంప్రదాయం పాటి స్తున్నాని చెప్పుకోవడానికి తప్ప, అందులో దాగిన ప్రయో జనాన్ని నేటితరం మర్చిపోతోంది. అందుకే దసరాకే కాదు అన్ని పండుగలకు పూర్వ వైభవం రావాలి. అప్పుడే మన పూర్వీకులు ఆశించిన సామాజిక ప్రయోజనం చేకూరుతుంది.

**-భూమన్, శ్వేత మాజీ డైరెక్టర్, తిరుపతి**



### అమ్మలా మారాలంటే ఆగాలి

అరుదైన జీవజాలంలో ఒకటి ఫ్రాంకాయిస్ లంగూర్ జాతి కోతులు. చైనా, వియత్నాంలో మాత్రమే ఇవి మనుగడ సాగిస్తున్నాయి. ప్రపంచం మొత్తంమీద ప్రస్తుతం వీటి సంఖ్య 3వేల లోపే. వేగంగా అంతరించిపోతున్న జంతువుల జాబితాలో ఇవీ ఉన్నాయి. వాటి సంరక్షణకు ఎన్నో దేశాలు చర్యలు తీసుకుంటున్నాయి. అవి ఫలించి, ఈమధ్యే ఆస్ట్రేలియాలోని సిడ్నీ టరొంగా జూలో ఓ కూనకు జన్మనిచ్చింది ఫ్రాంకాయిస్ లంగూర్ కోతి. వెడల్పాటి చెవులు, నారింజ రంగు కేశాలు, అమాయకత ద్యోతకమవుతున్న నల్లటి గుండ్రటి కళ్లతో చురుకుగా ఉన్న ఆ పిల్లకోతి అందరికీ తెగనచ్చేసింది. అయితే అసలు ఈ కోతులు నల్లగా నిగనిగలాడుతూంటాయి. బుగ్గలపై కాస్త తెల్లటి గుబురు వెంట్రుకలు, తలపై పింఛంలా పొడుచుకొచ్చిన నల్లటి వెంట్రుకలు వీటికి కొత్త అందాన్నిస్తాయి. ఇప్పుడు నారింజరంగులో మెరిసిపోతున్న బుల్లికోతి తల్లిలా నల్లగా మారడానికి కొద్దినెలలు పడుతుంది.



### బోరిస్ కేక్

అసలే బ్రెగ్జిట్ అవస్థలతో సతమతమవుతున్న బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను ఇలా గోడకు వేళ్లాడగట్టి మరీ మేకప్ చేస్తున్నారేమిటా అనుకుంటున్నారా? అయితే మీరు కేక్‌లో కాలేసినట్లే. ఇక్కడ కనిపిస్తున్నది బోరిస్ నిలువెత్తు కేక్. భారీ, విభిన్న, వైవిధ్య కేక్‌ల తయారీలో నిపుణురాలైన రోసీ డమ్మర్ ఈ కేక్‌ను రూపొందించారు. దానికి తుది రుచులు అద్దుతున్నది ఆమే. కేక్ అండ్ బేక్ షో కోసం ఆమె ఈ బోరిస్ కేక్‌ను తయారు చేశారు. ఇది కేక్ అని చెప్పేవరకు గుర్తుపట్టలేని విధంగా ఈ కేకువిగ్రహం ఉందికదూ!



### మాకూ ఓ రోజుంది..

జీవితంలో ప్రతీ ఒక్కరికి ఓ రోజొస్తుందని ఆశాజీవులు అనుకుంటూ ఉంటారు. మంచిరోజుల కోసం ఎదురు చూస్తున్నప్పుడు ఈ భావన తరచూ వస్తూంటుంది. ఆధునిక సమాజంలో మాతృదినోత్సవం అని, ప్రేమికుల దినోత్సవం అని, పర్యావరణ దినోత్సవమని వేడుకలు నిర్వహించుకోవడం అలవాటేగా. అలాగే, సెప్టెంబర్ 4 జంతువుల దినోత్సవం. ఈ సందర్భంగా ప్రపంచ దేశాలు వినూత్న కార్యక్రమాలు నిర్వహించాయి. జంతువుల పరిరక్షణ, అవి స్వేచ్ఛగా, సురక్షితంగా జీవించే పరిస్థితులు కల్పించాలన్న లక్ష్యంతో ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీ. అలా ఫిలిప్పీన్స్‌లోని క్విజాన్‌లో జరిగిన ఓ షోలో ఓ బుల్లి శునకాన్ని ఇలా అందమైన పూలహారాన్ని అలంకరించి వేడుక చేశారు.



### వీడి తెలివి బంగారం కానూ..

బంగారంపై ఆశ ఎంతపనైనా చేయిస్తుందనడానికి ఇదిగో ఇతగాడి వ్యవహారమే ఓ ఉదాహరణ. బంగారం స్మగ్లింగ్ చేయడానికి అతడు పడినపాట్లు ఫలించలేదు. దొంగచాటుగా బంగారాన్ని తరలించడానికి ఆయన బుర్రకు తట్టిన ఆలోచన చూసేవారికి వింతగా కనిపించడం మామూలే అయినా... అధికారులకు మాత్రం కొత్త. కేరళలోని మలప్పురం ప్రాంతానికి చెందిన నౌషాద్ అనే వ్యక్తి షార్జాకు వెళ్లాడు. వస్తూవస్తూ ఓ కేజీ బంగారాన్ని అక్రమంగా తీసుకు వచ్చాడు. అందుకోసంతల మధ్యలో జుత్తు గొరిగించుకుని, చుట్టూ వదిలేశాడు. ఆ ఖాళీగా ఉంచిన చోట కేజీ బంగారాన్నిఓ చుట్టచుట్టి పెట్టాడు. దానిపై విగ్గుపెట్టుకున్నాడు. కొచ్చి విమానాశ్రయంలో దిగాడు. అక్కడ కస్టమ్స్ అధికారులకు ఎందుకో అనుమానం వచ్చింది. చివరకు విగ్గు నిగ్గు తేల్చేసరికి బంగారంఊడి పడింది. అలా దొరికిన బంగారం విలువ. రూ. 24 లక్షలు.

# బస్సుల్లేక.. ఊరికి చేరలేక...

# సమ్మెట!

సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న నగరవాసులు



(మొదటిపేజీ తరువాయి)

సుమారు 8 వేల బస్సులు డిపోలను దాటలేదు. మరో రెండున్నర అద్దెబస్సుల్లో మెజారిటీ సర్వీసులు రోడ్డెక్కలేదు. సమ్మె మొదటి రోజు పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రైవేటు, అద్దె వాహనాలతో సహా దాదాపు 9వేల సర్వీసులను నడిపించిన యాజమాన్యం, రెండోరోజు ఇదే ఒరవడిని కొనసాగించాలని నిర్ణయించింది. అవసరమైతే మరిన్ని సర్వీసులను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తోంది.

### పండగ రద్దీపై ప్రత్యేక దృష్టి

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఆర్టీసీ, రవాణా శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తోంది. ఖైరతాబాద్ లోని రవాణా కార్యాలయంతో పాటు ఆర్టీసీ బస్ భవన్‌లతో పాటు రాష్ట్రంలోని ప్రతి ఆర్టీసీ డిపో, రవాణా శాఖ కార్యాలయాలలో ప్రత్యేక కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశారు. అద్దె బస్సులు, ప్రైవేట్ స్కూల్ బస్సులు, క్యాబ్‌ల రాకపోకలు, రద్దీ మార్గాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు చర్యలు తీసుకున్నారు.

### కేసీఆర్, పువ్వాడ పర్యవేక్షణ

ఆర్టీసీ సమ్మెపై సీరియస్‌గా ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఎట్టి పరిస్థితులలో సమ్మె ప్రభావం ప్రజలపై ఉండొద్దని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని, అవాంఛనీయ ఘటనలు జరక్కుండా చూడాలని సూచించారు. సమ్మెపై శనివారం ప్రగతి భవన్ నుంచే రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌తో కలిసి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అక్కడికక్కడే కావాల్సిన సలహాలు, సూచనలను కూడా చేశారు. డిపోల నుంచి బస్సులన్నింటినీ బయటకు తీసుకు రావాలని, ప్రజా రవాణాకు వినియోగించాల్సిందేనని ఆదేశించడంతో ఆ మేరకు అధికారులు ఏర్పాట్లను మరింత ముమ్మరం చేశారు. డ్రైవర్, కండక్టర్లతో పాటు సూపర్‌వైజర్లు, మెకానిక్‌లను కూడా తాత్కాలిక పద్ధతిపై నియమించుకోవాలని ఆదేశించారు.

### 25వేల రిజర్వేషన్లు రద్దు..

పండుగకు ముందస్తు రిజర్వేషన్లు చేయించుకున్న ప్రయాణికుల టికెట్లను ఆర్టీసీ రద్దు చేసింది. శనివారం ఒక్క రోజే దాదాపు 25 వేల టికెట్లను రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఫలితంగా సంస్థ దాదాపు కోటి 10 లక్షల రూపాయలను ప్రయాణికుల ఖాతాల్లోకి జమ చేయాల్సి వచ్చింది. దూర ప్రాంతాలకు వెళ్ళే వారంతా పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని నెల రోజుల క్రితం నుంచి టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు. వీరంతా ప్రయాణాలకు సన్నద్ధమవుతున్న



తరుణంలో రిజర్వేషన్లను రద్దు చేసినట్లు ఫోన్‌లలో సంక్షిప్త సందేశం రావడంతో లబోదిబో మంటున్నా రు. ఆదివారం కూడా మరో 25 వేల టికెట్లన ప్రయాణికులు రిజర్వ్ చేసుకున్నారు. వీటి విషయంలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ టికెట్లను కూడా రద్దు చేస్తే మరో కోటి రూపాయలను కోల్పోవాల్సి వస్తుంది.

### ఏదేమైనా వెనక్కి తగ్గం : ఆర్టీసీ జేఏసీ

ప్రభుత్వం ఎన్ని రకాలుగా బెదరించినా వెనక్కు తగ్గేది లేదని ఆర్టీసీ జేఏసీ నేతలు తెగేసి చెప్పారు. సమ్మె పరిస్థితిని సమీక్షించేందుకు ఇమ్లిబన్ బస్టాండ్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, థామస్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు మాట్లాడుతూ, సీఎం బెదరింపులకు పాల్పడటం సరైంది కాదన్నారు. గతంలో సీఎం ఇచ్చిన వాగ్దానాలనే నెరవేర్చాలని కోరుతున్నామని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు ప్రభుత్వం అంగీకరించాల్సిం దేనని స్పష్టం చేశారు. వెంటనే విధుల్లో చేరకపోతే ఉద్యోగాలు పోయినట్లేనని సీఎం చెప్పడంపై కార్మిక నేతలు మండిపడ్డారు.

### విధులోకి160 మంది కార్మికులు

శనివారం సాయంత్రం ఆరు గంటలలోగా విధుల్లో చేరని వారు ఉద్యోగాలు కోల్పోయినట్లేనని ప్రభుత్వం చేసిన ప్రకటనతో 160 మంది ఆయా డిపోల్లో రిపోర్టు చేశారు. వీరిలో ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, సూపర్‌వైజర్లు, ఆఫీస్ స్టాఫ్, మెకానిక్‌లు ఉన్నారు.

### డ్రైవర్ల ఎంపిక ఇలా..

సికిందరాబాద్‌లో రైలు ప్రయాణానికి బారులు తీరిన జనం...



బస్సు డ్రైవర్లుగా ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుంటున్న ఆర్టీసీ ఒక క్రమపద్ధతిని పాటించింది. డ్రైవర్‌గా పని చేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించిన అనంతరం రవాణా శాఖకు చెందిన ఎంవీఐ, ఆర్టీసీకి చెందిన సూపర్‌వైజర్‌తో కమిటీని వేశారు. డ్రైవర్ ఉద్యోగానికి ఎంపికైన

| | |
|---|---|
| ఆర్టీసీ బస్సులు | 2129 |
| ఆర్టీసీ అద్దె బస్సులు | 1717 |
| ప్రైవేట్ బస్సులు | 1155 |
| కళాశాలల బస్సులు | 1195 |
| మ్యాక్సీక్యాబ్‌లు తదితర | 2778 |

వ్యక్తికి ముందుగా ఒక బస్సును ఇచ్చి డిపోలో డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించారు. ప్రయాణికుల భద్రతే ముఖ్యం కాబట్టి డ్రైవింగ్ అర్హతను అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే బస్సును అప్పగిస్తున్నామని, దూర ప్రాంతం బస్సులను నడిపే వారికి మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు.

### నేడు డిపోల వద్ద బతుకమ్మ: ఆర్టీసీ జేఏసీ

సమ్మెలో భాగంగా నేడు అన్ని డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల కుటుంబాలు బతుకమ్మ ఆడాలని పిలుపునిచ్చాయి. ఆదివారం ఉదయం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నేతలను కలిసి మద్దతు కోరాలని కూడా జేఏసీ నిర్ణయించింది. తర్వాత రాష్ట్రంలోని అన్ని ట్రేడ్ యూనియన్ల నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనుంది.


నిర్మానుష్యంగా మారిన గౌలిగూడ బస్ టెర్మినల్



## ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఆర్టీసీ సమ్మె

- బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రెండేళ్లుగా ఆర్టీసీని ప్రభుత్వం పట్టించుకోలేదని, అందువల్లే ప్రస్తుతం కార్మికుల సమ్మె చేసే పరిస్థితి ఏర్పడిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి విమర్శించారు. కేసీఆర్ పాలన గాడి తప్పిందని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులను సీఎం బెదరిస్తున్న తీరును చూస్తే హిట్లర్ గుర్తుకు వస్తున్నారని వ్యాఖ్యానించారు. నిరంకుశ ధోరణితో వెళ్తానంటే ప్రజాస్వామ్యంలో సాగదన్న విషయాన్ని గుర్తించి ప్రవర్తించాలన్నారు. నిరంకుశ పాలన చాలాకాలం సాగదని, ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలుసుకుని ప్రవర్తించాలన్నారు.

## బ్లాక్‌మెయిల్ కాదు..చర్చలు జరపండి



ఆర్టీసీ కార్మికులతో సీఎం చంద్రశేఖర్‌రావు బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతుంటే బెదరింపులకు దిగడం సరికాదని, వెంటనే కార్మికులతో చర్చలు జరపాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య హితవు పలికారు. కార్మికుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని పొన్నాల తప్పుపట్టారు. సమ్మె చేస్తే ఉద్యోగల నుంచి తీసివేస్తామనడం నియంతృత్వ పోకడకు నిదర్శమని దుయ్యబట్టారు.

## ఉద్యోగాలు తీసేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు



తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులది కీలకపాత్ర అనే విషయాన్ని సీఎం కేసీఆర్ మర్చిపోకూడదని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్‌అలీ అన్నారు. ఉద్యమం సమయంలో ఒకలా.. ఇప్పుడు ఒకలా మాట్లాడటం సీఎంకు తగదని ఆయన హెచ్చరించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. సీఎం కేసీఆర్ యూటర్న్ ముఖ్య మంత్రి అంటూ ఆయన ఎద్దేవా చేశారు. ఎస్మాను ప్రయోగించి ఉద్యోగాలు తీసేస్తామంటే.. ప్రజలు ఆయన ఉద్యోగాన్ని తీసేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. ఆర్టీసీ సమ్మెకు పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి



ఆర్టీసీ కార్మికులతో పెట్టుకున్న సీఎం కేసీఆర్ మసికాక తప్పదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఉద్యమం సమయంలో ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.పక్క రాష్ట్రంలో ఆర్టీసీని బలోపేతం చేసే క్రమంలో ప్రభుత్వం విలీనం చేశారని, తెలంగాణ ప్రభుత్వం మాత్రం కుట్ర పూరితంగా కార్మికులను సమ్మెవైపు పురికొల్పిందని ఆయన విమర్శించారు.

## సమ్మె నేపథ్యంలో మెట్రో అదనపు సర్వీసులు

ఆర్టీసీ కార్మికుల సమ్మె చేస్తున్నందున నగర ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగకుండా మెట్రోలో అదనపు సర్వీసులను నడుపుతున్నట్లు ఆ సంస్థ ఎండీ ఎన్‌వీ శ్రీధర్‌రెడ్డి చెప్పారు. సమ్మెతో మెట్రో రైళ్లలో రద్దీ పెరిగిందన్నారు. రెండు కారిడార్లలోనూ ప్రయాణీకులతో మెట్రో రైళ్లు కిక్కిరిసిపోతున్నాయన్నారు. ఈ సాధారణ రోజుల్లో ఉదయం 10గంటలలోపు 42వేలమంది మెట్రలో ప్రయాణిస్తే... ఆర్టీసీ సమ్మె కారణంగా శనివారం ఉదయం 10గంటల లోపు 78వేల మంది ప్రయాణించారని చెప్పారు. 810 ట్రిప్పులు నడిపేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. శనివారం ఉదయం 10గంటల వరకు 100 ట్రిప్పులను పూర్తిచేసినట్లు చెప్పారు.

## అనుభవం లేని డ్రైవర్లతో ప్రమాదం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** అనుభవం లేని డ్రైవర్లను పెట్టి ఆర్టీసీ బస్సులు నడిపితే ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులను విధుల నుంచి తొలగిస్తామని బెదరించడం సరైంది కాదన్నారు.ఆర్టీసీ కార్మికులను అరెస్టు చేస్తే జైళ్లు కూడా సరిపోవు అన్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా సానుకూల దృక్పథంతో ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## అఖిల లక్షాల మద్దతు

- అదే బాటలో ప్రజా సంఘాలు
- ఏపీలోని ఆర్టీసీ కార్మికుల మద్దతు
- తెరాస లక్ష్యంగా బీజేపీ, కాంగ్రెస్

ఎమ్మార్పీఎస్ నేతల విమర్శలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఏపీలోని ఆర్టీసీ కార్మిక సంఘాలు కూడా మద్దతుగా నిలిచాయి. తెరాస లక్ష్యంగా చేసుకుని వివిధ పార్టీల నేతలు విమర్శలకు పదునుపెట్టారు. తెలంగాణ ఉద్యమం లో ఆర్టీసీ కార్మికులు చూపిన తెగువను గుర్తు చేస్తూ.. న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మెకు దిగిన ఆర్టీసీ కార్మికు లకు అండగా ఉంటామని చెబుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీజేఎస్, ఎమ్మార్పీఎస్‌తో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు కూడా మద్దతు ప్రకటిం చాయి. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చే విధంగా రాజకీయ పార్టీలు కార్యాచరణను సిద్ధం చేసుకునే పనిలో ఉన్నాయి.

ఎస్మాపై బీజేపీ నేత లక్ష్మణ్ గుస్సా

ఎస్మా చట్టాన్ని ఎలా ప్రయోగిస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, జీవన్‌రెడ్డి, వి.హనుమంతరావు, షబ్బీర్‌అలీ, పొన్నం ప్రభాకర్, టీజేఎస్ నేత కోదండరామ్ తదితర నేతలు కార్మిక నేతలకు బాసటగా నిలిచారు. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కూడా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులను వాడుకున్న కేసీఆర్.. ఇప్పుడు వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరితే హెచ్చరికలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఏపీ ఆర్టీసీ నేతలు మద్దతు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ఏపీ నుంచి బస్సులు తెచ్చి తెలంగాణలో నడుపుదామని భావించిన టీఆర్ఎస్ సర్కార్‌కు చుక్కెదురైంది.

# ఆర్టీసీ సమ్మె సంపూర్ణం

- రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కని బస్సులు
- ఎక్కడికక్కడ అడ్డుకున్న కార్మికులు
- ప్రయాణికుల తీవ్ర అవస్థలు
- చెదురుమదురు ఘటనలు మినహా సమ్మె ప్రశాంతం
- పాక్షికంగా నడిచిన ప్రైవేటు సర్వీసులు
- మంథని , నాగర్‌కర్నూల్‌లో ఆర్టీసీ బస్సుపై దాడి
- మహబూబాబాద్‌లో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం
- యాదగిరిగుట్టలో ప్రైవేటు డ్రైవర్‌పై మహిళా కండక్టర్ చెప్పుతో దాడి.. కేసు నమోదు




**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. శాశ్వత ఉద్యోగులతో పాటు తాత్కాలిక ఉద్యోగులు కూడా పాల్గొనడం తో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. సమ్మె శాంతియు తంగా కొనసాగుతుండడంతో ఎక్కడా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తలేదు. సమ్మె కారణంగా వేలాది బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కొన్ని ప్రాంతాలు మినహా ఎక్కడా బస్సులు నడిపేందుకు ప్రైవేట్ డ్రైవర్లు ముందుకు రాలేదు. ట్రక్కులు, లారీలు, ఇతర వాహనాలు నడిపే వారందరినీ రోజువారీ అద్దె ప్రాతిపదికన బస్సులు నడిపించేందుకు ముందుకు రావాలని ఆర్టీసీ చేసిన విజ్ఞప్తిపట్ల మొదటిరోజు పెద్దగా స్పందన కనిపించలేదు. ఒకటి, రెండుచోట్ల కొన్ని సంఘాల్లోని కార్మికులు బస్సులు నడిపించేందుకు డిపోలకు వెళ్లినా.. అనంతరం నేతల ఆదేశంతో సమ్మెకు సంఘీభావం తెలపక తప్పలేదు. చాలా చోట్ల ముందు జాగ్రత్త చర్యగా నేతలను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు.

♦ కరీంనగర్ వ్యాప్తంగా 275 మంది తాత్కాలిక ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్ఎం జీవన్ ప్రసాద్ తెలిపారు. 161 మందిని డ్రైవర్లను నియమిం చామని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో 858 బస్సులు డిపోలకే పరిమితం కాగా, 2,999 మంది సమ్మెలో పాల్గొన్నారు.

♦ గోదావరిఖని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, వేములవాడ, సిరిసిల్ల, పెద్దపల్లి, మంథని, హుజూరాబాద్ ప్రాంతాలకు రాకపోకలు జరిగాయి. పెద్దపల్లి జిల్లా మంథని శివారులో ఆర్టీసీ బస్సుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు.

♦ మహబూబాబాద్ జిల్లాలో ఓ ఆర్టీసీ డ్రైవర్ కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు.

♦ వరంగల్ జిల్లాలో 9 డిపోల్లో 942 బస్సులుండగా, సంస్థకు చెందిన 712 బస్సులు నిలిచిపోయాయి. మిగతా 230 అద్దె బస్సులను ప్రైవేట్ డ్రైవర్లతో పాక్షికంగా నడిపించారు.

♦ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 657 మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించారు. వీరిలో 428 మంది డ్రైవర్లు, 229 మంది కండక్టర్లున్నారు.

♦ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 359 ప్రైవేట్ బస్సులను నడిపించారు.

♦ హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ వస్తున్న బస్సుపై బిజినేపల్లి మండలం కొటాల్‌గడ్డ వద్ద ముసుగులు ధరించి బైక్‌లపై వచ్చిన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేయగా పూర్తిగా ధ్వంసమైంది.

♦ అచ్చంపేట బస్టాండ్ కూడలి వద్ద ప్రైవేట్ వాహనాలను ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అడ్డుకున్నారు.

♦ మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో 97 సర్వీస్‌లను మాత్రమే నడిపించగలిగారు.

♦ గద్వాల జిల్లాలో కేవలం 22 అద్దె బస్సులు రోడ్డెక్కాయి.

♦ ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 7 డిపోల్లో 750 బస్సులకుగానూ 300 అద్దె బస్సులను ప్రైవేట్ డ్రైవర్లతో పాక్షికంగా నడిపించారు. సమ్మెకు కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ, సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు మద్దతు తెలిపారు.

♦ యాదగిరిగుట్ట డిపో వద్ద ఓ ప్రైవేట్ డ్రైవర్ బస్సును నడిపేందుకు ప్రయత్నించగా మహిళా కండక్టర్ చెప్పుతో దాడి చేసింది. పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు.

♦ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అన్ని బస్టాండ్‌లు వెలవెలబోయాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో కార్మికులు కొన్ని బస్సు టైర్లకు మేకులు కొట్టి పంక్చర్ చేశారు.

## ఊళ్లకు ఎట్ల పోవాలె బిడ్డా!

- బస్సు సమ్మెతో ప్రయాణికులకు కష్టాలు
- ప్రైవేటు వాహనాల నిలువు దోపిడీ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దసరా పండుగను సొంతూళ్లో జరుపుకొవాలనుకునే ప్రయాణీకు లను ఆర్టీసీ సమ్మె కష్టాలు వెంటాడాయి. తెల్లవారితే ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగ ఉండటంతో శనివారం ఊర్లకు వెళ్లాలనుకున్న ప్రయాణీ కులు ఆర్టీసీ సమ్మెతో చాలా ఇబ్బందు లు పడ్డారు. పండుగ ప్రయాణీకులతోపాటు వైద్యం కోసం హైదరాబాద్ వచ్చిన రోగులు, హైదరాబాద్‌లోని తమ పిల్లలను పండుగకు ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చిన వారు బస్సుల కోసం బస్టాండ్లలో గంటల తరబడి వేచి ఉన్నా ప్రయోజనం లేకపోయింది. ప్రయాణీకులతోపాటు బస్టాండ్లలోని లైసన్సు పోర్టర్లు(హమాలీలు), దుకాణాదారు లు కూడా సమ్మెతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సులు నడవకపోవటంతో చేసేదేమీ లేక ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ రోజుల్లోనే కిక్కిరిసి పోయి ఉండే జూబ్లీ, ఇమ్లీబన్ బస్టాండ్లు కార్మికుల సమ్మెతో బస్సుల రాకపోకలు లేక బోసిపోయాయి. ఇమ్లిబన్ బస్టాండ్ నుంచి రోజూ 3500 బస్సులు ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరుస్తాయి. రోజూ 1లక్షా యాభైవేలమంది ప్రయాణీకులు ఇక్కడి నుంచి తమ గమ్యస్థానాలకు వెళుతుంటారు. సమ్మె కారణంగా మొదటి రోజు శనివారం బస్సుల రాకపోకలు లేక ఇమ్లిబన్ బస్టాండ్ బోసిపోయింది. పొరుగు రాష్ట్రా లైన ఏపీఎస్ఆర్టీసీ, కేఎస్ఆర్టీసీ బస్సులు మినహా టీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులు కొనసాగలేదు. అయితే కొన్ని రూట్లలో అధికారులు పరిమిత సంఖ్యలో బస్సులు సర్వీసులను నడిపారు. అయినా అవి ప్రయాణీకుల రద్దీకి సరిపోలేదు.

హన్మకొండకు వెళ్లేందుకు రెండు గంటలుగా ఇమ్లీబన్ బస్టాండ్‌లో వేచి చూస్తున్నా. బస్సులు రావటం లేదు. చిన్నపిల్లలతో ఇంత సేపు వేచి ఉండాల్సి రావటం కష్టంగా ఉంది. ప్రయివేటు వాహనాల్లో వెళ్లాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడ్డాయి. సాధారణంగా అయితే నలుగురం కుటుంబ సభ్యులమంతా రూ.500 నుంచి రూ.600 ఖర్చుతో వెళ్లేవాళ్లం. సమ్మె కారణంగా ప్రయివేటు వాహనదారులు రూ.2వేల దాకా డిమాండ్ చేస్తున్నారని హన్మకొండ ప్రయాణికుడు నిట్టూర్చుడు

నా కోడలు పూజ హైదరాబాద్‌లో చదువుకుంటోంది. ఆమెను పండుగకు ఇంటికి తీసుకెళదామని వస్తే బస్సులు రావటం లేదు. కార్మికుల సమ్మెతో ఊళ్లకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నాం. ప్రయివేటు వాహనదారు లు డబుల్ చార్జీలు వసూలు చేస్తున్నారు. అంటూ అచ్చంపేట ప్రయాణికుడు శ్రీనివాస్ వాపోయాడు.

**సవరణ**
నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో ఉన్నది) యొక్క వాటాదారుల గమనిక కొరకు
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సెప్టెంబరు 6, 2019న ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురించబడిన పైన తెలిపిన సదరు కంపెనీ యొక్క బహిరంగ ప్రకటనకు సంబంధించి ఇ-మెయిల్ ఐడిని rp.ramakrishnagupta.gmail.com బదులుగా rp.ramakrishnagupta@gmail.com అని చదువుకోగలరు.

# నో టికెట్...ఓన్లీ టిక్

- కాగితాలపై ప్రయాణికుల సంఖ్య
- టికెట్ మిషన్‌లపై లేని అవగాహన
- సిటీ బస్సుల్లోనూ ఇదే తంతు
- తాత్కాలిక సిబ్బంది జేబులోకి సొమ్ము
- డ్రైవర్‌కు వాటా ఇస్తున్న కండక్టర్..!
- ప్రైవేటు ఆపరేటర్ల నిలువు దోపిడీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ సమ్మె ప్రయాణీకులను గిలగిల కొట్టుకునేలా చేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో దసరా, బతుకమ్మ పండగలు అత్యంత ప్రధానమైనవి కావడంతో పట్టణం పల్లెబాట పట్టింది. విజయదశమి మంగళవారం రావటంతో సోమవారం ఒక్కరోజు సెలవు పెట్టుకుంటే శని, ఆదివారాల సెలవురోజులు కలిసిరావటంతో నగరవాసులు 4 రోజుల పల్లెబాటకు ఎంతో ఉత్సాహపడ్డారు. అయితే వారి ఉత్సాహం ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రైవేటు ఆపరేటర్ల పాలిటబడి నీరుగారుతోంది.

తాత్కాలికంగా ఎంపిక చేసి నడిపిస్తున్న ఆర్టీసీ బస్సుల్లో సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. డిజిటల్ మిషన్ ఉపయోగించడం రాని కారణంగా ప్రయాణీకుల నుంచి నేరుగా చార్జీలు తీసుకునే అవకాశం అధికారులు కల్పించారు. ఇక్కడే తాత్కాలిక సిబ్బంది తమచేతి వాటం చూపుతున్నారు. పేపర్‌పై ఎంత మంది ఏ స్టేజీ వరకు ప్రయాణిస్తారో కండక్టర్ టిక్కు వేస్తూ చార్జీ వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేసిన చార్జీకి కచ్చితమైన లెక్క లేకపోవటంతో కొంత కండక్టర్ జేబులోకి చేరుతోంది. ఇలా దారి మళ్లించిన సొమ్ములో డ్రైవర్‌కు కూడా వాటా ఇస్తున్నట్టు సమాచారం.

### ఒక్కో ఆపరేటర్.. ఒక్కో ధర

శనివారం ఉదయం నుంచే ప్రైవేటు ఆపరేటర్లు చార్జీలన్నీ పెంచేశారు. హైదరాబాద్ నుంచి ఇటు రాయలసీమ, అటు కోస్తాంధ్రా ప్రాంతాలకు వెళ్లే బస్సులు అదనపు చార్జీల పేరుతో



ప్రయాణీకుల జేబులకు చిల్లు పెడుతున్నారు. చార్జీలు ఒక్కో ప్రైవేటు ఆపరేటర్ ఒక్కో విధంగా వసూలు చేస్తున్నారు. బస్సు చార్జీలు విమాన టికెట్లతో పోటీ పడుతున్నాయి. హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారితో పాటు ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే వారి వద్ద నుంచి కూడా సాధారణ చార్జీలకంటే రూ.100 అధికంగా దండుకుంటు న్నారు. మధ్యలో ఎక్కడ దిగినా సరే ఇదే చార్జి అంటున్నారు.

### ట్యాక్స్ పేరుతో దోపిడీ

ప్రైవేటు కార్మికులను ఏర్పాటు చేసి నడపుతున్న ఆర్టీసీ బస్సుల్లో కూడా పండుగ ట్యాక్స్ పేరుతో హైదరాబాద్ నుంచి కర్నూలు, విజయవాడ, తదితర దూరప్రాంతాలకు ప్రయాణించే వారినుంచి సాధారణ రోజుల్లో చార్జీల కంటే రూ.100 అధికంగా వసూలు చేస్తున్నట్టు ప్రయాణికులు ఆరోపిస్తు న్నారు. చార్జీల దోపిడీ కారణంగా కొందరు ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు.

### భారీగా పెరిగిన ఆటో చార్జీలు

ఆర్టీసీ కార్మికుల సమ్మెతో నగరంలో ఆటో చార్జీలు కూడా అదుపుతప్పాయి. సాధారణ చార్జీ రెండింతలు పెంచి వసూలు చేస్తున్నారు. అమీర్‌పేట నుంచి కాచిగూడకు రూ.250 వసూలు చేస్తున్నారు. అమీర్‌పేట నుంచి సికింద్రాబాద్ స్టేషన్‌కు రూ.200 దండుకుంటున్నారు. ఉబర్ వంటి ట్యాక్సీ ఆపరేటర్లు కూడా చార్జీలను పెంచి వసూలు చేస్తున్నారు.

### ప్రైవేటు చార్జీల మోత

- హైదరాబాద్ - తిరుపతి రూ.1600
- హైదరాబాద్ - కడప రూ.1000
- హైదరాబాద్ - విజయవాడ రూ.1100
- హైదరాబాద్ - భద్రాచలం రూ.1000
- హైదరాబాద్ - బెంగుళూరు రూ.2500
- హైదరాబాద్ - వరంగల్ రూ.400
- హైదరాబాద్ - కరీంనగర్ రూ.500

# దసరదా సమయాన!



ఒకవంక దసరా పండుగ కోలాహలం..మరోవంక అడపాదడపా వానల పలకరింపులు..రెండు తెలుగు రాష్ట్రాల్లో దసరా పండగ రెండు రకాలుగా కనిపిస్తున్నది. తెలంగాణాలో ఆర్టీసీ సమ్మె తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. అందులోనూ ఇక్కడ దసరాతోపాటు ఎంతో ముఖ్యమైన సాంప్రదాయక పండుగ బతుకమ్మకు ఎంతో విశిష్టత ఉంది. రాష్ట్రమంతటా బతుకమ్మ సందడి ఆహ్లాదకర వాతావరణంలో ప్రతిధ్వనిస్తున్నది. అయితే ఎంతలేదన్నా రెండు ప్రధాన పండుగల సమ్మేళనానికి బస్సుల సమ్మె ఎంతోకొంత ప్రతిబంధకంగానే ఉంది. ముఖ్యంగా ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుక. తొమ్మిది రోజుల పండుగకు ఇది పతాక సన్నివేశం. ఇంటింటా పెద్ద పండుగలా జరుపుకునే వేడుక. ఎక్కడెక్కడివాళ్లూ ఇళ్లకు చేరే సందర్భం. ఇక్కడినుంచి జిల్లాలకు, పక్క రాష్ట్రానికి వెళ్లడానికి ప్రభుత్వ రవాణా సదుపాయానికి అంతరాయం ఏర్పడింది. తెలంగాణా ఆర్టీసీ కార్మిక సంఘాలు ప్రభుత్వ అల్టిమేటమ్‌ని సైతం ఖాతరు చేయదలుచుకోలేదని స్పష్టం చేశాయి. ప్రత్యామ్నాయంగా ఇత ర రాష్ట్రాల నుంచి బస్సులను తెప్పించే పనిలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైఉంది. శనివారం సాయంత్రం ఆరింటిలోగా విధులకు హాజరు కాకపోతే ఉద్యోగాలు వదులుకోవాల్సిందేనన్న హెచ్చరిక కూడా ఆర్టీసీ సిబ్బందిని కదిలించలేకపోయింది. సీఎం కేసీఆర్ ఈ విషయంలో కఠినంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అందుకనుగుణంగానే ఆర్టీసీ సిబ్బందికి తుదివిడతగా ఒక పిలుపిచ్చారు. సమస్యలను సానుకూలంగా చర్చించుకుని, పరిష్కరించుకోవచ్చునన్నదే ఆ పిలుపు సారాంశం. ఆర్టీసీ కార్మిక సంఘాల తదుపరి అడుగులు ఎటు పడతాయన్నది చూడాల్సిందే. సమ్మె ఆగకపోతే ప్రభుత్వ పక్షం నుంచీ తదనంతర పరిణామాల ప్రభావం వెన్వెంటనే కనిపించవచ్చు. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే అక్కడ దసరా పండుగ సరికొత్త వాతావరణాన్ని సృష్టించింది. కొత్త ప్రభుత్వం..కొత్త అడుగులు..కొత్త పథకాలు... ఇప్పటిదాకా కొత్త ప్రభుత్వం వేసిన అడుగుల్లో వివాదాలున్నాయి..విశేషాలున్నాయి. ముఖ్యంగా ఉద్యోగమేళా గురించి చెప్పుకోవాలి. జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైకాపా ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే ఉద్యోగ విప్లవం తెరమీదికొచ్చింది. లక్షల సంఖ్యలో గ్రామ వాలంటీర్లతో పాటు గ్రామ సచివాలయ సిబ్బందిని భారీ ఎత్తున నియమించారు. సాధారణంగా నియామకాలు అనగానే సుదీర్ఘ ప్రక్రియ ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడం.. పరిశీలనలు..రాత పరీక్షలు..ఇంటర్వ్యూలు..నెలలు, ఏళ్లు సాగే ప్రక్రియ ఇది. కాని అతి స్వల్పకాలంలో ఇంత పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇవ్వడమనేది ఒక సంచలనమే. కొన్ని సందర్భాల్లో జీతం ఎంతనేది పెద్ద విషయం కాబోదు. నిరుద్యోగులుగా ఉన్న అర్హులైన వారికి తక్షణం ఏదొక ఉపాధి దొరకడమనేది ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక సానుకూలాంశంగానే పరిగణించాలి. మొత్తంమీద అయిదు వేలనుంచి పదిహేను వేల రూపాయల దాకా జీతభత్యాలు వస్తున్నాయంటే దీన్ని గణనీయమైన పరిణామంగానే భావించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ఆపాటి సంపాదన కూడా లేని యువత ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాసేలా ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఈ ఉద్యోగాలు వరమేనని వేరే చెప్పనక్కర్లేదు. ఈ ఉద్యోగాల్లో నియమితులైన మహిళలకు ప్రభుత్వోద్యోగాలు చేసుకునే మహిళలకు ఉండే సదుపాయాలు కల్పించడాన్ని మరిచిపోకూడదు. ఇక మూడోశ్రేణి ఉపాధి అవకాశాల గురించి చెప్పుకుంటే.. మద్యం షాపుల్లో యువకులకు ఉపాధి. ఇందులో రెండు రకాల ఉద్యోగాలిచ్చారు. సేల్స్‌మన్, సూపర్‌వైజర్. పదిహేను వేల రూపాయలు, పదిహేడువేల రూపాయలు జీతం. మద్యం దుకాణాలను ప్రభుత్వం నడపడాన్నే అభ్యంతరపెట్టేవాళ్లు చాలామంది ఉన్నారు. అసలు మద్యమే ఒక మహమ్మారి. దాన్ని అరికట్టాలనే అందరూ కోరుకుంటారు. కాని అరికట్టడమెలాగన్నదే ప్రశ్న. గతంలోనూ కొన్ని ప్రభుత్వాలు మద్యనిషేధాన్ని అమలుచేసే ప్రయత్నం చేసి తీరా అది నిష్ఫలమై వెనక్కి తగ్గిన సంఘటనలున్నాయి. దశలవారీగా మద్యనిషేధాన్ని అమలు చేస్తామని జగన్ తన ఎన్నికల ప్రణాళికలోనే ప్రకటించారు. అందుకు తగ్గట్టే అధికారంలోకి వచ్చీరాగానే ముందుగా బెల్ట్ షాపులను తొలగించే పని చేపట్టారు. రెండోదశలో ప్రభుత్వమే మద్యం అమ్మకాలను చేపట్టడం ద్వారా మద్యాన్ని నియంత్రించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే మొన్న అక్టోబరు ఒకట నుంచి మద్యం దుకాణాలు వెలిశాయి. వాటిల్లో చాలామందికి ఉద్యోగాలు దొరికాయి. రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల నివాసిత గృహాల మధ్య మద్యం షాపులు పెట్టిన సంఘనలు వెలుగులోకి వస్తున్నాయి. వాటిమీద ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. మద్యం షాపులను ప్రభుత్వం నడపడం నైతికమా అనైతికమా అన్నది ఒక ప్రశ్న. నైతికమని ఎవ్వరూ అనరు. కాని మద్యనిషేధాన్ని అమలుచేయడానికి జగన్ ప్రభుత్వం ఒక మార్గం ఎంచుకున్నది. దాని సాఫల్యవైఫల్యాలు ఎలా ఉంటాయన్నది కాలమే చెప్పాలి. కాని ప్రాథమికంగా బెల్ట్ షాపుల విషయంలో సానుకూల ఫలితాలు వచ్చినందున ప్రభుత్వం ఈ దిశగా వేస్తున్న అడుగులను అనుమానించకుండా ఆహ్వానించి మద్దతు ఇవ్వడం ముఖ్యమని వైకాపా శ్రేణులు భావిస్తున్నాయి. దానికన్నా కూడ జగన్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు కల్పించిన ఉపాధి అవకాశాల కోణంలోనే దీన్ని చూడాలన్నది సామాజిక విశ్లేషకుల అభిప్రాయం. విడిపోయిన రాష్ట్రంలో అయిదేళ్ల తర్వాత ఒక్కసారిగా లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి దొరకడాన్ని సాదాసీదా విషయంగా చూడటం భావ్యం కాదన్నది వారి ఉద్దేశం. దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి ప్రయోగం ఇంతవరకు జరగలేదు. అతి తక్కువ వ్యవధిలో హామీని నెరవేర్చే క్రమంలో జగన్ ప్రభుత్వం చేసిన ఈ సాహసం నిస్సందేహంగా ఇతర రాష్ట్రాలకు ఆసక్తి కలిగిస్తుందని ఆశించొచ్చు. గ్రామ వాలంటీర్ల వ్యవస్థను విమర్శిస్తున్న వారు లేవనెత్తుతున్న సందేహాలను నిర్మాణాత్మక దృష్టితో పరిశీలించి ఆ వ్యవస్థను లోపరహితంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఉంది. ఏ వ్యవస్థ అయినా తొలి అడుగు నుంచే పరిపక్వతతో ఆవిర్భవించదు. కొన్ని వ్యవస్థలను ప్రాథమికంగా ఏర్పాటు చేసుకుని, కాలక్రమంలో వాటిని పరిపుష్టం చేసుకోవాల్సి ఉంటుంది. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ చట్టాన్ని ఇప్పటికీ కాలానుగతంగా సమీక్షిస్తూ మార్పుచేర్పులు చేస్తున్నారు. 2017 జులై ఫస్టున దీన్ని తెచ్చారు. రెండేళ్లు దాటిన తర్వాత కూడా ఇది సర్వామోదిత చట్టంగా రూపుదిద్దుకోలేకపోయింది. గ్రామ వాలంటీర్ల వ్యవస్థలో లోపాలుంటే అవి కార్యాచరణలో వెలుగులోకి వస్తుంటాయి. అనివార్యంగా వాటిని చక్కదిద్దుకోవాల్సి ఉంటుంది. అది అనివార్యమైన ప్రక్రియ. ఇతరత్రా విమర్శనాత్మక వైఖరిని పక్కనబెడితే, ఆంధ్ర ప్రదేశ్‌లో ఇంత భారీ ఎత్తున ఉద్యోగాలు పొందిన కుటుం బాల్లో ఈ దసరా కొత్త వెలుగులు నింపిందని అక్కడి వాతావరణమే చెబుతున్నది. మరోవంక ఆటోడ్రయివర్లకు ఏడాదికి పదివేలిచ్చే పథకాన్ని ముఖ్యమంత్రి జగనే స్వయంగా ప్రారంభించారు. ఆ పదివేలతోనే ఆటోవాలాల సమస్య లు తీరతాయని అనుకుంటే అది అతిశయోక్తే అవుతుంది. కాని ఆటోలు నడుపుకొనే వారికి ఎదురయ్యే కొన్ని ఆర్థిక సమస్యలకు ఆ పదివేలు వేడినీళ్లకు చన్నీళ్లలా ఉపయోగిస్తాయి. ఏమీలేని చోట ఓ నూలుపోగు కనిపించినా విశేషమే అనుకుంటే ఆ పదివేల విలువను అర్థం చేసు కోవచ్చు. ఆంధ్ర ప్రదేశ్‌లో రాజకీయాలు పాలకు పాలు నీళ్లకు నీళ్ల మాదిరి కాకుండా కలుషితమైన నేపథ్యంలో ప్రభుత్వాలు వేసే ప్రతి ఒక్క అడుగులోనూ ప్రత్యర్థులకు చీకటి ముద్రలు కనిపించడం అలవాటుగా మారిపోయింది. రాష్ట్రంలో మూడు ప్రధాన పార్టీలున్నాయి. వైకాపా, తెలుగుదేశం, బీజేపీ. గత అయిదేళ్లలో వైకాప, తెలుగుదేశం పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఆయా పార్టీల నాయకులు రాజకీయ ప్రత్యర్థుల్లా కాక రాజకీయ శత్రువుల్లా మెలిగారు. రెండో టరమ్ వచ్చేసరికి బీజేపీ గళం పెరిగింది. మూడు ప్రధాన రాజకీయ పక్షాలయ్యాయి. తెలుగుదేశం మొన్నటి ఘోర పరాజయం నుంచి నైతికంగా ఇంకా కోలుకోలేని స్థితిలోనే ఉంది. బీజేపీ సహజంగా ఆ స్థానాన్ని భర్తీ చేసే ప్రయత్నాల్లో ఉంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వ చర్యల్ని నిశితంగా గమనిస్తూ అడుగులు వేస్తున్నది. మూడు పార్టీల రాజకీయ చక్రవ్యూహంలో జగన్ ప్రభుత్వం తానుచేపట్టే ప్రతిఒక్క చర్యను నిర్మాణాత్మకంగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇరవై నాలుగ్గంటల వ్యవధిలో ఢిల్లీలో ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. శుక్రవారం సాయంత్రం తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రధానితో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లను కలిశారు. ప్రధాని మోడీతో దాదాపు గంటపాటు సుదీర్ఘంగా సమావేశమయ్యారు. అటు మోడీ, ఇటు కేసీఆర్ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చాక వారిద్దరి మధ్యా జరిగిన తొలి భేటీ ఇది. పెండింగులో ఉన్న దాదాపు ఇరవై మూడు అంశాలను కేసీఆర్ ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అన్నింటికన్నా ముఖ్యంగా..ఆయన ప్రధాని మోడీకి జాతీయస్థాయిలో ఒకేఒక అభివృద్ధి అజెండాను ఆవిష్కరిస్తే దేశవ్యాప్తంగా సమతుల్య అభివృద్ధికి ఆస్కారముంటుందని సలహా ఇచ్చినట్టు తెలిసింది. తెలంగాణ పథకాలను ప్రాతిపదికగా తీసుకుని విస్తృత ప్రయోజనకరమైన ప్రణాళికను రూపొందించాల్సిన అవసరాన్ని ప్రధాని మోడీ దృష్టికి తీసుకెళ్లినట్టు చెబుతున్నారు. సహజంగానే రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి, సహాయ సహకారాల గురించి కూడా ప్రస్తావించారు. అలాగే విభజన సమస్యలు. కృష్ణా-గోదావరి అనుసంధానం. కేంద్రం-రాష్ట్రాల మధ్య సమన్వయ సాధనకు ఇలాంటి సమావేశాలు ఉపకరిస్తాయి. శనివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా ప్రధాని మోడీతో సమావేశమయ్యారు. తెలంగాణ సీఎం కేసీఆర్ మోడీని కలిసిన మరునాడే జగన్ కూడా కలవడం కాకతాళీయమే. ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసికట్టుగా సమన్వయంతో నడుస్తున్న నేపథ్యంలో అది ఢిల్లీస్థాయిలో కూడా ప్రతిబింబించిందని అనుకోవాలి తప్ప ఇందులో ప్రత్యేకించి నిశిత పరిశీలన చేయాల్సిందేమీ లేదు. ఏపీలో రైతు భరోసా ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధాని మోడీని ఆహ్వానించడం ద్వారా కొన్ని రాజకీయపరమైన చిక్కుల్ని నివారించుకునే ప్రయత్నంగా భావించాలి. రివర్స్ టెండరింగ్, పోలవరం, పీపీఏలు తదితర అంశాల మీద మంచుతెరల్ని తొలగించేందుకు ఇదొక సదవకాశమైంది!

**- వయ్యస్సా రెస్**

## తెలంగాణ సంస్కృతికి కలికితురాయి బతుకమ్మ

తెలంగాణ ప్రాంతానికి అపారమైన సాంస్కృతిక వారసత్వ సంపద ఉంది. చరిత్ర పూర్వయుగంలోనే ఇక్కడ ఘనమైన నాగరికత పరిఢవిల్లింది. ప్రపంచ కథా సాహిత్యంలోనే మొట్టమొదటిదని భావించబడుతున్న బృహత్ కథను రచించిన గుణాఢ్యుడు పటాంచెరువు ప్రాంతంవాడని పరిశోధకులు భావిస్తున్నారు. అలాగే మహాకవి దాళిదాసు కావ్యాలకు వ్యాఖ్యానాలు రచించిన ప్రఖ్యాతసంస్కృతపండితుడు కోలాచలం మల్లినాథసూరి మెదక్ జిల్లా కొల్చారం గ్రామవాసి. కోలాచలమే కాలక్రమంలో ''కొల్చారం''గా మారింది. ''వాణి - నా రాణి'' అని సగర్వంగా ప్రకటించుకున్న పిల్లల మఱ్ఱి పినవీరభద్ర కవి స్వగ్రామం పిల్లలమఱ్ఱి నల్గొండ జిల్లాలో ఉంది. ఇలాచెప్పుకుంటూ పోతే ఎందరో మహాకవులు తెలంగాణ గడ్డపై ఉద్భవించారు. తెలంగాణ జానపద కళాసాహిత్యాలకు కూడా పురిటిగడ్డ. ఇక్కడ లేని జానపద ప్రక్రియ అంటూ లేదు. స్త్రీల పాటలు కోలాటాలు, పేదరాసి పెద్దమ్మ కథలు, జానపద కథా గేయాలు, పారిశ్రామిక గేయాలు, తోలుబొమ్మలాటలు, వీధి నాటకాలు (బైలాటలు), మార్మికతతో కూడుకున్న తాత్విక గేయాలు, పొడుపు కథలు, సామెతలు, పిల్లల పాటలు, జాజిరి పాటలు, ఉయ్యాల పాటలు, శృంగార గేయాలు, వీరగాథలు - ఇలాంటి గేయసాహిత్యంతో పాటు జానపద నృత్యాలు, గిరిజన నృత్యాలు కోకొల్లలుగా తెలంగాణ గ్రామీణ వాతావరణంలో తరతరాలుగా మనుగడ సాగిస్తున్నాయి.

తెలంగాణలో జరిపే బోనాల పండుగ, బతుకమ్మ పండుగ, పీర్ల పండుగ, తీజ్ పండుగ తెలంగాణ జీవన విధానానికి ప్రతీకలు. మరే ప్రాంతంలోనూ ఇటువంటి పండుగలు లేవు. నిరుపమానమైన, ఎంతో ఉత్కృష్టమైన తెలంగాణ సంస్కృతి రాజకీయ కారణాల వల్ల గతంలో కొంత మరుగున పడిపోయిన మాట వాస్తవం. తెలంగాణ సంస్కృతి పట్ల మనలో స్ఫూర్తిని రగిలించిన మహావ్యక్తి మన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు. తెలంగాణ ప్రజలను రాజకీయంగానే కాక సాంస్కృతికంగా కూడా జాగృతం చేసి, మహాత్మాగాంధీ పంథాలో ఎక్కడా హింసకు తావులేకుండా అనితరసాధ్యమైన రీతిలో 14 సంవత్సరాల సుదీర్ఘ కాలం ఒక మహోద్యమాన్ని నడిపి, ముందుగా మనలో సాంస్కృతిక చైతన్యాన్ని రగిల్చి, తెలంగాణ గత వైభవాన్ని మనకు గుర్తుచేసి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పరిణితి చెందిన రాజనీతిజ్ఞుడు మన కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడుతుందని ఎవరూ కలలో కూడా ఊహించలేదు. రాజకీయ నేతలందరూ కేసీఆర్ ది అంతా వృథా ప్రయాస అన్నవారే. అయితే కేసీఆర్ ఎట్లా అయితే గాంధీజీ మన దేశానికి స్వాతంత్ర్యం కంటే ముందు మనలోని అస్పృశ్యత, అశుభ్రత, అవినీతి, అనైతికత వంటి సామాజిక రుగ్మతలను నశింపడానికి ప్రజలను చైతన్యవంతులను చేశారో, అదే పద్ధతిలో కేసీఆర్ తెలంగాణాకు మాత్రమే సొంతమైన మన గత సాంస్కృతిక వైభవాన్ని ప్రజలకు గుర్తుచేసి, ప్రజలను జాగృతం చేశారు. అందులో ముఖ్యమైనవి మన బోనాలపండుగ, మన బతుకమ్మ పండుగ. నిజం చెప్పాలంటే తెలంగాణ చాలా ప్రాంతాలలో ఈ పండుగలను జనం మర్చేపోయారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి మూలంగా మన సంస్కృతికి పునర్వికాసం, పునరుజ్జీవనం కలిగాయి. ఈ విషయంలో మన మాజీ ఎంపి శ్రీమతి కల్వకుంట్ల కవిత పోషించిన పాత్ర అద్వితీయమైంది. తెలం గాణ జాగృతి సంస్థను స్థాపిం చి, బతుకమ్మ పండుగను వాడవాడలా నిర్వహించడమే కాక అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోనూ, ఉద్యోగినులతో పాటు ఐఎఎస్, ఐపిఎస్ అధికారిణులు, మంత్రులు కలిసి ఒకేచోట బతుకమ్మ ఆడటం ఒక అపూర్వమైన సన్నివేశం. తరతమ భేదాలను మరచి సుహృద్భావ వాతావరణంలో అన్ని వర్గాల వారు కలిసి ఇటువంటి సాంస్కృతిక ఉత్సవాలలో చేయి చేయి కలిపి పాల్గొనడం దేశ చరిత్రలోనే ఒక అరుదైన సంఘటన. దేశంలోనే కాక విదేశాల్లో కూడా బతుకమ్మకు బహుళ ప్రాచుర్యం కల్పించిన ఘనత శ్రీమతి కవితకే దక్కుతుంది. ఆమె రోజుకు ఒక దేశం చొప్పున తొమ్మిది రోజుల పాటు తొమ్మిది దేశాలలో బతుకమ్మ ఆడించి, చివరి రోజైన సద్దుల బతుకమ్మకు హైదరాబాద్‌కు వచ్చి, ఇక్కడ బతుకమ్మ ఉత్సవాలో పాల్గొని మూడేళ్ళ క్రిందట రికార్డు సృష్టించారు.



ఒక్కో రోజు ఒక్కో రూపంతో బతుకమ్మను పూజిస్తారు. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ, రెండవ రోజు అటుకుల బతుకమ్మ, మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాల్గవరోజు నానే బియ్యం బతుకమ్మ, ఐదవ రోజు అట్ల బతుకమ్మ, ఆరవ రోజు అలిగిన బతుకమ్మ, ఏడవ రోజు సకినాల బతుకమ్మ లేదా వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్నముద్దల బతుకమ్మ, తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా గౌరీ దేవి అమ్మవారు పూజలందుకుంటుంది.

బతుకమ్మ వేడుకల చివరి రోజు సాయంత్రం ముత్తయిదువులందరూ కొత్త బట్టలు, ఆభరణాలు ధరించి బతుకమ్మను వాకిట్లో పెడతారు. ఇరుగు పొరుగు ఇళ్ళవారు కూడా తమ బతుకమ్మలను ఇదే విధంగా తెచ్చి పెడతారు. అందరూ కలిసి వలయాకారంలో మానవహారంగా ఈ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడతారు. చీకటి పడే వేళకు ఆడపడుచులందరూ తమ తమ బతుకమ్మలను తలలపై పెట్టుకుని, తమకు దగ్గరలో ఉన్న చెరువుకు కానీ పెద్ద బావికి గానీ ఊరేగింపుగా వెళ్లి పాటలు పాడుతూ బతుకమ్మలను నీట జారవిడుస్తారు. ఆ తర్వాత పంచదార, రొట్టెతో చేసిన 'మలీద' అనే వంటకాన్ని బంధువులకు పంచిపెడతారు. మనిషికి, ప్రకృతికి సంబంధించిన ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ఒక విశిష్ట స్థానాన్ని సముపార్జించి పెట్టింది. మనిషి జీవితానికి ప్రకృతితో విడదీయరాని అనుబంధం ఉంది. ప్రకృతి మనిషికి జీవంతోపాటు ఆహ్లాదాన్ని కూడా ఇస్తుంది. కానీ ఈ విషయాన్ని మర్చిపోయిన ఆధునిక మానవుడు యాంత్రికంగా మారి, అభివృద్ధి పేరిట ప్రకృతి విధ్వంసానికి పాల్పడుతున్నాడు. విచక్షణారహితంగా చెట్లను నరికివేస్తున్నాడు. దీనివల్ల భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు కూడా లభించని దుస్థితి ఏర్పడుతుంది. ఈ విషయాన్ని ఎంతో దూరదృష్టితో గ్రహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ తల్లిని పచ్చని వస్త్రంతో అలంకరించడానికి 'హరితహారం' కార్యక్రమాన్ని మరొక మహోద్యమంగా ముందుకు తీసుకువచ్చారు. మొన్న ఆగస్టు 15 నాడు గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన పిమ్మట మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరూ కుటుంబానికి ఆరు మొక్కలు చొప్పున నాటి, అవి పెరిగి పెద్దవయ్యేవరకు వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ఈ ఆశయాన్ని మనమందరం చిత్తశుద్ధితో నిర్వర్తించిననాడు ప్రకృతి మాత సంతోషిస్తుంది. అదే తెలంగాణ ప్రజలకు అసలైన బతుకమ్మ పండుగ.

జైహింద్... జై తెలంగాణ!



**-కోలేటి దామోదర్**
చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ
9849144406

# రాఘవ పాండవీయం

**కం. ఆ పట్టణ మేలెడిపృథి
వీపాలుడు భ్రుకుటిమాత్ర విముఖితసమదా
టోపారిపంక్తి రథుడు
ద్దీపించు నుదారనీతి ధృతరాష్ట్రుడనన్.**

**రామాయణార్థం :** భ్రుకుటిమాత్ర = బొమముడిచే, విముఖిత = వెనుకకు తిరుగునట్లుగా చేసిన, సమదాటోప = గర్వాతిశయముతో గూడిన, అరి = శత్రువులుగల, పంక్తి రథుడు = దశరథుడు, ఉదారనీతిన్ = ఉదారమైన నీతిచే, ధృత = ధరించబడిన, రాష్ట్రుడు = దేశము నేలువాడు, అనన్= అనగా, ఆ పట్టణము + ఏలెడు = ఆ నగరమును పాలించు, పృథివీపాలుడు = రాజు, ఉద్దీపించున్ = ప్రకాశించును.

**తాత్పర్యము :** తన బొమముడిచేతనే శత్రువులు వెనుకకు తిరుగునట్లుగా చేయగల గర్వాతిశయముగల దశరథుడు ఉదారమైన రాజనీతిచే ధరించబడిన దేశము నేలువాడుగా ఆ నగరమును పాలించుచు ప్రకాశించును

**భారతార్థము:** భ్రుకుటి మాత్ర విముఖిత సముదాటోపారి, పంక్తిరథుడు = శ్రేణులుగాగల రథములు గలవాడు, ధృతరాష్ట్రుడు + అనన్ = ధృతరాష్ట్ర మహారాజు అనగా.

**తాత్పర్యము:** తన బొమముడిచే శత్రు రాజులయొక్క రథముల శ్రేణులను వెనుకకు తిరుగునట్లుగా చేయగల గర్వాతి శయముతో గూడిన ఉదార రాజనీతి గల దృథరాష్ట్రుడనగా ఆ నగరమును పాలించు రాజు ప్రకాశించును.

**విశేషణము :** పంక్తిరథుడు - ''పంక్తి స్స్యాద్దశమచ్ఛందో దశసఙ్ఖ్యావళీషుచ'' - విశ్వనిఘంటువు : విముఖత = 'క్త' ప్రత్యయాంతము. ఉదా: సువర్ణ దండైకసితాత పత్రితజ్వలత్ ప్రతాపావళికీర్తిమండలః- = ''హర్షనైషధం. ఉదారనీతి'' 'ఉదారోదాత్తమహతోః'





**డా. ఆర్.అనంత పద్మనాభరావు**
రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్, దూరదర్శన్
9866586805

**చం. తెలివి నతిప్రగల్భు డసదృగ్బలు డాతడు భీష్మచాపకౌ
శలమె సహాయమై యమరశత్రుల నేపడపన్ వలంతియై
నిలుకడ నేలె విశ్వధరణిం దనమిత్రకులంబు వైభవో
జ్జ్వలత దలిర్ప బౌరవసుసంతతిరాజుల కెల్ల హెచ్చుగన్.**

**రామాయణార్థం:** తెలివిన్ = తెలివి తేటలతో, అతిప్రగల్బుడు = మిక్కిలి శౌర్యముగలవాడు, అసదృక్ + బలుడు = సాటిలేని బలముగలవాడు, ఆతడు = ఆ దశరథుడు, భీష్మ = భయంకరమైన , చాప కౌశలమె = వింటి యందలి నేర్పే, (ధనుర్విద్య) సహాయమై, అమరశత్రులన్ = దేవతల శత్రువులైన రాక్షసులను, ఏపు + అడపన్ = బలమును అణగద్రొక్కుటకు, వలంతియై = సమర్థుడై, విశ్వధరణిన్ = సమస్త భూప్రపంచమును, తన = తన యొక్క మిత్రకులంబు = సూర్యవంశము, వైభవ + ఉజ్జ్వలత = వైభవ ప్రకాశముచే, పౌర = పట్టణమువారి, వసు = ధనముల, సంతతి = సమూహము, రాజులకెల్ల, హెచ్చుగన్ = అధికముగా, నిలుకడన్ = వంశపారంపర్యముగా, ఏలెన్ = పాలించెను.

**తాత్పర్యము:** ఆ దశరథుడు తెలివితేటలు గలిగి, మిక్కిలి శౌర్యముగలవాడై, భయంకరమైన ధనుర్విద్య సహాయముగా రాక్షసుల బలము నణగద్రొక్కుటకు సమర్థుడై సమస్త భూప్రపంచమును తన సూర్యవంశవైభవ ప్రకాశముచే పౌరుల ధనసంతతిని రాజులందరికి హెచ్చునట్లు వంశపారంపర్యముగా పాలించెను.

**భారతార్థము :** తెలివిన్, అతి ప్రగల్బుడు - అసదృగ్ + బలుడు = దృష్టి బలము లేనివాడు, ధృతరాష్ట్రుడు, భీష్మ చాపకౌశలమె సహాయమై యమరగా శత్రులను, ఏ పడపన్ = సంహరించుటకు, వలంతియై, మిత్ర కులంబు = బంధువుల కులము, తలిర్పన్, పౌరవ = పూరుని సంబంధమైన, సుసంతతి = సత్కుల మందుగల, రాజులకు + ఎల్లన్ = యయాతి, భరతాది రాజుల కందరికిని, హెచ్చుగన్ = ఏలెన్.

విశేషణము : సదృక్ - 'సదృక్షస్సదృశస్సదృక్' - అని అమరకోశం.
మిత్ర = ద్యుమణిః తరణిః మిత్రః - అని అమరకోశం.
ఉజ్జ్వలతన్ = తత్ ప్రత్యయాంతము
వసు = 'వసురత్నధనే పిచ' అని అమరం. విశ్వ = విశ్వం కృత్స్నమ శేషం' అని అమరం.

## మహాభారతంలో... పురుషపుంగవులు

# ధర్మరాజు-1

పాండురాజు కిందమునిశాపకారణంగా తానుగా భార్యలవల్ల సంతానాన్ని పొందలేడు గాన దేవరన్యాయంతో బిడ్డల్ని పొందదలచి పెద్దభార్య కుంతీదేవిని అందుకు ఒప్పించాడు. సుదీర్ఘ విచారం తర్వాత కుంతీపాండురాజులు అందుకు సిద్ధపడ్డారు. కుంతీదేవి వ్యుషితాశ్వుడి కథ చెప్పింది. అనంతరం ఆతడు శ్వేత కేతు శాపాన్ని గూర్చి, భర్త నియోగంతో భార్య పరపురుషులవల్ల సంతానాన్ని పొందిన కల్మాషపాదుడి భార్య మదయంతిని గూర్చి, మరియు తన జన్మగూర్చి చెప్పాడు. దాంతో కుంతీదేవి దేవర న్యాయంతో పుత్రుల్ని కనడానికి అంగీకరించి తనకు దూర్వాసుడిచ్చిన వరాన్ని గూర్చి చెప్పి భర్త అనుమతితో యమధర్మరాజును ప్రార్థించి ఆతడి అనుగ్రహంతో గర్భం ధరించింది. సంవత్సరకాలం నిండగా శుభగ్రహస్థితిలో పుత్రుడు కలిగాడు. సమస్త ప్రకృతి పరవశించిపోయింది. ఆకాశవాణి ఈతడు ధర్మస్థిరమతి కాగలడని యుధిష్ఠురుడని నామకరణం చేసింది. శతశృంగ నివాసులైన మునులు సంతోషంగా జాతకర్మలు నిర్వర్తించారు. తర్వాత వాయుదేవుడి వలన భీముడిని, ఇంద్రుడి వల్ల అర్జునుడిని, అశ్వనీ దేవతలవల్ల మాద్రిదేవి యందు నకుల సహదేవుల్ని ఇలా పాండురాజు పుత్రపంచకాన్ని పొందాడు. తర్వాత కాల నియోగం వల్ల మాద్రిని పొంది మరణించాడు. దాంతో కుంతీదేవి పుత్రులతో హస్తినకు చేరింది. ధృతరాష్ట్రుడు తన పుత్రులు తమ్ముడి పుత్రులనే భేదం లేక పాండవుల్ని ఆదరించాడు. భీష్మ విదురులు ఎంతగానో వీరిని పరిరక్షించారు. హస్తినకు వచ్చేటప్పటికి వీరి వయసు ఇది. ధర్మరాజుకు పదహారు సంవత్సరాలు. భీముడికి పదిహేను సంవత్సరాలు. అర్జునుడికి పధ్నాలుగు సంవత్సరాలు. కవలలకు పదమూడు సంవత్సరాలు. వీరి వినయ విధేయతలు పెద్దలందరిని ఆకర్షిం చాయి. అందునా ధర్మజుడి నడవడిక అందర్నీ అలరించింది. ముందుగా కృపుడివల్ల, అనంతరం ద్రోణుడివల్ల విద్యనేర్చారు. దుర్యోధనాది కౌరవులతో ఎంతగా స్నేహంగా ప్రవర్తించినా దూరం పెరిగిందే గాని వారు దగ్గరవ్వలేదు. బాల్యక్రీడలలో భీముడి కారణంగా కౌరవులందరూ నొప్పిచెందారు. దాంతో కురుపాండవ వైరబీజం పడింది. ఆ అగ్నికి శకుని వాయువు తోడై మండింది. విద్యలో ధర్మరాజు భీముడంతగా, అర్జునుడంతగా రాణించలేదు. ద్రోణుడు పెట్టిన పరీక్షలో నెగ్గలేదు. పక్షి శిరస్సునే గాక, గురువును, తమ్ములను, చెట్టును చూస్తున్నానని పలికి మందలింపబడ్డాడు. ఇట్లే భీమ నకుల సహదేవులు, దుర్యో ధనాదులు లక్ష్యశుద్ధి లేక నిందింపబడ్డారు. అర్జునుడొక్కడే లక్ష్య వేధి అయి పక్షి శిరస్సును త్రెంచి గురువు ఆశీస్సులు పొందాడు. కుమారాస్త్ర విద్యాప్రదర్శనంలోనూ ధర్మజుడు సామాన్యమైన విద్యనే ప్రదర్శించాడు. భీమదుర్యోధనులు గదాయుద్ధంలో, అర్జునుడు ధనుర్విద్యలో అగ్రగణ్యులై నిలిచారు. కర్ణుడి రంగప్రవేశంలోనూ అర్జునుడు, భీముడే ఒక్కింత ఎదుర్కొన్నారు గాని ధర్మజుడు నోరుమెదపలేదు. అర్జునుడు ద్రుపదుడితో యుద్ధానికి ఉపక్రమించే సమయంలో ద్రోణాచార్యులతోపాటు అన్న ధర్మజుడికి కూడా నమస్కరించాడు. దాంతో ధర్మరాజు పెద్దరికం, యోగ్యత ప్రకటింపబడింది. ఆయుధ విద్యలో అంతగా ప్రావీణ్యం పొందకున్నా ధర్మజుడు ధీశాలి. కుశాగ్రబుద్ధి. దీర్ఘదర్శి. వినయాభరణుడు. సత్యధర్మాలు ఆతడి ప్రాణం. దాంతో భీష్మ విదురులేగాక, పౌరముఖ్యులు, ఇతర జనులు ఎంతగానో అభిమానించారు. దానిని గమనించే ఇష్టంలేకున్నా తన కుమారుడు దుర్యోధనుడికి బదులుగా ధృతరాష్ట్రుడు ధర్మరాజును యువరాజును చేశాడు. తమ్ములు దిగ్విజయం చేసి తెచ్చిన అనంత సంపదలతో యువరాజయ్యూ సార్వభౌముడుగా వెలిగాడు. ఈ ఉన్నతే దుర్యోధనుడికి ఎంతో బాధ కలిగించింది. తండ్రిని మిక్కిలిగా ప్రార్థించి వేధించి పాండవుల్ని వారణావతానికి పంపింది. లక్కయింటకాల్చ ప్రయత్నించి విఫలమయ్యింది.

ధర్మజుడి వ్యక్తిత్వం, వారణావతానికి బయలుదేరేటప్పటి నుంచి వెల్లివిరిసింది. అప్పటివరకూ పెదతండ్రి ధృతరాష్ట్రుడి, పినతండ్రి విదురుడి, తాత భీష్ముడి చాటుబిడ్డే. ధర్మజుడు బహుప్రకార వచన రచనా విశారదుడట. ఇది వారణావతానికి వెళ్లేటప్పుడు విదురుడు రహస్యంగా చెప్పినమాటల సందర్భంగా వ్యాస భగవానుడి మాట. బహువిధాల బాణపరంపర ప్రయోగింపలేడు గాని వచన రచనా మర్మవేది. అంతేగాక పరాభిప్రాయ మాయోపాయ ప్రయోగవిదుడట. ఇదీ మహాకవి వ్యాసుడి వచనమే. అందుచేతనే లక్కయింటి గుట్టు తెలిశాడు. తల్లితో తమ్ములతో చెప్పాడు. మనమే ముందుగా పురోచనుడితో గూడా తగలబెడదామని భీముడు చెప్పగా అంగీకరించలేదు. తెలిసినా తెలియనట్లే ఉందామని, పురోచనుడే ఆపని చేస్తాడని మనం కన్నుకలిగి మెలగి తప్పించుకోవాలని, లేకుంటే పురోచనుడు దుర్యోధనుడితో చెబుతాడని ఆతడు మరోవిధంగా మనను వెంటాడుతాడని, మనమే దహిస్తే ఈ మర్మం తెలియక భీష్మాదులు కోపిస్తారని, తప్పు దుర్యోధనుడివైపే ఉండాలని, జరగాలని తన మేధావితనాన్ని, దీర్ఘదర్శిత్వాన్ని ప్రదర్శించాడు. తర్వాత విదురుడి సహాయంతో తప్పించుకుని బ్రతికారు. హిడింబి విషయంలోనూ ధర్మజుడు సానుకూలతను ప్రదర్శించి ఆమెను భీముడు చేపట్టే విధంగా ప్రవర్తించాడు. చంపదగిన వాడిని హిడింబుడిని చంపావు. ఇది అబల. దీనిని రాక్షసిగా చూడరాదు. శరణుజొచ్చిన వారిని రక్షించుటే ధర్మం. అది ఆత్మ రక్షణ కన్న మిన్న అన్నాడు. తర్వాత వ్యాసదర్శనం అయ్యింది. ధర్మరాజు వ్యాసుడి మార్గదర్శనాన్ని తు.చ. తప్పక పాటించాడు. ఏక చక్రపురంలో బ్రాహ్మణ వేషంలో భిక్షాటనంతో ఒక బ్రాహ్మణ గృహంలో కొంతకాలం గడిపారు పాండవులు. అపుడా గృహస్థుడికి బకాసురుడి పీడ ఏర్పడింది. దానిని కుంతీదేవి భీముడివల్ల తీర్చ సిద్ధపడింది. యుద్ధం అంటే భీముడికి పండగ. పరమా నందం. ఆతడి వాలకాన్ని చూసి ఏదో యుద్ధానికి సిద్ధమై యున్నాడని గ్రహించి ధర్మజుడు తల్లినడిగి విషయం తెలిసి మిక్కిలి బాధపడ్డాడు. ఈతడి రక్షణ వల్లే గదా మనం లక్కయింటి నుండి బయటపడ్డాం.



కళారత్న, (హంస)
**డా.సిహెచ్.బాబావలిరావు**
హైదరాబాద్, 9989792247

# మద్యం విక్రయాలపై నిఘా

• ఎమ్మార్పీ అమలు పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

• ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ: సోమేష్‌కుమార్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దసరా పండుగ నేపథ్యంలో మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలు జరిగే ఆస్కారం ఉందని భావించిన ఆబ్కారీ శాఖ విరుగుడు చర్యలకు సిద్ధమవుతోంది. ఒక నెలపాటు ఇప్పుడున్న ప్రస్తుత మద్యం దుకాణాలనే కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఇదే అదనుగా మద్యం దుకాణాల వ్యాపారులు దసరా రద్దీ నేపథ్యంలో మద్యం ధరలను పెంచి ఎమ్మార్పీ ఉల్లంఘనలకు పాల్పడతారనే అనుమానాలు ప్రభుత్వానికి చేరాయి. దీంతో వీరి కట్టడికి ప్రత్యేక టీములను ప్రభుత్వం రంగంలోకి దించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోపాటు రాష్ట్రమంతటా ప్రత్యేక దృష్టిపెట్టిన ఆబ్కారీ శాఖ శుక్ర, శనివారాల్లో ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించింది. ఈ సందర్భంగా 8 కేసులను నమోదు చేశారు. హైదరాబాద్, నల్గొండ, వనపర్తి, నిజామాబాద్ జిల్లాల్లో ఈ కేసులను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓలతో కూడిన 4 స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీములు, 10 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, 34 జిల్లా టాస్క్ ఫోర్స్ టీములను ప్రత్యేకంగా ఎమ్మార్పీ ఉల్లంఘన పర్యవేక్షణకు నియమించారు. ఎమ్మార్పీ ఉల్లంఘన జరిగినట్లుగా గుర్తిస్తే 7 రోజులపాటు లైసెన్సు రద్దు చేయడంతోపాటు, రూ. 2లక్షల జరిమానా విధించనున్నారు. ఫిర్యాదులకు రాష్ట్రస్థాయిలో స్టేట్ కంట్రోల్ రూమును ఏర్పాటు చేశారు. 040-24733056 నెంబర్ 24 గంటలపాటు ఫిర్యాదులను స్వీకరించనుంది. అదే విధంగా పూర్వ 10 జిల్లాల్లో విడివిడిగా కంట్రోల్ రూములను, టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీకి మించిన ధరను చెల్లించవద్దని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లాల ఈఎస్‌లు, ఎస్‌హెచ్‌ఓలు, డిప్యుటీ కమిషనర్లకు ప్రభుత్వ స్పెషల్ సీఎస్ సోమేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

# ప్రాజెక్టులకు వరద జోరు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్రాజెక్టులకు వరదజోరు కొనసాగుతోంది. కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నాయి. గోదావరి బేసిన్‌కు సంబంధించి శ్రీపాద ఎల్లంపల్లి, లోయర్ మానేరు డ్యాంకు వరద జోరు కొనసాగుతోంది. ఆల్మట్టి నిండుకుండలా ఉండగా, 20,053 క్యూసెక్కుల వరద వస్తోంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 22,640 క్యూసెక్కులు, ఉజ్జయినికి 3704 క్యూసెక్కులు, జూరాలకు 33363 క్యూసెక్కులు, తుంగభద్రకు 9171 క్యూసెక్కులు, శ్రీశైలంకు 25,892 క్యూసెక్కులు, నాగార్జునసాగర్‌కు 16,099 క్యూసెక్కులు, పులిచింతలకు 10,782 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోలు వస్తున్నాయి. జైక్వాడ్ ప్రాజెక్టుకు 2289, సింగూరుకు 1831 క్యూసెక్కులు, నిజాంసాగర్‌కు 376 క్యూసెక్కులు, లోయర్ మానేరు డ్యాంకు 2942, కడెంకు 626, శ్రీపాద ఎల్లంపల్లికి 7878 క్యూసెక్కులు వరద వస్తోంది. ప్రధాన ప్రాజెక్టులన్నీ పూర్తిస్థాయి నీటిమట్టంతో ఉండగా, సింగూరుకు స్వల్ప వరద మొదలైంది.

# సంక్షేమ పథకాలు అమోఘం

• మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



**నారాయణఖేడ్, ప్రభ న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు అమోఘమని మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా, ఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులో రూ.4.45 కోట్లతో నిర్మించిన విజయ డెయిరీ వారి పాలశీతలీకరణ కేంద్రాన్ని ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని సంక్షేమ పథకాలు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్నారన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని సాగు, తాగునీటి సమస్య తలెత్తకుండా కాళేశ్వరం నుంచి నీటిని రప్పించి సింగూర్ నదిని నింపి తద్వారా ప్రజలకు అందించనున్నానన్నారు. ప్రజల బాగోగులు పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ పథకాలను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఖేడ్ ప్రాంతంలో అధికమంది వ్యవసాయంతో పాటు పాల ఉత్పత్తిని జీవనాధారంగా కొనసాగిస్తున్నారని వారి ఆర్థికాభివృద్ధికి మరింత సహకరించేందుకు రూ.4.45 కోట్లతో 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పాలశీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసిన ఘనత ఎమ్మెల్యేకు దక్కిందన్నారు. ఖేడ్‌పై ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావుకు ప్రత్యేక శ్రద్ధ ఉండడంతో ఎమ్మెల్యేతో కలిసి నిరంతరం ఖేడ్ అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు.

# ఖరీఫ్ ఖుషీ

(మొదటిపేజీ తరువాయి)

వేయకుండా సాగువైపు దూసుకువెళ్ళారు. ఫలితంగా పంటల విస్తీర్ణం సాధారణ విస్తీర్ణానికి దాదాపు మూడు లక్షల హెక్టార్లు అధికంగా సాగైంది.

### 18 జిల్లాల్లో కళకళ

రాష్ట్రవ్యాప్తంగా 32 వ్యవసాయ జిల్లాలకుగానూ 18 జిల్లాల్లో పంటల విస్తీర్ణం లక్ష్యాన్ని దాటిపోయింది. ఈ ఏడాది అదనంగా జల వనరులు అందుబాటు లోకి వచ్చిన నేపథ్యంలో 43.34 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగవుతా యని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ, వారి అంచనాలు దాటి 44.14 లక్షల హెక్టార్లకు పంటలు విస్తరించడం శుభ పరిణామంగా ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ఉన్న వనరుల ప్రకారం ఖరీఫ్ విస్తీర్ణం గరిష్టంగా 41 లక్షల హెక్టార్ల వద్దే స్థిరపడేది. రాష్ట్రంలో ప్రధానమైన వరిపంట సాధారణంగా 9.64 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉంది. కానీ ఈ ఏడాది సమృద్ధిగా జల వనరులు ఉన్నందున ఈ విస్తీర్ణం 12.59 లక్షల హెక్టార్లకు ఊహించనంతగా పెరిగింది. ఎకరాల్లోకి మార్చి చూస్తే 7.37 లక్షల ఎకరాల్లో వరి అధికంగా సాగైనట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

### తృణ ధాన్యాల సాగుకు ప్రాధాన్యం

అలాగే మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో తృణ ధాన్యాలకు పెరుగుతున్న డిమాండ్ ఈ ఏడాది ఖరీఫ్ సాగులో కనిపించింది. ఆరోగ్య పరిరక్షణలో కీలక భూమిక పోషిస్తున్న రాగులు 129 శాతం, సజ్జలు, కొర్రలు, అరికెలు లాంటి తృణ ధాన్యాల విస్తీర్ణం 346 శాతం అధికంగా సాగైనట్లు అధికారులే చెబుతున్నారు.

### ఇవి తగ్గాయ్...

పప్పు దినుసుల సాగులోనూ ఈ ఏడాది పురోగతి కనిపిస్తోంది. ప్రధానమైన పంట కందిలో కొంత విస్తీర్ణం తగ్గినప్పటికీ ఖరీఫ్‌లో 2.86 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పంట సాగైంది. అలాగే 70,812 హెక్టార్లలో పెసర, 18,725 హెక్టార్లలో మినుము పంటలు సాగయ్యాయి. మొత్తం పప్పు దినుసుల విస్తీర్ణం సరాసరిగా 4.14 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా, 3.76 లక్షల హెక్టార్లకు ఈ విస్తీర్ణం తగ్గినట్లు వ్యవసాయశాఖ ఖరీఫ్ తుది నివేదికలో వెల్లడించింది. విస్తీర్ణం తగ్గడానికి ప్రధాన కారణం ఖరీఫ్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులేనని అధికారులు చెబు తున్నారు. నూనె గింజల్లో ప్రధానమైన వేరుశనగ, పొద్దుతిరుగుడు పంటలు కూ డా స్వల్పంగా తగ్గాయి. గత ఏడాదితో పోల్చిచూస్తే 5 నుంచి 10 శాతం సాగు తగ్గి నట్లు తెలుస్తోంది. వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం 17,165 హెక్టార్లలో వేరు శనగ సాగు కావాల్సి ఉంటే ఈ విస్తీర్ణం 12,252 హెక్టార్ల వద్దే స్తంభించింది. అలాగే పొద్దుతిరుగుడు, ఆముదం, నువ్వులు, కుసుమల విస్తీర్ణం కూడా తగ్గిపోయింది. తెలంగాణలో పెద్దమొత్తంలో సాగయ్యే సోయాబీన్ 2.10 లక్షల హెక్టార్ల నుంచి 1.77 లక్షల హెక్టార్లకు తగ్గింది.

### పత్తికి మంచి రోజులు

వాణిజ్య పంటల్లో ప్రధానమైన పత్తి ఈ ఏడాది విపరీతంగా విస్తరించింది. సాధారణ విస్తీర్ణానికి దాదాపు రెండున్నర లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పంట సాగైనట్లు తెలుస్తోంది. వ్యవసాయశాఖ లెక్కల ప్రకారం 17.24 లక్షల హెక్టార్లలో పత్తి సాగు కావాల్సి ఉండగా, ఈ విస్తీర్ణం 19.65 లక్షల హెక్టార్లకు పెరిగినట్లు జిల్లాల నుంచి అందిన నివేదికలను బట్టి తెలుస్తోంది. ఈ వాణిజ్య పంటల్లో చెరుకు, పసుపు మినహా మిగతా అన్ని పంటలు తగ్గుముఖం పట్టాయి. 45,028 హెక్టార్లలో మిర్చి కేవలం 3,995 హెక్టార్లలో ఉల్లి, 24,319 హెక్టార్లలో చెరుకు, 48,119 హెక్టార్లలో పసుపు, 267 హెక్టార్లలో పొగాకు పంటలు సాగైనట్లు అధికారులు వెల్లడించారు. గత ఏడాది ఖరీఫ్ పంటల విస్తీర్ణం సాధారణంలో 96 శాతం మాత్రమే సాగైతే, ఈ ఏడాది 102 శాతానికి పెరిగినట్లు తాజా నివేదిక చెబుతోంది.

# సిరులు కురుస్తాయ్!




## కొత్త మద్యం పాలసీతో రాబడే రాబడి

• ఏపీలో మద్య నియంత్రణతో తెలంగాణపై సిండికేట్ ఆశలు • ఆంధ్రాలో 8 గంటలకే దుకాణాలు బంద్ • ఇక్కడ 10 తర్వాత తెరిచి ఉంచే అవకాశం • విదేశీ మద్యం లభ్యత ఇక్కడే సులభం • 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** నిధుల కటకటతో ఎలాగోలా నెట్టుకొస్తున్న రాష్ట్రప్రభుత్వానికి కొత్త మద్యం పాలసీ సిరులు కురిపించబోతోంది. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విధానం పరోక్షంగా తెలంగాణకు కలిసివస్తోంది. కొత్త పాలసీతో మద్యం ఏరులై పారుతుందన్న విమర్శల మాటెలా ఉన్నా రాబడికి మాత్రం లోటుండదు. పైగా గతం కన్నా భారీగా పెరగబోతోంది. ముఖ్యంగా ఏపీ-తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో తెలంగాణకు రాబడి ఇబ్బడి ముబ్బడిగా పెరగబోతోంది.

### రాబడిలో కిక్కు

రెండేళ్లుగా రాష్ట్రంలో మద్యం విక్రయాలు జోరందుకోగా, ఏపీలో నెలకొన్న తాజా పరిస్థితుల నేపథ్యంలో మద్యం అమ్మకాలు జెట్ స్పీడుకు చేరనున్నాయి. గడచిన ఏడాది (2018-19)లో 3,27,67,121 పెట్టెల మద్యం విక్రయాలు జరగ్గా, 4,76,53,317 పెట్టెల బీర్లు అమ్మకమయ్యాయి. వీటి మొత్తం విలువ రూ. 19,295.5 కోట్లు. కాగా, 2019-20లో మద్యం 3,53,01,633 పెట్టెలుగా, బీర్లు 5,12,02,148 పెట్టెలుగా నమోదైంది. వీటి విలువ రూ. 21,658 కోట్లతో ఖజానాకు రాబడి సమకూరింది. తాజా నూతన మద్యం పాలసీతో టెండర్ రుసుముల రూపంలో రూ. 1000 కోట్లు, లైసెన్సు ఫీజుల రూపంలో రూ. 1400 కోట్లు, లెవీ కింద రూ. 100 కోట్లు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తంమీద అమ్మకాల పెరుగుదలే కాకుండా పన్నులు, రాబడులు, ఫీజుల రూపంలో ఈ ఏడాది భారీ రాబడిసమకూరుతుందనే అంచనాలున్నాయి.

### విదేశీ మద్యం ఔట్‌లెట్లతో మరింత లాభం

నూతన మద్యం పాలసీలో 2216 మద్యం దుకాణాలకు లైసెన్సులను జారీ చేయనుండగా, విదేశీ మద్యం విక్రయాలను మరింత ప్రోత్సహించి తద్వారా రాబడిని పెంచుకోవాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ప్రత్యేకంగా విదేశీ మద్యం అమ్మకాలకు ఔట్‌లెట్లను మరిన్ని అనుమతించే ప్రతిపాదనలు సిద్ధం చేసింది. పరిమితంగా ఉన్న ఔట్‌లెట్లను పెంచుకుంటే రాబడి పెరుగుతోందని నిర్ణయించింది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8 విదేశీ మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. వీటిద్వారా సుమారు రూ. 15 కోట్ల రాబడి సమకూరింది. 2014లో 29 వేల కేసుల విదేశీ మద్యం విక్రయాలు జరగ్గా, 2019కి విదేశీ మద్యం విక్రయాలు జోరందుకున్నాయి.

ప్రధానంగా రాష్ట్రంలో భారీగా డిమాండ్ ఉన్న విదేశీ బ్రాండ్ మద్యం చెన్నైనుంచి రాష్ట్రంలోకి అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో అక్రమ మద్యం అరికట్టి, మరిన్ని విదేశీ మద్యం స్టోర్స్ అందుబాటు లోకి తేవాలన్నది సర్కార్ లక్ష్యంగా ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 విదేశీ మద్యం దుకాణాలను అనుమతించాలని యోచిస్తున్నారు. ఇందుకు రెండేళ్ల లైసెన్స్‌లను జారీ చేయాలని యోచిస్తోంది. ఒక్కో దుకాణానికి ప్రస్తుతం రూ. 1కోటీ 25 లక్షల వార్షిక రుసుము ఉండగా, దీనిని రెండింతలు చేయాలని యోచిస్తున్నారు. మొదటి విడతలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అనుమతించాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో మద్యం ఔట్‌లెట్‌కు 1000 చద రపు అడుగుల స్థలం ఉండాలని అధికారులు పాలసీలో నిర్ణయించినట్లు తెలిసింది. అయితే ఇప్పటికే హైదరాబాద్‌లో టానిక్ పేరుతో నడుస్తున్న ఔట్‌లెట్ల పట్ల విపక్షాలు అభ్యంతరాలు చెబుతున్నాయి. ప్రాణాలను కాపాడే మందుల పేరుతో టానిక్ అని పేరు పెట్టి, ప్రాణాంతక మద్యం విక్రయాలను చేపట్టడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే ప్రభుత్వం మాత్రం నిబంధనల ప్రకారం ఏ పేరు పెట్టుకున్నా అభ్యంతరం చెప్పేది లేదని పేర్కొంటున్నది.

### దసరా మర్నాటి నుంచి దరఖాస్తులు

దసరా మరుసటి రోజునుంచి నూతన మద్యం పాలసీకి నోటిఫికేషన్లు జిల్లాలవారీగా కలెక్టర్లు విడుదల చేయనున్నారు. ఈ నెల 16వరకు దరఖాస్తులను స్వీకరించాలని, 18న లాటరీలను నిర్వహించాలని షెడ్యూల్ ఖరారు చేశారు. కాగా ఆన్‌లైన్ అప్లికేషన్లపట్ల ప్రభుత్వం విముఖత చూపడం వెనుక ఆబ్కారీ అధికారుల ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. గతేడాది ఏపీలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించిన సమయంలో భారీ సంఖ్యలో దరఖాస్తులు అతి తక్కువ సమయంలో ఆబ్కారీ శాఖకు చేరాయి. అయితే ఆన్‌లైన్‌లో దరఖాస్తులపై కమిషనర్, సెక్రటరీ మినహా మిగతా అధికారులెవరికీ నియంత్రణ కానీ, లాగిన్ సౌకర్యం కానీ ఉండదు.

దీంతో ఏ దుకాణా నికి ఎన్ని దరఖాస్తులొచ్చాయనే సమాచారం డ్యాష్‌బోర్డులో కనిపించదు. దీంతో ఎక్సైజ్ సీఐలు, ఎస్సైలు వ్యాపారుల్లో కొందరికి సహకరించేందుకు అవకాశాలు లేకుండా పోవడంతో పాటు, మాన్యువల్ దరఖాస్తులైతే ప్రతీదీ ఎస్‌హెచ్‌ఓ సంతకంతో సమర్పించాల్సి ఉండటంతో రాబడికి అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో తమ రాబడికి గండిపెట్టే ప్రతిపాద నలపట్ల అధికారులంతా మూకుమ్మడిగా ప్రచారం చేశారు. దీంతో ఈ దఫా కూడా మామూలుగానే మళ్లీ ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు, లాటరీలు జరగనున్నాయి.

# అధికారంలోకి వస్తే అధికారికంగా 'కాకా' జయంతి



• జి. వెంకటస్వామి జయంతి సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి • పెద్దపల్లి జిల్లాకు ఆయన పేరు పెట్టాలి: లక్ష్మణ్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పేద ప్రజలకు నిలువ నీడ కల్పించిన తెలంగాణ యోధుడు, మాజీ కేంద్ర మంత్రి జి.వెంకటస్వామి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, తాము అధికారంలోకి వస్తే ఆ పని చేసి చూపిస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. నగరంలోని బస్తీల్లోని పేదలకు ఆయన ఇళ్లు దక్కేలా చేశారని కొనియాడారు. కార్మికసంక్షేమ చట్టాల రూపకల్పనలో ఆయన ముందున్నారని అన్నారు. దివంగత కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ జి.వెంకటస్వామి (కాకా) 91వ జయంతి సందర్భంగా శనివారం ట్యాంక్‌బండ్‌పై వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డిసహా వివిధ పార్టీల నేతలు హాజరై నివాళి అర్పించారు. కాకా సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ పార్టీలు వేరైనా తనకు కాకాతో ఎంతో అనుబంధం ఉందని, ఆయన దగ్గర రాజకీయ పాఠాలు నేర్చుకున్నానని, కాకాకు రాష్ట్రపతి పదవి ఇస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. పెద్దపల్లి జిల్లాకు జి. వెంకటస్వామి పేరుపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం భేషజాలకు పోయి కాకా జయంతిని అధికారికంగా నిర్వహించటం లేదని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారం బీజేపీదేనని, కాకా జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారు.

### తెలంగాణ కోసం పోట్లాడారు: కేకే

ఏ పది మంది కథనాయకులు ఉద్యమిస్తేనే తెలంగాణ రాలేదని, అందరూ కలిసికట్టుగా ఉద్యమిస్తేనే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని టీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, ఎంపీ కె.కేశవరావు అన్నారు. దివంగత జి.వెంకటస్వామి (కాకా) 91వ జయంతి వేడుకలు శనివారం ట్యాంక్‌బండ్‌పై శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం కాకా ఎంతో కృషి చేశారని కొనియాడారు. సీడబ్ల్యూసీలో తెలంగాణ కోసం ఎంతో బలంగా మాట్లాడేవారని చెప్పారు. పేద ప్రజలకు గూడు కల్పించేందుకు గుడిసెలు వేయించి మహా ఉద్యమాన్నే నడిపారని కీర్తించారు. గుడిసెల వెంకటస్వామి అన్న పేరే కాకాకు నిజమైన నివాళి అని చెప్పారు. దళితులతోపాటు యావత్ తెలంగాణ ఆశాజ్యోతిగా కాకా పేరుతెచ్చుకున్నారని చెప్పారు. పేదల బ్రాండ్‌గా కాకా పనిచేశారని ఎంపీ డి. శ్రీనివాస్ అన్నారు. తాను పీసీసీ అధ్యక్షునిగా ఉన్నపుడు కాకా మార్గనిర్దేశనంలో పనిచేశానని చెప్పారు. తెలంగాణ పిల్లల ఆత్మహత్యలతోనే ప్రత్యేక రాష్ట్రం వచ్చిందన్నారు. మాజీ మంత్రి శంకర్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు కాకానే పార్టీని బతికించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం నాటకాల లేడీ చేతిలో ఉందని సోనియాను విమర్శించారు. కష్టకాలంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి కాకా అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. ఆయన తలరాత బాగాలేకనే రాష్ట్రపతి పదవి రాలేదని వ్యాఖ్యానించారు. మాజీ ఎంపీ వివేక్ మాట్లాడుతూ... తమ తండ్రి వెంకటస్వామి అడుగుజాడల్లో ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ కల్పనలో కాకా ధైర్యంగా ముందడుగు వేశారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాములు, మాజీ ఎమ్మెల్యే గుండె విజయరామారావు, మాజీ ఎంపీ రవీంద్రనాయక్, కాకా మిత్రులు బాలానందం, గోపాల్‌రావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రివర్గంలోనూ రిజర్వేషన్లు పాటిస్తారా?

• సీఎం కేసీఆర్‌కు మంద కృష్ణ సవాల్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచేందుకు అవకాశం ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోడీని ముఖ్యమంత్రి కేసీఆర్ కోరారని, ఆ పద్ధతిలోనే రాష్ట్ర మంత్రివర్గంలోకూడా రిజర్వేషన్లు వర్తింపచేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలవారికి మంత్రులుగా అవకాశం ఇవ్వగలరా అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ సవాల్ చేశారు. సామాజిక అంశాలపైన సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే తమ సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలు ఉన్నందునే హడావుడిగా ఢిల్లీకి వెళ్లి 22 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ప్రధాన మంత్రి మోడీకి ఇచ్చారన్నారు. ఆ డిమాండ్లను కేంద్రం అమలు చేస్తే తన ఘనత అని, లేదంటే కేంద్రంలోని బీజేపీని దోషిగా నిలబెట్టడానికే మోడికి కలిశారని కృష్ణమాదిగ విమర్శించారు. రాష్ట్రానికి మహిళా గవర్నర్ వచ్చినందునే.. మంత్రి వర్గంలో ఇద్దరు మహిళలకు చోటు కల్పించారని తెలిపారు. ఒక్క శాతం లేని వర్గానికి 4 మంత్రి పదవులు ఇచ్చిన కేసీఆర్, బీసీలకు 9 పదవులు కేటాయించాల్సి ఉండగా నలుగురికే ఇచ్చారని, మైనార్టీలకు రెండు పదవులు ఇవ్వాల్సి ఉండగా ఒక్కటే ఇచ్చారన్నారు. ఎస్సీలకు 3 మంత్రి పదవులు రావాల్సి ఉండగా ఒక్కరికే అవకాశం ఇచ్చారని ఆయన తెలిపారు. మాదిగలలో పెరుగుతున్న అసంతృప్తిని చల్లార్చేందుకే ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ప్రస్తావించారని ఆయన చెప్పారు. వర్గీకరణపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోతామని చెప్పి రెండేళ్లవుతున్నదన్నారు. వర్గీకరణకు అన్ని పార్టీల మద్దతు ఉన్నందున హుజూర్‌నగర్ ఎన్నికలకు ముందే అఖిలపక్షాన్ని ఏర్పాటు చేసి ప్రధాన మంత్రి వద్దకు తీసుకుపోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఎమ్మార్పీఎస్ మద్దతు

ఆర్టీసీ కార్మికులతో పెట్టుకున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి కాలం దగ్గరపడినట్లేనని కృష్ణమాదిగ హెచ్చరించారు. న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మెకు దిగిన ఆర్టీసీ కార్మికులకు ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని ఆయన తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి యాక్టును కొనసాగించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు తెలిపారు. తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అట్రాసిటి చట్టం కోసం ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటాన్ని ఆయన వివరించారు.

# స్కూలు పిల్లలకు డిక్షనరీలు

(మొదటిపేజీ తరువాయి)

40 మంది విద్యార్థులు ఉంటారని, అందరికీ డిక్షనరీలను ఇవ్వాలని నిర్ణయించారు.పాకెట్, మీడియం, పెద్దసైజులో ఉన్న డిక్షనరీలను ఇవ్వాలని భావిస్తున్నారు. తరగతులు, వారి అవసరాన్ని బట్టి ఏఏ తరగతులకు ఏఏ డిక్షనీరివ్వాలన్నది నిర్ణయిస్తున్నారు.

### వ్యయంపై అంచనాలు ఇలా

డిక్షరీల కొనుగోలుకు అయ్యే ఖర్చుపై విద్యాశాఖ లెక్కలు వేస్తోంది. పాకెట్ డిక్షనరీ ఒక్కదానికి రూ. 142 ఖర్చు కానుంది. మొత్తం 14,00,444 మందికి ఇవ్వాలంటే రూ. 19.88 కోట్లు ఖర్చు కానుంది. మీడియం డిక్షనరీకి ఒక్కదానికి రూ. 330 ఖర్చు అవుతుంది. అందరికీ ఇవ్వాలంటే రూ. 46.20 కోట్లు అవసరం అవుతాయి. అదే పెద్ద డిక్షనరీకి ఒక్క దానికి రూ. 2360 ఖర్చు అవుతుంది. దీనికోసం రూ. 324 కోట్లు అవసరం కానున్నాయి. అయితే పాకెట్ డిక్షనరీలు 6, 7 తరగతుల వారికి ఇవ్వాలని, 8 నుంచి 10వ తరగతి వారికి మీడియం డిక్షనరీలను ఇవ్వాలని ఆలోచిస్తున్నారు. పెద్ద డిక్షనరీలను స్కూల్‌కు రెండు ఇవ్వాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. పెద్ద డిక్షనరీలను ఎక్కువగా ఉపయోగించరు. కాబట్టి ప్రతి స్కూల్‌కి రెండు డిక్షనరీలను ఇస్తే ఒకటి గ్రంథాలయంలో ఉంటుంది

### నిధుల సేకరణ ఇలా...

విద్యార్థులకు డిక్షనరీలు ఇవ్వాలని భావించిన పాఠశాల విద్యాశాఖ అధికారులు అందుకు అయ్యే ఖర్చులను ఇండివిడ్యువల్ సోషల్ రెస్పాన్స్(ఐఎస్‌ఆర్), కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్(సీఎస్‌ఆర్) పేరుతో సేకరించాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించిన పాఠశాల విద్యాశాఖ వనరులను సేకరించేపనిలో నిమగ్నమై ఉంది. ఇప్పటికే కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థలు విరాళం ఇవ్వడానికి సిద్ధపడినట్టు అధికారులు చెబుతున్నారు. త్వరలోనే వీటికి సంబంధించిన ఖర్చు.. ఇతర వివరాలను పాఠశాల విద్య శాఖ అధికారులు ప్రకటించనున్నారు.

### సైకిళ్ల పంపిణీకి ఆలోచన..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయాలనే ఆలోచనలో పాఠశాల విద్యాశాఖ అధికారులు ఉన్నారు. అయితే పాఠశాలల్లో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయాలని, ముందుగా బాలికలు ఇవ్వాలని భావిస్తున్నారు. అత్యధిక హాజరు, ప్రతిభ కనబరిచేవారికే ఇవి ఇవ్వాలని అనుకుంటున్నారు. ఇప్పటికే సైకిళ్ల పంపిణీ కోసం తెలంగాణ గ్రామీణ వికాస బ్యాంక్ వారు రూ. 5 లక్షలను విరాళంగా ఇచ్చారు. ఆ డబ్బులతో సైకిళ్లను కొనుగోలు చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన సమావేశాన్ని ఐఎస్‌ఆర్, సీఎస్‌ఆర్ వెబ్‌పోర్టల్‌ను పరిశీలిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారిణీ ప్రియదర్శిని శనివారం కొందరు దాతలతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో టెండర్లు పిలిచిన తరువాత కూడా ఎల్1 వచ్చిన టెండర్ దారులతో ఫిక్కీ తెలంగాణ శాఖ సంప్రదింపులు జరిపి ఇంకా తక్కువకు ఇప్పించేలా ప్రయత్నిస్తామని చెప్పినట్టు తెలిపారు. దీనికి సంబంధించి త్వరలోనే విధి విధానాలను రూపొందించి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. రూ.5 లక్షలకు 143 సైకిళ్ల కొనుగోలుకు అవకాశం ఉందన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీకి అఖిలపక్షం

• సీఎంకు కృష్ణయ్య వినతి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేసినందుకు బీసీ సంఘాలు కృతజ్ఞతలు తెలిపాయి. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని సీఎం కేసీఆర్ కోరడం పట్ల 14 బీసీ సంఘాలు హర్షం ప్రకటిస్తున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తెలిపారు. 14 బీసీ సంఘాల సమావేశం శనివారం ఆర్ కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, సీ రాజేందర్, గొరిగె మల్లేష్ యాదవ్, కె నటరాజ్ తదితరులు పాల్గొన్నారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడం కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తే ఉపయోగం ఉంటుందని సూచించారు. దీంతోపాటు టీఆర్ఎస్ పార్టీ పార్లమెంటు సభ్యుల ద్వారా లోక్‌సభలో బిల్లును ప్రవేశ పెట్టేలా చూడాలన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 42 బంగారం బిస్కెట్లు స్వాధీనం



**శంషాబాద్, ప్రభ న్యూస్ :** దుబాయ్‌నుంచి అక్రమంగా తీసుకువచ్చిన దాదాపు ఐదు కిలోల బరువున్న 42 బంగారు బిస్కెట్లను రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు శంషాబాద్ ఏర్‌పోర్టులో శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఎమిరేట్ ఎయిర్‌లైన్స్‌లో వచ్చిన ఇద్దరు ప్రయాణీకుల కదలికలపై అనుమానం వచ్చిన అధికారులు వారి బ్యాగేజీని తనిఖీ చేయడంతో అసలు గుట్టు బయటపడింది. మొత్తం 42 బంగారు బిస్కెట్ల బరువు 4891 గ్రాములుండగా వాటి విలువ 1.84 కోట్ల రూపాయలుంటుందని అధికారులు చెప్పారు. నిందితులను అరెస్టు చేసి డిఆర్ఐ ప్రధాన కార్యాలయానికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పండక్కి వెళుతూ ప్రమాదంలో మృతి

• ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల విషాదాంతం

**గుంతకల్లు అర్బన్, ప్రభ న్యూస్:** విజయదశమి పండక్కి బయల్దేరిన ముగ్గురు యువకులను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు పరలోకానికి తరలించుకు వెళ్లింది. మరో గంటలోగా కుటుంబ సభ్యులను కలవాల్సిన వారిని నిద్రాదేవత శాశ్వత నిద్రలోకి చేర్చుకుంది. కుమారులు పండుగ వేడుకలకు వస్తారని వేయి కళ్లతో ఎదురుచూస్తున్న తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చింది. క్షణకాలం రెప్ప మూయడంతో జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. అనంతపురం జిల్లా పెద్ద వడుగూరు మండలం గుత్తి అనంతపురం గ్రామ సమీపంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన ఘటన చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా నార్పలకు చెందిన హనుమంతురెడ్డి, లేపాక్షిగ్రామానికి చెందిన నితీష్‌కుమార్, ఉరవకొండకు చెందిన మోహనక్రిష్ణహైదరాబాద్ నగరంలో వివిధ కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు. వీరు ముగ్గురు దసరా పండక్కి శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి తమ స్వగ్రామాలకు హనుమంతరెడ్డి టీఎస్ 08 ఎఫ్‌వీ 3608 నెంబరుగల కారులో వస్తుండగా తెలంగాణాలో ఆర్టీసీ బస్సులు బంద్ కారణంగా మార్గమధ్యంలో నితీష్‌కుమార్, మోహనక్రిష్ణహనుమంతురెడ్డి కారులో ఎక్కారు. వీరు ప్రయాణిస్తున్న కారు అనంతపురం జిల్లా గుత్తి టోల్‌గేట్ సమీపంలోకి వస్తుండగా కారును నడుపుతున్న హనుమంతురెడ్డి నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో కారు డివైడర్లు దాటుకుని అవతలి రహదారిపైకి వెళ్లింది. అదే సమయంలో బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎన్‌ఎల్ 01 బీ 1248 నెం. ప్రయివేట్ బస్సు కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

# రీజనల్ కన్సల్టేషన్ మీట్‌కు న్యాయాధికారుల ఎంపిక

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** కేరళ రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి 22 వరకు జరగనున్న దక్షిణాది రాష్ట్రాల న్యాయసేవాధికార సంస్థల ప్రాంతీయ సంప్రదింపుల సమావేశం (రీజినల్ కన్సల్టేషన్ మీట్)లో పాల్గొనేందుకు హైకోర్టు ఐదుగురు న్యాయాధికారులను నామినేట్ చేసింది. ఖమ్మం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి వినోద్ కుమార్, నిజామాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి / ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.కిరణ్ మహి, రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.ఉదయ్ కుమార్, హైదరాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ /అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అజర్ హుస్సేన్, మహబూబ్‌నగర్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఎప్ ఏసీ కార్యదర్శి/ నాగర్ కర్నూల్ సీనియర్ సివిల్ జడ్డి కెవి.చంద్రశేఖర్ రావులను నామినేట్ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎ.వెంకటేశ్వర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

# కంటైనర్‌ను ఢీకొన్న కారు: ఒకరు మృతి



**పెనుకొండ క్రైం, ప్రభ న్యూస్:** అనంతపురం జిల్లా పెనుకొండ జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను కారు ఢీకొన్న ఘటన శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని లైవ్ పాన్స్ (ఇన్వెటర్లు, బ్యాటరీ) కంపెనీ ముగ్గురు ఉద్యోగులు కంపెనీ సమావేశానికి బెంగుళూరు వెళ్లారు. సమావేశం అనంతరం బెంగుళూరు నుండి బయలుదేరి శనివారం తెల్లవారు జామున పెనుకొండ జాతీయ రహదారిపై వెంకటాపురం తాండా వద్ద డివైడర్‌ను ఢీకొని రోడ్డుకి కుడివైపు ఎదురుగా వస్తున్న కంటైనర్‌కు తగలడంతో నరేష్ (39), నరేంద్ర (40) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న రోహిత్ శర్మ కారు బెలూన్‌లు విడుదల అవ్వడంతో గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.

epaper.prabhanews.com

# రైతుభరోసా ప్రారంభానికి రండి!

**● హోదాతోనే రాష్ట్రాభివృద్ధి ముడిపడి ఉంది**
**● ప్రధాని మోడీతో ఏపీ ముఖ్యమంత్రి జగన్**
**● షెడ్యూల్ 9,10 ల్లోని సమస్యలపై చర్చ**



**అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అమలు చేయబోతున్న రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్రానికి రావల్సిందిగా ప్రధాని నరేంద్ర మోడీని ఏపీ సీఎం వైయస్ జగన్‌మోహన్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం ఆయన ఢిల్లీలో ప్రధానితో సుమారు గంటన్నరకుపైగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఇందులో భాగంగా ఈనెల 15న నెల్లూరులో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంట సాయం కింద రూ. 12,500 వంతున ఇచ్చే రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఈ పథకం ద్వారా 53 లక్షల మందికి లబ్ధి కలగనుంది. ఈ ప్రారంభోత్సవానికి వచ్చి రైతులకు బాసటగా నిలవాలని ముఖ్యమంత్రి ప్రధాని మోడీని కోరినట్లు తెలిసింది. అలాగే షెడ్యూల్ 9, 10ల్లో పరిష్క రించాల్సిన పలు అంశాలపై కూడా సీఎం జగన్ ప్రధాని తో చర్చించారు. దీనితోపాటు విభజన చట్టంలో పొందుపర్చిన విధంగా రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిన కేంద్ర సంస్థలు, విద్యా సంస్థలు వంటి వాటిపై కూడా చర్చించి సత్వరమే వాటి ఏర్పా టుకు సహకారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

### అదనపు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కోసం విజ్ఞప్తి

కేంద్రం నుండి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ. 61,071.51 కోట్లు అవసరమవుతాయని గత ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పేర్కొందని ముఖ్యమంత్రి ప్రధానికి చెప్పారు. ఈ ఏడాదిలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సమర్పించిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఇదే విషయాన్ని చెప్పామని తెలిపారు. కానీ, ఇప్పటివరకు కేంద్రం నుండి వచ్చింది రూ. 6,739 కోట్లు మాత్రమేనని ప్రధానికి వివరించారు. గత ప్రభుత్వం వివిధ పనులు, బిల్లులకు సంబంధించి రూ. 50 వేల కోట్లు పెండింగ్‌లో పెట్టిందని, నిధులు సకాలంలో విడుదల చేసి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. అందుకే గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద అదనంగా మరో రూ. 40 వేల కోట్లు ఇవ్వాలని ప్రధానిని కోరారు.

### రెవెన్యూ లోటు

2014-15లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు రెవెన్యూ లోటు రూ. 22,948.76 కోట్లుగా కాగ్ అంచనా వేసిందని సీఎం ప్రధానికి తెలిపారు. కానీ ఇప్పటి వరకు రూ. 3,979.50 కోట్లు మాత్రమే కేంద్రం ఉండి నిధులు విడుదలయ్యాయన్నారు. ఇంకా రూ. 18,962.26 కోట్ల మేర నిధులు విడుదల కావాల్సి ఉందని, సత్వరమే వాటిని విడుదల చేయాలని కోరారు. ఇదే అంశంపై ఈ ఏడాది ఆగస్టు 23న ప్రధానమంత్రి కార్యాలయ అధి కారులతో రాష్ట్ర సీనియర్ అధికా రులు సమావేశమై చర్చించినట్లు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ లోటు లెక్కలను సవరించడానికి సాను కూలత కూడా తెలిపారు. ఈ విషయం పరిగణలోకి తీసుకుని రెవెన్యూ లోటు భర్తీకి ఇవ్వాల్సిన నిదుల తోపాటు సవరించిన లెక్కల ప్రకారం అదనపు నిధులు కేటాయించాలని కోరారు.

### పోలవరం సవరించిన అంచనాలు ఆమోదించండి

పోలవరం ప్రాజెక్టుకు సంబం ధించి సవరించిన అంచనాలను ఆమో దించాలని సీఎం ప్రధానిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధుల నుండి రూ. 5,103 కోట్లను ప్రాజెక్టు నిర్మాణం కోసం వెచ్చించిందని, ఆ నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రాజెక్టు పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లడానికి మరో రూ. 16 వేల కోట్లను కూడా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి ఇంకా భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు పూర్తిచేయాల్సి ఉన్నందున సత్వరమే నిధు లను విడుదల చేయాలని కోరారు.

### రివర్స్ టెండరింగ్ ద్వారా రూ. 838 కోట్ల మేర ఆదా

2014 నుండి 2019 మధ్య పోలవరం పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్న నేపథ్యంలో నిపుణుల కమిటీ వేసినట్లు ప్రధానికి సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు. ఆ నిపుణుల కమిటీ అభిప్రాయం మేరకు పాత కాంట్రాక్టులను రద్దుచేసి, రివర్స్ టెండరింగ్ నిర్వహించ డం జరిగిందని తెలిపారు. ఈ రివర్స్ టెండరింగ్ ద్వారా రూ. 838 కోట్లు ఆదా అయినట్లు వివరించారు. ఇందులో హెడ్ వాటర్ వర్క్స్, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు పనుల మొత్తం రూ.780 కోట్లు కాగా, టన్నెల్ పనులకు సంబంధించి రూ.58 కోట్లు ఆదా అయినట్లు తెలిపారు.

### ప్రత్యేక హోదా ఇవ్వండి

ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని మరోమారు ప్రధానికి ముఖ్యమంత్రి జగన్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే అనేక సార్లు హోదా ప్రాధాన్యత గురించి మీకు వివరించడం జరిగిందని ఆయ గుర్తుచేశారు. విభజనతో రాష్ట్రం చాలా నష్టపోయిందని, ముఖ్యంగా పరిశ్రమలు, సేవా రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. తద్వారా రాష్ట్ర స్థూల ఆదాయంలో పెరుగుదల లేకపోగా తగ్గిందన్నారు. జీవీఏ(గ్రాస్ వాల్యూ యాడెడ్)లో వీటి వాటా 76.2 శాతం నుండి 68.2 శాతానికి పడిపోయినట్లు వివరించారు. అదేవిధంగా తలసరి ఆదాయం కూడా రూ. 1.46 లక్షల నుండి రూ. 1.29 లక్షలకు పడిపోయిందని చెప్పారు. ఈ పరిస్థితి మారాలంటే రాష్ట్రంలో పరిశ్రమలు, సేవా రంగం ఎంతో పురోగమించాల్సి ఉందన్నారు. అందువల్ల ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చినట్లుగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. ప్రత్యేక హోదాతోనే పరిశ్రమలకు రాయితీలు వచ్చే అవకాశం ఉందని, తద్వారా పెట్టుబడులను ఆకర్షించ్చని పేర్కొన్నారు.

### కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం

కృష్ణా డెల్టా తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటోం దని, కృష్ణా జిలాలపై ఆధారపడిన ప్రాంతాల్లో సాగు నీటిని స్థిరీకరిం చాల్సిన అవసరం ఉందని ప్రధానికి సీఎం జగన్ వివరించారు. రాయలసీమ ప్రాంతానికి ప్రధానంగా సాగు, తాగునీటి వనరైన శ్రీశైలం రిజర్వాయర్‌కు నీటి సరఫరా గత 52 ఏళ్లుగా చూస్తే 1230 టీఎంసీల నుండి 456 టీఎంసీలకు పడిపోయింద న్నారు. మరోవైపు గత 30 ఏళ్లుగా ఏటా సగటున ధవళేశ్వరం వద్ద 2,780 టీఎంసీల గోదావరి వరద జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నాయని తెలిపారు. గోదావరి నీటిని నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుకులకు తరలించడం ద్వారా కృష్ణా డెల్టాను స్థిరీకరించడంతోపాటు రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు సాగు నీరు సమృద్ధిగా లభించి, ఆర్థికంగా ఆ ప్రాంతం పురోగమించడానికి దోహదపడుతుందని వివరించారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మేలిమలుపు తిప్పే గొప్ప ప్రాజెక్టుగా నిలవనుందని తెలిపారు. ఆ దిశగా సంబంధిత మంత్రులకు తగు ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తి చేశారు.

## చంచల్‌గూడ జైలుకు రవిప్రకాష్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఏబీసీఎల్ కంపెనీ నిధులు దుర్వినియోగం చేశారనే అభి యోగంపై టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాష్‌ను బంజారాహిల్స్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు డీసీపీ సుమతి మీడియాకు వివరాలు వెల్లడించారు. రవిప్రకాష్‌తో పాటు మూర్తి కూడా నిధులు గోల్‌మాల్ చేశారని పోలీసులు గుర్తించారు. ప్రస్తుత టీవీ 9 సీఈవో గొట్టిపాటి సింగారావు శుక్రవారం చేసిన ఫిర్యాదు మేరకు రవిప్రకాష్‌ను అరెస్ట్ చేసినట్లు ఆమె తెలిపారు. ఏబీసీఎల్ కంపెనీకి చెందిన దారి మళ్లించిన రూ.18.31 కోట్ల గురించి పోలీసులు ఆరా తీశారు. బోనస్, ఎక్స్‌గ్రేషియా పేరుతో కంపెనీ నిధులను స్వలాభానికి వాడు కుని సంస్థకు నష్టం కలిగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వెల్లడించారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, షేర్ హోల్డర్స్ ఆమోదం తీసుకోకుండా కంపెనీ ఖాతా నుంచి నిధులను తీసుకుని స్వప్రయోజనాల కోసం వాడుకున్నట్లు ఆరోపణలున్నాయి. రూ.18.31 కోట్లను మూడు విడతలుగా విత్ డ్రా చేసినట్లు పోలీసులు గుర్తించారు. కంపెనీని నష్టాలకు గురిచేశారని అలంద మీడియా డైరెక్టర్ గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని డీసీపీ సుమతి తెలిపారు. రవిప్రకాష్, మూర్తిలపై 409, 418, 420 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఇద్దరిని నాంపల్లి కోర్టు లో హాజరుపర్చగా 18 వరకు రిమాండ్ విధించింది. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. రవిప్రకాష్‌ను తమ కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరుతామని డీసీపీ సుమతి తెలిపారు. అంతకు ముందు గాంధీ ఆస్పత్రిలో రవి ప్రకాష్‌కు వైద్యపరీక్షలు నిర్వహించారు. టీవీ9 మాజీ సీఎఫ్‌వో ఎంకే వీఎస్ మూర్తి కూడా నగదు దారి మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. రూ.5.97 కోట్లు విత్ డ్రా చేశారని పోలీసులు స్పష్టం చేశారు.

## ఏసీబీ కస్టడీకి 'ఈఎస్ఐ' నిందితులు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఈఎస్ఐ స్కాంలో నిందితులకు రెండ్రోజుల కస్టడీకి ఏసీబీ కోర్టు అనుమతిచ్చింది. దేవికారాణితో పాటు మరో ఆరుగురిని ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకోనున్నారు. మరోవైపు ఈఎస్ఐ స్కాంలో ఏసీబీ అధికారుల దర్యాప్తు వేగవంతం చేశారు. స్కామ్‌లో ఎవరెవరి పాత్ర ఉందనే దానిపై అధికారులు కూపీ లాగుతున్నారు. దేవికారాణితో పాటు మరో ఆరుగురిని తమ కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 5 రోజుల కస్టడీ కోరినప్పటికీ కోర్టు రెండ్రోజులకు మాత్రమే అనుమతిచ్చింది. 9, 10 తేదీల్లో నిందితులను అదుపులోకి తీసుకుని ఏసీబీ అధికారులు విచారించనున్నారు. ఓ ఐఏఎస్ సహకారంతో దేవికారాణి అంతా తానై నడిపించిందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

### 9కి చేరిన అరెస్టుల సంఖ్య...

ఏసీబీ అధికారులు శనివారం లైఫ్ కేర్ డ్రగ్స్ ఎండీ సుధాకర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు. మందుల కొనుగోలు స్కాంలో దేవికారాణికి సహకరించినట్లుగా దర్యాప్తులో తేలింది. లైఫ్ కేర్ డ్రగ్స్ నుంచి ఔషధాలు ఇవ్వకున్నా ఇచ్చినట్లు పత్రాలు సృష్టించినట్లు తేలింది. బలమైన సాక్ష్యాలు లభించినందున సుధాకర్‌రెడ్డిని అరెస్ట్ చేశారు.

## మండలి విప్‌గా ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా ఎమ్మెల్సీ ఎం.ఎస్ ప్రభాకర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్‌తో పాటు పలువురు నేతలు హాజరై ఎం.ఎస్ ప్రభాకర్‌ను అభినందించారు. అనంతరం మంత్రి మహమూద్‌అలీ మీడియాతో మాట్లాడుతూ మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చూస్తున్నదని, అందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. అన్ని బస్‌డిపోలకు పోలీసులతో పూర్తి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ చర్యలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

## అడవుల సంరక్షణలో బీట్ అధికారులు కీలకం

**● ముఖ్య సంరక్షణాధికారి ఆర్. శోభ**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అడవుల సంరక్షణలో బీట్ అధికారుల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి ఆర్.శోభ అన్నారు. శనివారం దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందిన బీట్ అధికారుల పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భావితరాలకు అడవుల సంరక్షణ ఎంతో ముఖ్యమని, వాతావరణ సమతుల్యత కోల్పోకుండా అడవులు దోహద పడతాయని అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు గ్రామీణ ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని, స్వచ్ఛందం భాగస్వామ్యంతో సామాజిక అడవుల అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి పి.రఘువీర్, అటవీ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, ఉన్నతాధికారులు పృథ్వీరాజ్, తిరుపతయ్య, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ మహిళల ఉపాధి కోసం పౌల్ట్రీకి చేయూత

**● కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్**



**రాజేంద్రనగర్, ప్రభ న్యూస్ :** దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల ఉపాధి కోసం పౌల్ట్రీకి చేయూతనిచ్చే కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోం దని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. త్వరలోనే ఈ కార్య క్రమం కార్యరూపంలోకి వస్తోందని, పౌల్ట్రీ రంగానికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యమని చెప్పారు. శనివారం రాజేంద్రనగర్‌లోని డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రీ రిసెర్చ్ సెంటర్‌లో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పౌల్ట్రీ రంగం వ్యవసాయానికి ఎంతో ఆసరాగా ఉంటోందని, రైతులు కష్ట సమయాల్లో కోళ్ళ పెంపకం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ఒకప్పటి కోళ్ళ పరిశ్రమ గ్రామాల్లో మళ్ళీ విస్తరించాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంత గ్రామాల్లో దేశీయ కోళ్ళ పెంపకం వారికి ఎంతో మేలు చేస్తుందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పాడి పరిశ్రమ తర్వాతి స్థానం కోళ్ళ పరిశ్రమదేనని, ఈ రెండు రంగాలు బలపడితే రైతు ఆదాయం ఆశాజనకంగా ఉంటుందని గిరిరాజ్ సింగ్ ఆశాభావం వ్యక్తంచేశారు. వీటితో పాటు రైతు ఆదాయం రెట్టింపు చేయాలన్న లక్ష్యంలో భాగంగా చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు మరిన్ని ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు వ్యూహ రచన జరుగుతోందన్నారు. ప్రభుత్వం ఇచ్చే చేయూతకు తోడుగా రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందడుగు వేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని ఆయన సూచించారు.

## కోర్టులో థాయ్ జడ్జి బలవన్మరణం

**బ్యాంకాక్:** ఓ హత్యకేసులో నిందితులను నిర్దోష లుగా ప్రకటించిన థాయ్ న్యాయమూర్తి అనంతరం కిక్కిరిసిన కోర్టులో తనను తాను తుపాకీతో కాల్చు కున్నారు. తీర్పు ప్రకటించక ముందు ఆయన ఫేస్‌బుక్ లైవ్‌లో భావోద్వేగ ప్రసంగం చేశారు. సాధారణ పౌరులు చేసే చిన్న నేరాలకు థాయ్‌లాండ్ కోర్టులు కఠిన శిక్షలు విధిస్తాయని అయితే ధనవంతులకు, శక్తిమంతులకు అనుకూలంగా పనిచేస్తాయని విమర్శకులు తరుచుగా ఆరోపిస్తుంటారు. కానీ న్యాయమూర్తులే వ్యవస్థను విమర్శించడం అరుదు. థాయ్ దక్షిణప్రాంతంలోని యాలా కోర్టులో న్యాయమూర్తి కనకార్న్ పియాంచన శుక్రవారం మధ్యాహ్నం ఐదుగురు ముస్లిం నిందితులను నిర్దోషులుగా తీర్పును వెలువరించారు. చేతి తుపాకీతో తనను ఛాతీలో కాల్చుకునే ముందు ఆయన మాట్లాడుతూ ఒకరిని శిక్షించడానికి స్పష్టమైన నమ్మదగిన ఆధారాలు కావాలని ఖచ్చితంగా తెలియకపోతే వారిని శిక్షించ కూడదని న్యాయమూర్తి కోర్టును ఉద్దేశించి తన వ్యాఖ్యలను ఫేస్‌బుక్‌లో ప్రత్యక్షప్రసారం చేశారు. ఐదుగురు ముద్దాయిలు నేరానికి పాల్పడలేదని తను అనడం లేదని, వారు నేరంచేసి ఉండవచ్చు. కానీ న్యాయప్రక్రియ పారదర్శకంగా విశ్వసనీయంగా ఉండాలన్నారు. అనంతరం న్యాయమూర్తి మాజీ థాయ్‌రాజు చిత్రంముందు తనను తాను ఛాతీలో తుపాకీతో కాల్చుకున్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆయన చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం లేదని థాయ్ న్యాయవ్యవస్థ కార్యాలయ ప్రతినిధి సూరియన్ హోంగ్విలై తెలిపారు. వ్యక్తిగత ఒత్తిడి కారణంగానే ఆయన తనను తాను కాల్చుకున్నారని కానీ ఒత్తిడికి కారణం స్పష్టంగా తెలియలేదన్నారు.

### ఆంధ్రప్రభ ఎఫెక్ట్...

## ఏపీలో ఈఎస్ఐ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ ముమ్మరం

**● రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు**



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన రూ.300 కోట్ల ఈఎస్ఐ మందుల కొనుగోలు కుంభకోణంపై ఆంధ్రప్రభలో ప్రచురితమైన వరస కథనాలు ప్రభుత్వంలో ప్రకంపనలు సృష్టించాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిందిగా విజిలెన్స్ శాఖకు అప్పచెప్పింది. గత మూడు రోజులుగా విజయవాడ డైరక్టరెట్, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతిలోని ప్రధాన ఆసుపత్రులు, డైరెక్టర్ల కార్యాలయంపై దాడులు నిర్వహించి తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారుల బృందం కీలక రికార్డులు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్రంలోని ప్రధాన ఆసుపత్రులతో పాటు ఈఎస్ఐ ఆధ్వర్యంలో జరుగుతున్న 78 డిస్పెన్సరీలు, 89 ఒప్పంద ఆసుపత్రులు, 84 టెలీహెల్త్ సర్వీసెస్ కేంద్రాలు, మూడు డయాగ్నస్టిక్ సెంటర్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించి దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో పలు నివ్వెపోయే అంశాలు బయటపడినట్లు తెలుస్తోంది.

## ఎల్‌వోసీ దాటొద్దు

**● పీవోకే ప్రజలకు ఇమ్రాన్ హెచ్చరిక**



**ఇస్లామాబాద్:** నియంత్రణ రేఖ దాటవద్దని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పీఓకే ప్రజలను శనివారం హెచ్చరించారు. భారత్ జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను తొలగించిన తరువాత కాశ్మీరీ ప్రజలకు మానవతా దృక్పథంతో సహాయం అందించేందుకు సరిహద్దు రేఖను దాటవద్దని ఆయన పీఓకే నివాసితులను కోరారు. జమ్మూ కాశ్మీర్లో తమ తోటి కాశ్మీరీల కోసం వారు అనుభవిస్తున్న మనోవేదన తనకు అర్థమైందన్నారు. కాశ్మీరీ పోరాటానికి సహాయంచేసేందుకు ఎవరైనా సరిహద్దు దాటితే వారు భారత్ చేతుల్లోకి వెళ్లిపోతారని ఇమ్రాన్‌ఖాన్ ట్వీట్ చేశారు. ఆగస్టు 5న జమ్మూ కాశ్మీర్ ప్రత్యేకహోదా రద్దు తరువాత భారత్, పాక్ మధ్య మరింత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్థాన్ న్యూఢిల్లీతో దౌత్య సంబంధాలను తగ్గించి భారత కమిషనర్‌ను బహిష్కరించింది. ఆర్టికల్ 370 రద్దు చేయడం అంతర్గత విషయం అని భారత్ స్పష్టం చేసింది. ఈనేపథ్యంలో కాశ్మీర్ సమస్యను అంతర్జాతీ యీకరించడానికి పాక్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. దీంతో భారత వ్యతిరేక వాక్చాతుర్యాన్ని ఆపాలని న్యూఢిల్లీ ఇస్లామాబాద్‌ను కోరింది. జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ పిలుపు మేరకు పీఓకేలోని వివిధ ప్రాంతాల నుంచి ముజఫరాబాద్‌కు మోటారుసైకిల్, వాహన ర్యాలీగా బయలుదేరిన వందలాదిమంది కాశ్మీరీలకు ఖాన్ సలహా ఇచ్చినట్టు డాన్ నివేదించింది. భారత విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ శుక్రవారం ఢిల్లీలో మాట్లాడుతూ ఖాన్ వ్యాఖ్యలు ఆయన హోదాకు తగిన విధంగా లేవని విమర్శించారు. భారత్‌కు వ్యతిరేకంగా జీహాద్ కోసం ఇమ్రాన్‌ఖాన్ బహిరం గంగా పిలుపునిచ్చారు. ఇది సాధారణ ప్రవర్తన కాదని కుమార్ అన్నారు. గత నెలలో జరిగిన యూఎన్‌జీఏ ప్రసంగం లోనూ ఇమ్రాన్‌ఖాన్ కాశ్మీర్ సమస్యను లేవనెత్తి కాశ్మీర్ అమానవీయ కర్ఫ్యూను భారత్ ఎత్తివేసి రాజకీయఖైదీలందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల అవకతవకలపై విచారణ జరిపించాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న బీసీ నాయకులు

## 'టెంపర్' ఫైనాన్స్ వివాదం

**జూబ్లీహిల్స్ పీఎస్‌లో పీవీపీ, బండ్ల పరస్పర ఫిర్యాదులు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సినీ నిర్మాత, వైసీపీ నేత పొట్లూరి వరప్రసాద్ (పీవీపీ), మరో సినీ నిర్మాత బండ్ల గణేష్ ఒకరిపై ఒకరు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. టెంపర్ సినిమా ఫైనాన్స్ విషయంలో వీరి మధ్య వివాదం నెలకొంది. తనను కిడ్నాప్ చేసి, హత్య చేయాలని చూస్తున్నారని పీవీపీపై బండ్ల గణేష్ ఫిర్యాదు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి తన అనుచరులతో కలిసి వచ్చిన బండ్లగణేష్ తనను బెదిరించాడని పీవీపీ ఫిర్యాదు చేశారు. పీవీపీ ఫిర్యాదుతో బండ్ల గణేష్‌తో పాటు మరో నలుగురిపై సెక్షన్ 420, 448, 506 రెడ్‌విత్ ఐపీసీ 43 కింద కేసు నమోదు చేశారు. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన టెంపర్ సినిమాకి బండ్ల గణేష్ నిర్మాతగా వ్యవహరించారు. దీనికి పీవీపీ రూ.7కోట్లు ఫైనాన్స్ చేశారు. కొంతకాలంగా తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని పీవీపీ అడుగు తున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాదమేర్పడింది. బండ్ల గణేష్ మాట్లాడు తూ.. విజయవాడ తన చేతుల్లో ఉందని, ఏపీలో తాను ఏం చెబితే అది జరుగుతుం దంటూ బెదిరించినట్లు ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వేధింపులు పెరిగాయన్నారు.

## పండుగొచ్చింది.. జీతాలే రాలేదు

*● జూన్-సెప్టెంబర్ జీతాలకోసం విద్యావలంటీర్ల ఎదురుచూపులు*
*● నిధులు విడుదల చేశామన్న ప్రభుత్వం... రాలేదంటున్న డీఈవోలు*
*● అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం: పాఠశాల విద్య కమిషనర్*

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న విద్యా వాలంటీర్లకు ఇప్పటి వరకు వేతనాలు అందలేదు. దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు అన్నట్టుగా పరిస్థితి ఉంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వేతనాలు దసరా పండగకు ముందుగానే ఇవ్వాలని పేర్కొంటూ అక్టోబర్ 1న విద్యా వాలంటీర్లకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. కానీ శనివారం నాటికి కూడా వారికి వేతనాలు అందలేదు. జూన్ నుంచి వేతనాలు లేకుండానే విద్యావలంటీర్లు పనిచేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ జిల్లా విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం మూలంగా వేతనాలు వారి ఖాతాల్లో జమ కాలేదు. కనీసం సోమవారం నాడైన తమ ఖాతాల్లో వేతనాలు జమ చేస్తే మంగళవారం పండుగ చేసుకుం టామని విద్యావాలంటీర్లు అంటున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ప్రతిపాదనల మేరకు 18,178 మందిని వలంటీర్లుగా నియమించారు. వారు జూన్ 12 నుంచి విధులను నిర్వర్తిస్తున్నారు. గత నెలలో జనవరి, ఫిబ్రవరి నెల వేతనాలను మంజూరు చేశారు. అక్టోబర్ 1న జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వేతనాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందుకోసం రూ. 75.17 కోట్లను మంజూరు చేసింది. ఆ నిధులను విడుదల చేశామని జిల్లా విద్యాశాఖాధికారులకు పాఠశాల విద్య కమిషనర్ టి. విజయ్‌కుమార్ లేఖలు రాశారు.

### నిధులు అందలేదంటున్న డీఈవోలు..

విద్యా వాలంటీర్ల వేతనాలకు సంబంధించిన ప్రోసిడింగ్స్ అందాయని, కానీ నిధులు రాలేదని జిలా విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాలకు సంబంధించి కేవలం 7 జిల్లాల్లోనే జిల్లా ట్రెజరీ ఆఫీస్(డీటీవో) లకు నిధులు వెళ్లాయి. మిగిలిన 26 జిల్లాల్లోనూ నిధులు రాలేదని విద్యా వాలంటీర్లకు వేతనాలు ఇవ్వలేమని డీఈవోలు చేతులెత్తేశారు. మెదక్, జోగులాంబ గద్వాల, ఖమ్మం, పెద్దపల్లి, హైదరాబాద్, సూర్యాపేట, భూపాలపల్లి డీఈవోలు విద్యా వాలంటీర్ల వేతనాలను డీటీవోలకు పంపించినట్టు తెలిసింది. మిగిలిన 26 జిల్లాల్లో వేతనాలకు సంబంధించి శనివారం నాటికి కూడా డీటీవోలకు పంపించలేదు.

### వేతనాలు చెల్లించాలి : విద్యా వలంటీర్ల సంఘం

రాష్ట్ర వ్యాప్తంగా 18,178 మంది విద్యా వాలంటీర్లు పనిచేస్తున్నామని తమకు జూన్ నుంచి వేతనాలు ఇవ్వలేదని తెలంగాణ విద్యా వాలంటీర్ల సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు శివానందస్వామి ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో దసరా పెద్ద పండుగ కాబట్టి, అధికారులు స్పందించి సోమవారం నాడైన వేతనాలను తమ ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ కన్నెర్ర

**● అధిక చార్జీల వసూళ్లపై తనిఖీలు ● కేసులు నమోదు ● జరిమానాల విధింపు**
**● రద్దీ తగ్గేవరకు తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడి**




**అమరావతి, ఆంధ్రప్రభ:** ప్రైవేటు ట్రావెల్స్ దందాపై రవాణాశాఖ అధికారులు కన్నెర్ర చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అధిక రేట్లకు ఆన్‌లైన్ టిక్కెట్లు విక్రయించిన ట్రావెల్స్ యజమానులపై కేసులు నమోదుతో పాటు భారీ జరిమానాలు విధిస్తున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు స్వస్థలాలకు వెళుతుంటారు. ఓ వైపు దసరా రద్దీ..మరో వైపు తెలంగాణ ఆర్టీసీ సమ్మెతో ఒక్కసారిగా ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు రెచ్చిపో యారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో రెండు నుంచి మూడు రెట్లు చార్జీలను అధికంగా వసూలు చేస్తున్నట్లు వచ్చిన సమా చారంపై రవాణాశాఖ అధికారులను ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పీఎస్ఆర్ ఆంజనేయులు అప్రమత్తం చేశారు. అన్ని ప్రైవేటు బస్సులను తనిఖీ చేయాలంటూ కమిషనర్ ఆదేశాలు జారీ చేయడంతో పలు జిల్లాల ఉప రవాణా కమిషనర్లు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద బస్సలను ఆపి ప్రయాణికుల టిక్కెట్లను పరిశీలిస్తున్నారు. పలువురు ట్రావెల్స్ నిర్వాహకులు అసలు కంటే అధిక చార్జీలు వసూలు చేసినట్లు నిర్ధారణ కావడంతో కేసులు నమోదుతో పాటు రూ.25వేల వరకు జరిమానాలు విధించారు. ఒక్క కృష్ణాజిల్లాలోనే అధిక చార్జీలు వసూలు చేసిన ట్రావెల్స్‌పై 113 కేసులను అధికారులు నమోదు చేశారు. మరో రెండు బస్సులు సరైన పత్రాలు లేకుండా నడపడంతో సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. దసరా రద్దీ ముగిసే వరకు ఇదే తరహా తనిఖీలు కొనసాగుతాయని రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని నిర్దేశిత రుసుము కంటే అధిక చార్జీలు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదని కృష్ణా జిల్లా ఉప రవాణా కమిషనర్ ఎస్.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే టిక్కెట్ల విక్రయాలు నిర్వహించాలన్నారు. పలువురు ప్రయాణికుల నుంచి వివరాలు సేకరించి కేసులు నమోదు చేశామన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల విభజన పూర్తి

**అమరావతి, ఆంధ్రప్రభ:** విద్యుత్‌శాఖలో ఏపీ స్థానికత కలిగిన పెండింగ్ ఉద్యోగుల విభజనను అధికారులు పూర్తి చేశారు. 1,157 మందిలో 613 మందిని మాత్రమే తీసుకోవాలని జస్టిస్ ధర్మాధికారి ఆదేశాలు జారీచేశారు. తెలంగాణకు రావడానికి ఆప్షన్లు ఇచ్చిన 265 మంది విషయంలో మాత్రం రెండు రాష్ట్రాల విద్యుత్ సంస్థలు చర్చించి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. తుది కేటాయింపులు మాత్రం తమ అనుమతితోనే చేపట్టాలని ధర్మాధికారి ఆదేశించారు. ఈ విషయమై నవంబరు 2, 3 తేదీల్లో మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు.

## స్థానిక ప్రజా ప్రతినిధులకు వేతనాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని గ్రామ పంచాయత్, మండల పరిషత్, జిల్లా పరిషత్ స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న వారి గౌరవ వేతనాల కోసం ప్రభుత్వం మొత్తం రూ.32.19కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను గ్రామ పంచాయతీ సర్పంచులకు, మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులకు, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులకు 2019-20 ఆర్థిక సంవత్సరానికి చెందిన గౌరవ వేతన బకాయిల కింద చెల్లించనున్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్యకార్యదర్శి వికాస్ రాజ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.



# కారు.. గుర్తుల కంగారు

## అప్పుడు దెబ్బతీసిన రోడ్ రోలర్, ట్రక్

- హుజూర్‌నగర్ ఉపఎన్నిక బ్యాలెట్ నమూనా విడుదల
- ఇప్పుడు కారు కిందే ట్రాక్టర్, రోడ్ రోలర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** టీఆర్ఎస్‌కు ఇపుడు మళ్ళీ గుర్తుల టెన్షన్ పట్టుకుంది. హుజూర్‌నగర్ వేదికగా.. కారును పోలిన గుర్తులు ఇపుడు మళ్ళీ కలవరపెడుతున్నాయి. ఎన్నికల్లో కుడిఎడమైతే నేతల జాతకాలు మారిపోతాయ్. పోలింగ్ సమయంలో గుర్తులను పోలిన గుర్తులు గత అసెంబ్లీ ఎన్నికల్లో అనేకమంది నేతల ఓటమికి కారణమయ్యాయని టీఆర్ఎస్ నేతలు ఇప్పటికీ చెబుతారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కారును పోలిన ట్రక్కు గుర్తుకు వేల ఓట్లు పడి టీఆర్ఎస్ నేతలు కొందరు మునిగిపోయారు. రాజకీయ జీవితాలే తలకిందులయ్యాయి. ఇపుడు మళ్ళీ హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో కారును పోలిన గుర్తులు బ్యాలెట్ పేపర్‌లో ఉండడం పార్టీ నేతలను టెన్షన్ పెడుతోంది. భువనగిరి పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో రోడ్డురోలర్ గుర్తుకు 28వేల ఓట్లు పడ్డాయి. ఇక్కడ టీఆర్ఎస్ అభ్యర్థి బూరనర్సయ్యగౌడ్ స్వల్ప ఓట్లతేడాతో ఓటమి చవిచూశారు. కారుకు పడాల్సిన ఓట్లు పెద్దసంఖ్యలో రోడ్డురోలర్‌కు పడ్డాయని, అందుకే తమ అభ్యర్థి ఓడారని టీఆర్ఎస్ చెప్పింది. ఈసీకి ఫిర్యాదుచేసి ట్రక్కు, ఆటో గుర్తులను గుర్తుల జాబితా నుండి తొలగించేలా చేసింది. అయితే రోలర్, ట్రాక్టర్ వంటి గుర్తులను తీసేయడానికి ఈసీ నిరాకరించింది. 28మంది అభ్యర్థులు పోటీపడుతున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రతి ఓటూ కీలకమే. ప్రస్తుతం బ్యాలెట్ నమూనా, సీరియల్ నంబర్లు కేటాయించగా, కారు గుర్తు కిందనే ట్రాక్టర్ గుర్తు, దానికిందనే రోడ్డురోలర్ గుర్తు వచ్చేసింది. ట్రక్కు, ఆటోతో పోలిస్తే కారుకు, ట్రాక్టర్‌కు తేడా ఉన్నప్పటికీ, గుర్తు పోలికలు ఉన్నందున గ్రామీణ ప్రాంతాల్లో కొంత కన్‌ఫ్యూజన్ ఖాయమన్న ఆందోళన నేతల్లో ఉంది.

ఇక బేబివాకర్, హెలికాప్టర్, క్రేన్ గుర్తులు కూడా జాబితాలో ఉన్నారు. ప్రధాన పార్టీల గుర్తుల కిందే ఇవి ఉండడం, చూడడానికి భిన్నంగా ఉండడంతో వాటికొచ్చిన ఇబ్బందేం లేదు. అయితే ఈవీఎం వద్దకు వెళ్ళి నొక్కే సమయంలో గుర్తులను పోల్చిచూసుకోవడం, సరిగ్గా కారు గుర్తుకే నొక్కాలనుకున్నా పెద్దవయసు ఉన్న వారు ఒక్కోసారి కింద గుర్తుకు నొక్కడం జరుగుతుంటుందని, ఈ నేపథ్యంలో గుర్తు విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని టీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

కేటీఆర్ రోడ్‌షో సందర్భంగా అభ్యర్థి సైదిరెడ్డి పదేపదే గుర్తును, సీరియల్ నెంబర్‌ను గుర్తుచేయడం ఇందులో భాగంగా కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికల సమయంలో కారు గుర్తు ప్రజల్లో రిజిస్టర్ అయ్యేందుకు టీఆర్ఎస్ అనేక జాగ్రత్తలు తీసుకుంది. కొత్త కొత్త ప్రచార కార్యక్రమాలు తీసుకుంది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కారును పోలిన ట్రక్కు గుర్తు కారణంగానే ఉత్తమ్ గెలిచాడని, ఉత్తమ్ మెజారిటీ కంటే కారు గుర్తుకు ఎక్కువ వచ్చాయని కేటీఆర్ పదేపదే చెబుతున్నారు. ఇపుడు కూడా మళ్ళీ కారును పోలిన గుర్తులు టెన్షన్ పెడుతున్న నేపథ్యంలో.. జాగ్రత్తలు తీసుకోవాలని నేతలు వ్యూహరచన చేస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2.36లక్షల ఓటర్లుండగా, పోలింగ్ 90శాతం జరుగుతుందని నేతలు చెబుతున్నారు. ఇక్కడ ప్రతిసారీ ఓటింగ్ భారీగానే ఉంటుంది. గుర్తుల కన్‌ఫ్యూజన్ సమస్యను టీఆర్ఎస్ ఎలా అధిగమిస్తుంది.. తీసుకుంటున్న జాగ్రత్తలు ఫలిస్తాయా అన్నది ఆసక్తికరంగా ఉంది.




## హుజూర్‌నగర్‌లో..
# టీఆర్ఎస్‌కు వైసీపీ మద్దతు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్‌లో గెలుపు కోసం టీఆర్ఎస్ అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటోంది. ఇప్పటికే సీపీఐ మద్దతు సాధించడంలో విజయవంతమైన టీఆర్ఎస్, ఇపుడు హుజూర్‌నగర్ ప్రాంతంలో చెప్పుకోదగ్గ స్థాయి ఓటుబ్యాంకు ఉన్న వైఎస్సార్‌సీపీ మద్దతును కోరింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి నివాసానికి వెళ్ళిన టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఉప ఎన్నికల ఇన్‌ఛార్జి పల్లా రాజేశ్వరరెడ్డి వైసీపీ మద్దతు కోరారు. సానుకూలంగా స్పందించారు. అభివృద్ధి నిరోధక ఉత్తమ్ కుమార్‌రెడ్డిని, కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఉత్తమాటలు చెప్పే ఉత్తమ్ నియోజకవర్గంలో వైఎస్ఆర్ విగ్రహాలు తగులబడినపుడు స్పందించలేదన్నారు. హుజూర్ నగర్ టీఆర్ఎస్ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వైసీపీ టీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించడం పట్ల పల్లా రాజేశ్వరరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రచారానికి వైసీపీ ఎమ్మెల్యేలు

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పల్నాడు సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయి. ఆచార వ్యవహారాలు, దగ్గరి బంధుత్వాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పల్నాడుకు చెందిన వైసీపీ ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌కు మద్దతుగా ప్రచారానికి వచ్చే అవకాశం ఉందని, దసరా తర్వాత పలువురు ఎమ్మెల్యేలు ప్రచారానికి వస్తామని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. బహిరంగంగా రోడ్‌షోలు కాకుండా, ఆత్మీయ సమావేశాలకు ఎమ్మెల్యేలు హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

## మా హయాంలోనే..
# అభివృద్ధి

- కేటీఆర్‌కు హుజూర్‌నగర్ సంగతి తెలీదు
- ఇది అభివృద్ధికి, అరాచకానికి మధ్య పోరాటం: ఉత్తమ్

**హుజూర్‌నగర్, ప్రభన్యూస్ :** హుజూర్‌నగర్ ఉప ఎన్నిక అభివృద్ధికి, అరాచకానికి మధ్య జరుగుతున్నదని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి కేటీఆర్‌పై తీవ్రంగా విమర్శలు చేశారు. హుజూర్‌నగర్ వెనుకబాటుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డినే కారణమని మంత్రి కేటీఆర్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. 'బ్రదర్ కేటీఆర్ నీకు అవగాహన లోపం ఉంది. స్థానిక విషయాలేమీ తెలియవు. మీ పార్టీకి చెందిన పనికిరాని వాళ్లు రాసిచ్చిన స్క్రిప్టును చదివినావు. భారతదేశ చరిత్రలో ఇప్పటి వరకు ఎక్కడా జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హుజూర్‌నగర్‌లో జరిగింది. మీ పార్టీ అభ్యర్థి ఊళ్లో కూడ నేనే అభివృద్ధి చేశాను' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. మీ పార్టీకి చెందిన నాయకులు కేవలం పోలీస్‌స్టేషన్లను అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇసుక దందా, మట్టి దందా, భూ మాఫియాలకు పాల్పడుతూ అమాయక గిరిజనులు, రైతులు, కాంగ్రెస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో పెడుతున్న విషయం కేటీఆర్ తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు.

టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి చేయలేదన్నారు. మీ ప్రభుత్వ అసమర్థత, చేతగాని తనంతో మిషన్ భగీరథపనులతో అద్భుతంగా ఉన్న సిమెంటు రోడ్లు ధ్వంసమైనాయని ఉత్తమ్ అన్నారు. హుజూర్‌నగర్ నియోజక వర్గం పరిధి లోని ఒక్క గ్రామానికి కూడా మిషన్‌భగీరథ నీళ్లు రాలేదని ఆయన వివరించారు. నాలుగువేల రెండు పడక గదుల ఇళ్ల కోసం అసెంబ్లీలో ప్రస్తావించినప్పటికి ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తుందని, స్మార్ట్ సిటిగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఈఎస్ఐ ఆసుపత్రి, జగ్గయ్యపేట నుంచి మిర్యాల గూడ వరకు పాసింజర్ రైలు, పాలకీడు మండలంలోని చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇచ్చేందుకు కొత్త లిఫ్టు నిర్మాణం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించడంతో పాటు హుజూర్ నగర్, కోదాడ నియోజక వర్గంలోని రైసు మిల్లుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# నేడు మహా బతుకమ్మ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** సద్దులబతుకమ్మను పురస్కరించుకుని మహాబతుకమ్మ వేడుకలను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వి.శ్రీనివాసగౌడ్ అన్నారు. ఆదివారం ముగింపు వేడుకల నేపథ్యంలో ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేసిన వేదికను, బతుకమ్మ ఘాట్‌లను పరిశీలించారు. ఎల్‌బిస్టేడియంలో వేలాదిమంది మహిళలతో బతుకమ్మలు తయారుచేసి ఊరేగింపుగా బషీర్‌బాగ్, లిబర్టీక్రాస్ రోడ్డు నుండి ట్యాంకుబండ్ మీదుగా బతుకమ్మఘాట్ వరకు కళాకారులు, మహిళలు వేలాదిగా బతుకమ్మ ఘాట్‌లో బతుకమ్మల నిమజ్జనంలో పాల్గొంటారన్నారు.

పూలతో పూజించే ప్రకృతిపండుగను నిర్వహించుకోవడం తెలంగాణకు గర్వకారణమని శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మహిళలను గౌరవిస్తూ వారి ఔన్నత్యాన్ని చాటిచెప్పే గొప్పపండుగ బతుకమ్మ అన్నారు.

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ వేడుకలు దర్పణం పడతాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే ప్రభుత్వపరంగా ప్రాచీనసంస్కృతిని పరిరక్షణ చేసుకునే ఏర్పాట్లు జరిగాయని డిప్యూటీ స్పీకర్ పద్మారావు అన్నారు.

### ఖతార్‌లో జానపద బతుకమ్మ

తెలంగాణ జాగృతి ఖతార్ ఆధ్వర్యంలో తెలంగాణ జానపదాల ప్రాముఖ్యతను చెబుతూ బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రముఖ జానపద కళాకారులు తేలు విజయ, అష్టగంగాధర్‌లు హాజరై జానపదాలతో ఉర్రూతలూగించారు.



## వెన్నముద్దల బతుకమ్మ వేడుకలో గవర్నర్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** బతుకమ్మ సంబురాలను రాజ్‌భవన్‌లో ప్రాంగణంలో చివరిరోజు శనివారం 'వెన్న ముద్దల' బతుకమ్మలో మహిళా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతుల మీదుగా బతుకమ్మ కానుకగా అందుకున్న చీరలను కట్టుకుని, రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది వేడుకల్లో పాల్గొన్నారు. వీరితో కలిసి గవర్నర్ కూడా బతుకమ్మ ఆటపాటలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంతా తమిళిసై మాట్లాడుతూ, రాజ్‌భవన్ ఉద్యోగులతో కలిసి బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం తనకు చాలా ప్రత్యేకంగా, అక్కాచెల్లెళ్ళతో ఉన్నట్లు ఉందని సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఈ వేడుకల్లో రాజ్‌భవన్ ఉద్యోగుల పిల్లలు పాటలతో, సంప్రదాయ నృత్యాలతో అలరించారు.

## కాళరాత్రి రూపంలో..



బాసర సరస్వతి అమ్మవారు శనివారం కాళరాత్రి క్రమంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రం మూల కావడంతో బాసర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు.

## సరస్వతి అలంకారంలో భద్రకాళి



శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా వరంగల్ భద్రకాళి అమ్మవారు శనివారం సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం జరిగిన రథోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తన్మయత్నం చెందారు.



# బువ్వేది?!

**కిలో టమాట ₹ 35,000**

## అక్కడ లీటర్ పాలు రూ.48,000

- వెనెజులాలో తీవ్ర ఆర్థిక, రాజకీయ సంక్షోభం
- అనుచిత పథకాల భారం
- మాంసానికి జీతంలో మూడో వంతు ఖర్చు
- 720 శాతం పెరిగిన ద్రవ్యోల్బణం
- శవాలనూ దహనం చేయని పరిస్థితి
- రాజధాని కారకాస్‌లో చీకటి రాజ్యం
- విద్యుత్ సరఫరా లేక నిలిచిన సేవలు
- పర్యాటక అందాలకే పరిమితమైన చమురు క్షేత్రం
- మదురో, కువాన్ గ్వాయిడో మధ్య రాజకీయ అనిశ్చితి

**న్యూఢిల్లీ :** వెనెజులా.. దక్షిణ అమెరికాకు ఉత్తర తీరంలో ఉన్న అతి చిన్న దేశం. జనాభా 3.2 కోట్లు. అంటే సరాసరి మన దేశంలో ఓ రాష్ట్ర జనాభా. అంత చిన్న దేశం మీద ఇప్పుడు ప్రపంచ దేశాల కన్నుపడింది. కారణం అక్కడ కొనసాగుతున్న అస్థిరతను సొమ్ము చేసుకోవడానికి చేస్తున్న కుటిల ప్రయత్నాలే. మరీ ముఖ్యంగా అగ్రరాజ్యమైన అమెరికా, వెనెజులా మీద దృష్టిపెట్టి అక్కడ పాలనను స్తంభింపజేసే ప్రయత్నాలు చేస్తోంది. ఇన్ని దేశాలు ఒక చిన్న దేశ మీద ఆసక్తి చూపడానికి కారణం అక్కడ లభ్యమయ్యే అపారమైన చమురు, వజ్రాల నిక్షేపాలే. ఎన్నో చారిత్రాత్మక ఇంద్ర భవనాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన వెనెజులా... ఇప్పుడు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. అక్కడి రాజకీయ పరిస్థితులు, ఆర్థిక వ్యవస్థలు ఆ దేశాన్ని ఒంటరిని చేశాయి. పర్యాటకులతో కళకళలాడిన వెనెజులా.. ఇప్పుడు ఖాళీ భవనాలు, నిర్మానుష్యమైన రోడ్లు, వెలవెలబోయిన షాపింగ్ మాళ్లతో దర్శనమిస్తోంది. ఎక్కడ చూసినా.. అల్లరి మూకలతో దద్దరిల్లుతోంది. సగంలోనే నిలిపి వేసిన ప్రభుత్వ నిర్మాణాలు, దాడులతో పాక్షికంగా ధ్వంసమైన భవనాలు, దోపిడీకి గురైన షాపింగ్ మాళ్లు వందలాదిగా ఉన్నాయి. తిండి కోసం అలమటించిన జనం.. చివరికి లూటీలకు పాల్పడుతున్నారు.



### కళలను నమ్ముకొని వలసబాట

వెనెజులాలో నివసించే ప్రతీ ఒక్కరు ఏదో ఒక కళలో ప్రావిణ్యం కలిగి ఉండటం విశేషం. వలస వెళ్లిన వారంతా ఆ కళనే నమ్ముకుని పొట్టనింపుకుంటున్న దయనీయ పరిస్థితి నెలకొంది. వీధుల్లో పాటలు పాడి, డ్యాన్సులు చేసి, సంగీతం క్లాసులు చెబుతూ పూట గడుపుతున్నారు. లక్షలాది మంది వెనెజులా వాసులు పెరూ బాటపట్టడంతో అక్కడి ప్రభుత్వం కూడా వలసదారులపై జూన్‌లో ఆంక్షలు విధించింది. తమ దేశంలో నివాసం ఉండాలంటే వీసా, పాస్‌పోర్టు తప్పనిసరి అనే నిబంధన తెచ్చింది. దీంతో వీరి పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

### 720 శాతం పెరిగిన ద్రవ్యోల్బణం

ఒపెక్ దేశాల్లో ఆరో అతిపెద్ద చమురు ఉత్పత్తిదారైన వెనెజులా తీవ్ర సంక్షోభంతో కేవలం పర్యాటక ప్రాంతంగా మిగిలిపోయింది. అధిక ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ క్షీణత, అధిక ద్రవ్య సరఫరా, ద్రవ్య నిర్వహణ లోపం, చమురు సంక్షోభం, లోప భూయిష్ట వినిమయ రేటు విధానం, అధిక ప్రభుత్వ వ్యయం, అధికరుణ భారం సంక్షోభానికి ప్రధాన కారణాలు. కరెన్సీ బొలివర్ విలువ భారీగా పతనమైంది. ఆహారం కొరత తాండవిస్తోంది. ద్రవ్యోల్బణం 720 శాతం పెరిగింది. ముద్రించిన కరెన్సీకి, నిత్యవసరాలకు పొంతన లేనందున సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో టమాట రూ.30వేలు, లీటర్ పాలు రూ.48వేలకు చేరడం ఆర్థిక సంక్షోభం పరాకాష్టను తెలియజేస్తున్నది. కప్పు కాఫీ 450 బొలివర్ నుంచి 70,00,000 బొలివర్లకు పెరిగింది. ధరలు 1,55,000 శాతం పెరిగాయి. ఒకసారి మాంసం కొనాలంటే నెల జీతంలో మూడో వంతు ఖర్చు పెట్టాల్సిందే. రోజుకు 10 సార్లు కరెంట్ కోత. దీంతో శవాల ను కూడా దహనం చేయని పరిస్థితి నెలకొంది. అవి కుళ్లిపోతున్నా పట్టించుకునే వారు లేరు.

### 13వేల నుంచి వెయ్యికి తలసరి ఆదాయం

వెనెజులా రాజు హుగొచవెజ్ కాలంలో ప్రారంభమైన ఆర్థిక సంక్షోభం మదురో కాలంలోనూ కొనసాగుతున్నది. ఆకలి, రోగాలు, నేరాలు, చావులు, వలసలు నిత్యకృత్యం అయ్యాయి. ఆగస్టు నాటికి సుమారు 43 లక్షల మంది వలస వెళ్లిపోయారు. పచ్చి మాంసం, తినడానికి పనికిరాని మాంసం కూడా కొనుక్కుంటున్నారు. విద్యుత్ లేకపోవడంతో రాజధాని కారకా స్‌లో చీకటి రాజ్యమేలుతోంది. ప్రాసెసింగ్ యూనిట్లు మూతపడ్డాయి. ఒకప్పుడు వెయ్యి లక్షల కోట్లతో 10 అగ్ర దేశాల సరసన నిలిచిన వెనెజులా ఇప్పుడు అట్ట డుగు 10 దేశాల జాబితాలో చేరింది. తలసరి ఆదా యం రూ.13వేల నుంచి రూ.1000కి పడిపోయింది.

### సంక్షేమం పేరిట ఉచిత సేవలు

చావెజ్ అధికారంలోకి వచ్చాక ప్రజలందరికీ సంక్షేమం పేరిట చదువు, విద్యుత్, నీరు, వైద్యం, ఆహారం, బట్టలు, ఇళ్లు అన్నీ ఉచితంగా ఇవ్వడం ప్రారంభించాడు. ప్రభుత్వ వ్యాపారం పెరగడంతో ప్రైవేటు వ్యాపారాలు మూతపడ్డాయి. ప్రభుత్వ దుకాణాల్లో అవినీతి పెరిగి బ్లాక్ మార్కెట్ ఊపందుకుంది. ఒకప్పుడు వ్యవసాయం చేసే వారంతా అన్నీ ఉచితంగా అందుతుండటంతో సాగు చేయడం మానేశారు. ఆహారోత్పత్తి తగ్గింది. ఆహారం దిగుమతి పెరిగింది. చమురు ద్వారా వచ్చిన లాభాలన్నీ వాటి కోసమే ఖర్చుపెట్టడం ప్రారంభమైంది. 2013 లో చావెజ్ చని పోయిన తరువాత మదురో అధికారంలోకి వచ్చాడు. ఆయన కూడా చావెజ్ బాటపట్టడంతో 2014 ఆయిల్ బ్యారెల్ ధర 100 డాలర్ల నుంచి 60 డాలర్లకు పడిపోయింది. మొత్తం ధనం సంక్షేమం పేరిట ఆవిరైపోయింది. 2016లో చమురు బ్యారెల్ 30 డాలర్లకు పడిపోయింది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా ఘోరంగా పతనమైంది.

వెనెజులా రాజధాని కారకాస్‌లో వారసత్వ సంపదకు పుట్టినిల్లుగా ఉండింది. ముఖ్యంగా అందమైన కళాఖండాలు, శిల్పాలు, పెయింటింగ్‌లు, అద్భుతమైన భవనాలు ఇక్కడ ఉన్నాయి. కారకాస్‌తో పాటు మెక్సికో సిటీ, బ్రాసిలియా, రియో డీ జనేరియోలో కూడా ఇలాంటి అద్భుతమైన సంపద ఉంది. కారకాస్‌లో ఆధునికమైన భవనాలు ఉన్నాయని, ఇదే కారకాస్‌కు గుండెకాయ అని వెనిజువెలలోని డొకా

### పర్యాటక ప్రదేశంగా వెనిజువెల

'మోమో బ్రాంచ్ ప్రధాన ఆర్కిటెక్చర్ హన్నియా గోమేజ్ చెప్పుకొచ్చారు. ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా కట్టిన ఆధునాతన భవంతులు వెనిజు వెలాలో ఉన్నాయి. కానీ ప్రస్తుతం అవన్నీ కూల్చివే యబడ్డాయని హన్నియా వివరించాడు. వెనిజువెల లోని సియుడాడ్ యూనివర్సిటియా డికారకాస్‌ను ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది.

### మదురో ఎన్నికపై ప్రతిపక్షం అభ్యంతరం



2013లో చావెజ్ మరణించే ముందు మదురోను తన వారసుడిగా ప్రకటించాడు. అప్పటి నుంచి అతని పాలన కొనసాగింది. గతేడాది మే నెలలో మదురో మరోమారు ఆరేళ్ల పదవీ కాలం కోసం 60 శాతానికి పైగా ఓట్లతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఎన్నికల్లో పోటీ చేయని విపక్షం ఆయన విజయం అక్రమం అని ప్రకటించింది. ట్రంప్ ఎన్నికైన తరువాత వెనిజువెలపై ఆంక్షలు మరింత ఎక్కువ అయ్యాయి. వెనెజులాకు దక్కాల్సిన చమురు సంస్థల లాభాలు, బంగారు నిల్వల బకాయిలను ట్రంప్ ఆపేశాడు. ఇదే అదునుగా ప్రతిపక్ష నేత కువాన్ గ్వాయిడో, మదురో మీద విమర్శలు ఎక్కుపెట్టాడు.

### పార్లమెంట్ వేదికగా రక్తపాతం



గ్వాయిడో అనుచరులకు, మదురో మద్దతుదారులకు పార్లమెంట్ వేదికగా వెనెజులా స్వాతంత్ర్య దినోత్సవం నాడు భీకర యుద్ధమే జరిగింది. తలలు పగిలి రక్తం పారింది. పిల్లలను అమ్ముకునే పరిస్థితికి ప్రజలు వెళ్లారు. మహిళలు వ్యభిచారం బాటపట్టారు. ప్రజల్ని సోమరిపోతులను చేస్తే జరిగే నష్టానికి వెనెజులే ఓ ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 2004 - 2014 మధ్య చమురు ధరలు పెరిగినప్పుడు వచ్చిన ఆదాయంతో భవిష్య నిధి ఏర్పాటు చేయలేదు. పైగా ప్రజలకు సంక్షేమం పేరిట వరా ల జల్లు కురిపించాడు.

### సంక్షోభం వెనుక అమెరికా హస్తం

మదురో ఎన్నికను గుర్తించేది లేదని గతేడాదిలోనే అమెరికా ప్రకటించింది. ఆయన ప్రమాణ స్వీకారం నాడు సైన్యాన్ని తిరుగుబాటు చేయాల్సిందిగా బహిరంగంగానే పిలుపునిచ్చింది. చమురు ఎగుమతులపై ఆధారపడిన వెనెజులా పలు ఆంక్షలతో పీల్చిపిప్పి చేస్తున్న అమెరికా మదురో స్థానంలో ఎవరు వచ్చినా భారీ విరాళాలు, రుణాలు సమకూరుస్తామని ఆశ చూపుతున్నది. దశాబ్దం క్రితం నాటి ఆర్థిక సంక్షోభం వెనెజులాను మరింత తీవ్రంగా వెంటా డుతున్నది.

### ప్రపంచంలోనే భారీ చమురు నిక్షేపాలు

1920-70 మధ్య కాలంలో వెనెజులాలో చమురు నిక్షేపాలు కనుగొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద నిక్షేపాలివే. చమురు ధరలే ఏ దేశ ఆర్థిక ప్రగతినైనా నిర్ణయిస్తాయి. 1980-1990 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పడిపోయాయి. వెనెజులా రుణగ్రస్తమైంది. 1990లో అధికారంలోకి వచ్చిన చవేజ్ సామాజిక సేవలను విస్తరిస్తానని చెప్పాడు. కానీ దేశం అంతటా అవినీతి పెరిగింది. 1985-94లో బ్రెజిల్‌లో వచ్చిన ఆర్థిక సంక్షోభం, జింబాబ్వే 2008-09లో వచ్చిన అధిక ద్రవ్యోల్బణం, 90వ దశకంలో రష్యా విచ్ఛిన్నం కావడం కంటే అధికంగా వెనెజులాలో సంక్షోభం నెలకొని ఉంది.



## బ్యాంక్ సిబ్బందికి దీపావళి బొనాంజా

**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ బ్యాంక్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్. ఒక నెల జీతానికి సమానస్థాయిలో వేతన బకాయిల్లో కొంత భాగం ఉద్యోగులకు చెల్లించేందుకు బ్యాంక్‌ల మేనేజ్‌మెంట్లు సిద్ధమయ్యాయి. జీతాల పునఃసవరణపై ఉద్యోగుల యూనియన్లు, మేనేజ్‌మెంట్ మధ్య తుది అంగీకారం కుదరక ముందే ఈ మేరకు జీతం అకౌంట్లలో జమకానుండడం ఇండియన్ బ్యాంకింగ్ రంగంలో కొత్త చరిత్ర. ఒక నెల జీతానికి సమానమైన బకాయి జీతాలను చెల్లించాలని కోరుతూ అన్నీ ప్రభుత్వ, ప్రైవేటురంగ బ్యాంక్‌ల అధిపతులకు అక్టోబర్ 1న ఐబీఏ(ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్) లేఖ రాసింది. యూనియన్ల మధ్య అంగీకారం కుదిరిన తర్వాత ఈ మొత్తాన్ని మినహాయించుకోవచ్చునని లేఖలో వివరించింది. దీంతో బకాయిలు చెల్లించాలని మేనేజ్‌మెంట్లు నిర్ణయించాయి. బకాయిల చెల్లింపులను ఉద్యోగులు నిరాకరించవచ్చు లేదా ఇష్టమైతే తీసుకోవచ్చని ప్రభుత్వరంగ బ్యాంక్‌కు చెందిన ఓ ఉద్యోగి వివరించారు. బకాయిల చెల్లింపు కనీసం రూ.50 వేలకంటే తక్కువగా ఉండదు. చెప్పలేం రూ.1 లక్ష కూడా దాటవచ్చు. వేతన బకాయిలు చెల్లించేందుకు మేనేజ్ మెంట్ వేగంగా స్పందిస్తున్న విధానం ఆసక్తికరంగా ఉంది. అయితే వేతన సవరణలకు సంబంధించిన చర్చలు మాత్రం నెమ్మదిగా కొనసాగుతున్నాయి. అంగీకారం కుదరకముందే బకాయిలు చెల్లించడం ద్వారా యూనియన్లను ప్రభుత్వం బలహీనం చేస్తోంది. యూని యన్లు, మేనేజ్‌మెంట్ మధ్య ఒప్పందం కుదిరిన తర్వాతే బకాయిలు చెల్లిస్తారు. కానీ అలా జరగడం లేదు. ఇటీవలే జరిగిన రౌండ్ చర్చల్లో 12 శాతం వేతనం పెంపునకు మేనేజ్‌మెంట్ ఆఫర్ ఇచ్చింది. అంటే పెంపు శాతం 12 శాతానికి తగ్గదని అర్థమవుతోంది. వేతన బకాయిలను లెక్కించాలని ఉద్యోగులు నిర్ణయించారని ఆయన వివరించారు. యూనియన్ల పాత్రను గుర్తిస్తూ ఈ మేరకు బకాయిలు చెల్లించేందుకు సిద్ధమయ్యామని యూఎఫ్‌బీయూ పేర్కొంది. వేతనాల పెంపు విషయంలో బేరమాడే హక్కు యూనియన్లకు ఉందని లేఖలో పేర్కొంది.

## బంధాలను బలోపేతం చేసే దిశగా..
# మోడీ, షేక్ హసీనా భేటీ

- ద్వైపాక్షిక బంధాల ఉన్నతే లక్ష్యంగా చర్చలు
- బంగ్లా ప్రధానితో చర్చలు
- బంధాలకు బలం: మోడీ
- హసీనాతో జైశంకర్ చర్చలు



**న్యూఢిల్లీ:** నాలుగు రోజుల భారత పర్యటనలో ఉన్న బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాతో ప్రధాని నరేంద్రమోడీ శనివారం భేటీ అయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక బంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఇరువురూ చర్చలు జరిపారు. ఇరువురి మధ్య జరిగిన చర్చలు ద్వైపాక్షిక బంధాలకు నూతన బలాన్నిస్తాయని ప్రధాని మోడీ అభిలాషించారు. పొరుగుదేశాల స్నేహపూర్వక పరస్పర మద్దతు అంశంలో ఇరుదేశాలు ప్రపంచానికి అద్భుతమైన ఉదాహరణ అని మోడీ కొనియాడారు. భారత్, బంగ్లాల మధ్య ధృఢమైన ద్వైపాక్షిక బంధాలపై ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు షేక్ హసీనాతో చర్చల అనంతరం ప్రధాని మోడీ ట్విట్టర్ వేదికగా స్పందించారు. భారత పర్యటనలో ఉన్న షేక్ హసినా వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించిన ఇండియా ఎకనామిక్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. అస్సాంలో ఎన్ఆర్‌సీ అమలు విషయంలో ఎలాంటి ఇబ్బందులులేవని గురువారం ఆమె వ్యాఖ్యానించారు. ఇదిలావుండగా ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగిన ప్రత్యేక సమావేశాల్లో పది రోజుల క్రితమే మోడీ, హసీనా సమావేశమైన విషయం తెలిసిందే.

### 7 ఒప్పందాలపై సంతకం

పోర్ట్‌ల వినియోగం, నీటి వినియోగం, విద్యా, సంస్కృతి, తీర భద్రతకు సంబంధించిన అంశాలపై ఇరుదేశాల మధ్య మొత్తం ఏడు ఒప్పందాలు కుది రాయి. ఈ మేరకు ఒప్పందాలపై ఇరుదేశాల ప్రధానులు మోడీ, షేక్ హసీనా సంతకాలు చేశారు. ఉమ్మడి నదుల నీటి వినియోగం, పెట్టుబడులు, నదులపై ఈ ఒప్పందాలు కుదిరాయి. బంగ్లా నుంచి ఈశాన్య భారతానికి భారీ మొత్తంలో ఎల్‌పీజీ దిగుమతి, ఖుల్నాలో నైపుణ్యాభివృద్ధి, 100 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించే విధంగా ఢాకాలోని రామకృష్ణ మఠంలో వివేకానంద భవన్ ప్రాజెక్టులను ఇరువురూ వీడియో లింక్ ద్వారా ప్రారంభించారు.

### ద్వైపాక్షికం ఉన్నతస్థాయికి: జైశంకర్

ప్రధాని మోడీతో సమావేశానికి ముందే షేక్ హసీనాతో విదేశాంగ మంత్రి జైశంకర్ శనివారం ఉదయం సమావేశమయ్యారు. బంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా బంగ్లాదేశ్ ప్రధానితో చర్చలు జరిపా ను. బంగ్లాదేశ్‌తో బంధాల విషయంలో భారత్‌కే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఆమె తెలిపారు అని జైశంకర్ ట్వీట్ చేశారు. మరోవైపు విదేశాంగశాఖ ప్రతినిధి రవీష్ కుమార్ కూడా స్పందించారు. బలమైన బంధాలకు సంకేతంగా షేక్ హసీనాకు ప్రధాని మోడీ ఘనస్వాగతం పలికారు. 10 రోజుల్లోనే ఇరువురూ రెండోసారి సమావేశమయ్యారని ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు.



## డబ్బుంటేనే రండి

- ట్రంప్ కొత్త నిబంధన
- మెడికల్ ఖర్చులు భరించాలి...
- లేదా హెల్త్ ఇన్సూరెన్స్ ఉండాలి
- కుటుంబ ఆధారిత వలన వీసా జారీకి నియమాలు
- వేలాది మంది భారతీయులపై ప్రభావం



**న్యూఢిల్లీ:** కుటుంబ ఆధారిత ఇమ్మిగ్రెంట్ వీసా పొంది కలల సౌధం అగ్రరాజ్యం అమెరికాలో నివాసముండాలని కలలుకంటున్న విదేశీయులకు ట్రంప్ సర్కార్ కొత్త నిబంధన విధించింది. హెల్త్ ఇన్సూరెన్స్ లేదా మెడికల్ వ్యయాలను భరించగలిగే ఆర్థిక స్థోమత ఉందని నిరూపించినవారికే దరఖాస్తుదారులకు మాత్రమే యూఎస్ వీసాలు దక్కుతా యి. ఈ శుక్రవారమే ప్రకటించిన ఈ నిబంధన నవంబర్ 3 నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు ట్రంప్ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఇమ్మిగ్రెంట్ల ఆరోగ్యానికి సంబంధించిన ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా ట్రంప్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. బంధువుల పోషణ(స్పాన్సర్) సూచించి అమెరికా వెళ్లాలనుకునేవారిపైనే ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇప్పటివకే హెచ్-1బీ వీసా ద్వారా అమెరికాలో నివసిస్తు న్నవారు పోషణ ద్వారా వెళ్తే పెద్దగా ప్రభావం ఉండదని విశ్లేషకులు చెబుతున్నారు. కొత్తనిబంధన ప్రకారం అమెరికాలో అడుగుపెట్టిన 30 రోజుల్లోనే హెల్త్ ఇన్సూరెన్స్ పరిధిలోకి వస్తామని లేదా మెడికల్ బిల్లులు భరించగలిగే ఆర్థిక స్థోమత ఉందని నిరూపించుకోవాలి.

### 23 వేల మంది భారతీయులపై ప్రభావం

ఈ కొత్త నిబంధనపై ఒబామా ప్రభుత్వంలో వైట్‌హౌస్ ఇమ్మిగ్రేషన్ అధికారిగా పనిచేసిన డౌగ్ రాండ్ మాట్లాడారు. ఈ కొత్త నిబంధన కారణంగా మొత్తం 23 వేల మంది భారతీ యులు ప్రభావితమయ్యే అవకాశాలున్నాయన్నారు. వీసా దక్కదని ఖచ్చితంగా చెప్పలేం. కానీ ప్రభావితమవుతారని ఆయన అంచనావేశారు. ప్రతిఏడాది దాదాపు 35 వేలకుపైగా ఫ్యామిలీ స్పాన్సర్డ్ ఇమ్మిగ్రెంట్లు అమెరికా వస్తున్నారు. వారిలో మూడోవంతు మంది గ్రీన్‌కార్డ్‌కు దరఖాస్తు చేసుకుని అమెరికాలోనే స్థిరపడ్డారని ఆయన వివరించారు.

# 'మహా' ప్రచారం షురూ..!

- మరాఠీ గడ్డకు అతిరథ మహారథులు
- మరో 14 రోజులు హోరా-హోరీ ప్రచారం

**ముంబై:** మహారాష్ట్ర ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగియడంతో అన్ని పార్టీలు ప్రచారంపై దృష్టి పెడుతున్నాయి. ఆదివారం నుంచి ప్రచారానికి ఇంకా 14 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీ నేతలందరూ తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తాం..? ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించడం తప్ప మరేదీ ఇక్కడ వినడానికి దొరకదు. అన్నీ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా 40 హామీలు ఓటర్ల ముందుకు తీసుకొచ్చాయి. ప్రతీ పార్టీ నుంచి స్టార్ క్యాంపెయినర్‌లు రంగంలోకి దిగి తమ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, జేపీ నడ్డాతో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో బీజేపీ-శివసేన కూటమి ముందుకు వెళ్తోంది. వీరితో పాటు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, ప్రకాష్ జవదేకర్, స్మృతి ఇరానీ, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, పురుషోత్తం కె.రూపాలా, రావ్ సాహెబ్ పాటిల్ దన్వే, జి కిషన్‌రెడ్డిలు బీజేపీ గెలుపు బాధ్యతలను తమ భుజాలపై వేసుకున్నారు.

### 'మహ' బాట పట్టిన బీజేపీ సీఎంలు

మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తో పాటు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, విజయ్ రూపానీ, డిప్యూటీ సీఎం లక్ష్మణ్ సావడీ (కర్నాటక), కేశవ్‌ప్రసాద్ మౌర్య (ఉత్తర్‌ప్రదేశ్‌)లు కూడా రంగంలోకి దిగుతున్నారు. వీరితో పాటు వసుంధరరాజే సింధియా, వి.సతీష్, సరోజ్ పాండే, భుపేంద్ర యాదవ్‌లు కూడా ప్రచారంలో పాల్గొననున్నారు. మహారాష్ట్ర నేతల బాధ్యతలు బీజేపీ చీఫ్ చంద్రకాంత్ పాటిల్ తీసుకున్నా రు. అసంతృప్తులు ఏక్‌నాథ్ ఖాడ్సే, వినోద్ తావ్డేల సాయంతో క్యాంపెయిన్ ఆర్మీని ఏర్పాటు చేశారు.

### కాంగ్రెస్ నుంచి మన్మోహన్, సోనియా, రాహుల్

కాంగ్రెస్ పార్టీ కూడా గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తోంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, పార్టీ చీఫ్ సోనియా, మాజీ చీఫ్ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, శత్రఘ్న సిన్హా, మల్లికార్జున్ ఖర్గే, గులాం నబీ ఆజాద్‌లు మహా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. వీరితో పాటు మాజీ కేంద్ర మంత్రులు, తాజా, మాజీ సీఎంలు కమల్‌నాథ్, ముకుల్ వాస్నిక్, సుశీల్ కుమార్ షిండే, అశోక్ చవాన్, పృథ్వీరాజ్ చవాన్, అశోక్ గెహ్లాట్‌లు కూడా భాగస్వాములు అవుతారు. వీరికి మహా కాంగ్రెస్ చీఫ్ బాలా సాహెబ్ థోరట్, జ్యోతిరాదిత్య సింధియా, సచిన్ పైలెట్, మాజీ నటి నగ్మా, విజయ్, నానా పటేల్, నితిన్ రౌత్, మాణిక్‌రావు, సాహిన్ సావంత్, హుస్సేన్, నసీం ఖాన్‌లు సహకారం అందిస్తారు.

### అన్నీ తానై నడిపిస్తున్న ఉద్ధవ్

శివసేన ఇప్పటి వరకు స్టార్ క్యాంపెయినర్‌లను అధికారికంగా ప్రకటించలేదు. అయితే పార్టీ ప్రచార బాధ్యతలు మొత్తం పార్టీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేపై పడుతాయని తెలుస్తోంది. ఆయన కుమారుడు ఆదిత్య, సీనియర్ నేతలు సుభాష్ దేశాయ్, దివాకర్ రౌటే, రాందాస్ కదం, కిశోర్ తివారీ, ప్రియాంక చతుర్వేది, సంజయ్ దినా పాటిల్‌తో పాటు ఇతరులు శివసేన తరఫున ప్రచారం చేసే అవకాశం ఉంది. మరోవైపు ఎంఎన్ఎస్ స్టార్ క్యాంపెయినర్‌గా రాజ్ ఠాక్రే కష్టపడనున్నారు. ఆయనకు రాజ్ ఠాక్రే, శాలినీ ఠాక్రే, బాల నంద్‌గాంకర్, సందీప్ దేశ్‌పాండే, నితిన్ సర్‌దేశాయ్‌తో పాటు యశ్వంత్ కిల్లేదర్‌లు తోడుగా ఉండనున్నారు.

### 'సేన'లో బుజ్జగింపులు..!

శివసేన నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ వారిని బుజ్జగించే పనిలో స్వయంగా ఆ పార్టీ చీఫ్ ఉద్ధవ్‌ఠాక్రే దిగినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన ఓబీసీతో పాటు ఇతర వర్గాల నేతలను ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. అనంతరం రెబల్స్‌ను కూడా కలిసి పదవులపై హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. వెనుకబడిన వర్గాలతో పాటు సంచార జాతుల ప్రతినిధులు ఉద్ధవ్ ఠాక్రేను సబర్బన్ బాంద్రాలోని ఆడిటోరియంలో కలుసుకున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలని వారు ఠాక్రేను కోరారు. తమ ఏదీ ఆశించడం లేదని, ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరడంతో.. ఠాక్రే స్పందిస్తూ.. అన్ని వర్గాల ప్రతినిధులకు తప్పకుండా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. టికెట్ రాలేదని నిరాశ చెందకుండా వారి వారి వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఒక వేళ ప్రభుత్వంకూడా ఆదుకోని పక్షంలో శివసేన వారికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. సమాజంలో నివసించే ప్రతీ ఒక్కరికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, వాటిని క్లియర్ చేసేందుకు ప్రభుత్వాన్ని కోరుతా అని తెలిపారు.



### ఫడ్నవిస్ చేతిలో రూ. 17,500



మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తన ఆస్తులు రూ.3.86 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. నాగ్‌పూర్ సౌత్ వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఫడ్నవిస్ పోటీ చేస్తున్నారు. చరాస్తుల విలువ రూ.3.78 కోట్లుగా వివరించారు. 2014లో వీటి విలువ రూ.1.81 కోట్లుగా ఉండింది. ఐదేళ్ల కాలంలో మార్కెట్‌లో భూమి విలువ పెరగడంతో పాటు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఈ పెరుగుదల కనిపించింది. చేతిలో రూ.17,500 నగదు మాత్రమే ఉన్నట్టు పేర్కొన్నారు. బ్యాంకులో 2014లో రూ.1,19,630 ఉండ గా.. తాజాగా సమర్పించిన అఫిడవిట్‌లో రూ.8,29,665గా తేలింది. నెలవారీ వేతనం, అలవెన్సులు కలపడంతోనే బ్యాంకు బ్యాలెన్స్ పెరిగినట్టు తెలుస్తోంది. ఆయన భార్య అమృత ఫడ్నవిస్‌కు 2014లో 42.60 లక్షల స్థిరాస్తి ఉండగా.. తాజాగా సమర్పించిన అఫిడవిట్లో రూ.99.3 లక్షలుగా పేర్కొన్నారు. 2014లో ఉన్న రూ.1.66 కోట్ల షేర్ల విలువ ఇప్పుడు రూ.2.33 కోట్లకు పెరిగింది. అమృత ఫడ్నవిస్ చేతిలో కూడా రూ.12,500 నగదు మాత్రమే ఉంది. బ్యాంకులో 2014లో రూ.1,00,881 ఉండగా ఇప్పుడు రూ.3,37,025 నమోదైంది.

## ఆ... నలుగురు..!

- సీనియర్లకు టిక్కెట్లు నిరాకరించిన బీజేపీ

**ముంబై:** బీజేపీ సీనియర్ నేతలు వినోద్ తావ్డే, ఏక్‌నాథ్ ఖడ్సే, ప్రకాష్ మెహతాతో పాటు రాజ్ పురోహిత్‌లకు పార్టీ టికెట్ ఇవ్వడాన్ని నిరాకరించింది. ఈ నేపథ్యంలో 1990 కాలంలో ప్రమోద్ మహజన్-గోపినాథ్ ముండే నాటి పరిస్థితులను బీజేపీ పునరావృతం చేసిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 1995లో శివ సేనతో కలిసి బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమయంలో తావ్డే, ఖడ్సేలు కమలం పార్టీలోకి వచ్చారు. గుజరాతీ సమాజంపై విజయం సాధించడానికి మనోహర్ జోషి పాలనలో మెహతా పార్టీలోకి వచ్చారు. ఆయనతో పాటు పురోహిత్ కూడా కమలం తీర్థం పుచ్చుకున్నారు. నగరంలోని వ్యాపారులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కిరిత్ సోమయ్య కీలక పాత్ర పోషించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ముంబై నార్త్-ఈస్ట్ నియోజకవర్గం నుంచి సోమయ్యకు ఇచ్చేందుకు పార్టీ నిరాకరించింది.

### కీలకంగా వ్యవహరించిన ఖడ్సే, తావ్డే

1999లో ఎన్నికల్లో బీజేపీ, శివసేన ఓటమి పాలైన సమయంలో ఖడ్సే, తావ్డేలు ముండేతో కలిసి పకడ్బందీ వ్యూహంతో కాంగ్రెస్, ఎన్సీపీ కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారు. 1990 కాలంలో బీజేపీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేసినట్టు మాజీ ఎమ్మెల్యే ఏక్‌నాథ్ ఖడ్సే చెప్పుకొచ్చారు. కీలక నేతలకు అధిష్టానం టికెట్లు కేటాయించకపోవడంపై సీఎం ఫడ్నవిస్ కూడా తీవ్ర ఇబ్బందికి గురవుతున్నట్టు సన్నిహిత వర్గాలు తెలిపాయి. టికెట్ల విషయంలో సీఎం ఫడ్నవిస్.. కేంద్ర పార్లమెంటరీ బోర్డును ఒప్పించడానికి చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. తావ్డే దూకుడు తనం, వ్యవహార శైలి, టార్డియో స్లమ్ ప్రాజెక్టు విషయంలో మెహతాపై వచ్చిన అవినీతి ఆరోపణలు టికెట్ రాకుండా చేశాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తావ్డే మనస్తత్వం, ఆయన చేసిన పనులు పార్టీ పెద్దలకు నచ్చలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. తావ్డే దూకుడును తగ్గించేందుకు ఫడ్నవిస్.. ఓ సీనియర్ బీజేపీని మంత్రికి బాధ్యతలు అప్పగించారు. అయినా కూడా ఆ అమాత్యుడి మాటలు లెక్కజేయకుండా... ఆయన చేసిన హెచ్చరికలను కూడా చాలా లైట్‌గా తీసుకున్నట్టు విమర్శలు ఉన్నాయి. టార్డియో స్లమ్ ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు అవినీతికి పాల్పడినట్టు మెహతాపై ఆరోపణలు రావడంతో టికెట్ దక్కలేదని తెలుస్తోంది. ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన అవినీతి పరులకు టికెట్లు దక్కినట్టు తెలుస్తోంది.

## ఢిల్లీకి సీఎం పెద్ద బాధ్యత..!



**న్యూఢిల్లీ:** ఢిల్లీకి సీఎంగా బాధ్యతలు అప్పగించినా.. ఎంతో ధైర్యంగా నిర్వర్తిస్తారని, వెనకడుగు వేయబోనని ఢిల్లీ తూర్పు నియోజకవ ర్గ ఎంపీ, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ అన్నారు. యూపీ సీఎంగా ఉన్న యోగీ ఆదిత్యనాథ్ ఒకప్పుడు ఎంపీగా ఉన్నారని, తరువాత ఆయన ముఖ్యమంత్రి అయ్యారని, అలాంటి పరిస్థితే మీకు ఢిల్లీ విషయంలో వస్తే.. ఎలా స్పందిస్తారని ప్రశ్నించగా.. ఎంతో గౌరవంగా భావిస్తానని, అదో పెద్ద బాధ్యత అని, దీంతో తన కల పూర్తిగా నెరవేరినట్టు అవుతుందని గంభీర్ చెప్పుకొచ్చారు. తన తూర్పు ఢిల్లీలోని ఘాజీపూర్‌లోని ల్యాండ్ ఫిల్‌లో చెత్తపై సమరం చేస్తున్నారు. బీజేపీ నాయకులతో కలిసి బాలిస్టిక్ సెపరేటర్‌ను ప్రారంభించారు. బాలిస్టిక్ సెపరేటర్ అనే మెషిన్ చెత్తను మూడు భాగాలుగా డివైడ్ చేస్తుంది. ఇది వరుసగా.. రాళ్లు, గాజు, ప్లాస్టిక్, రెండు రకాల మట్టిని విడదీస్తుంది. సీఎం బాధ్యతల విషయంలో ఎలాంటి ఇబ్బంది పడబోనని స్పష్టం చేశారు. దేశంలో పని చేస్తున్నా అనే భావన మాత్రమే తనలో ఉంటుందన్నారు. ఇప్పటికే తూర్పు ఢిల్లీలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు శ్రమిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన వాగ్దానాలపై కూడా విమర్శించారు. అసలు చేయలేని వాటిని చేస్తామని హామీ ఇవ్వడం సరికాదన్నారు. ఢిల్లీలో ఎన్ఆర్‌సీ ఎప్పుడు అమలు చేసినా.. అది బీజేపీ ఆధ్వర్యంలోనే చేయాలని, దేశానికి ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్.. అక్కడి సైన్యం చేతిలో కీలుబొమ్మ అని చెప్పుకొచ్చారు.

## వారసత్వ రాజకీయాలు వద్దు..!

- కర్ణాటక వైఫల్యంపై కాంగ్రెస్ అధిష్టానానికి నివేదిక

**బెంగళూరు:** లోక్‌సభ ఎన్నికల్లో కర్నాటకలో కాంగ్రెస్ పార్టీకి ఘోర పరాజయం మూటగట్టుకుంది. దీనికి కారణాలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ అధిష్టానం నిజనిర్ధారణ కమిటీ రిపోర్టులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారసత్వ రాజకీయాలే కర్నాటక లోక్‌సభ ఎన్నికల్లో హస్తం పార్టీ ఘోరంగా విఫలం కావడానికి కారణమని కమిటీ వివరించింది. మహారాష్ట్ర ఎన్నికల జరుగుతున్న కీలకసమయంలో ఈ నివేదికనుంచి పార్టీ గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కర్నాటకలో లోక్‌సభ ఎన్నికల్లో 28 స్థానాల్లో కాంగ్రెస్ కేవలం ఒకే స్థానంలో గెలుపొందింది. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇలాంటి ఫలితాలే వచ్చాయి. వచ్చే నెలలో కర్నాటకలో జరిగే అసెంబ్లీ ఉప ఎన్నికల్లో అయినా పార్టీ వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉండాలని. మహారాష్ట్ర, హర్యా నాలో జాగ్రత్త పడాలని కమిటీ సూచించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో చాలా మంది అభ్యర్థులు పార్టీ మాజీ, సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎంపీల కుమారుడు, కుమార్తెలు ఉన్న విషయం తెలిసిందే.

## హర్యానాలో కాంగ్రెస్‌కు షాక్

- మాజీ పీసీసీ అధ్యక్షుడి రాజీనామా

**చండీగఢ్:** హర్యానాలో కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. వరుస ఓటములు.. అంతర్గత కలహాలతో తికమకపడుతున్న కాంగ్రెస్ పార్టీకి అశోక్ తన్వార్ రూపంలో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ మాజీ పీసీసీ అధ్యక్షుడు, సీనియర్ నేత అశోక్ తన్వర్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. రెండు రోజుల క్రితమే పీసీసీ పదవి నుంచి వైదొలిగిన అశోక్.. తాజా పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం పార్టీ అధ్యక్షురాలు సోనియాకు నాలుగు పేజీల సుదీర్ఘ లేఖను రాశారు. టికెట్ల కేటాయింపులో తీవ్ర అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు చేశారు. పార్టీలోని అంతర్గత కలహాల కారణంగా.. సిద్ధాంతాలు పూర్తిగా దారి తప్పాయని, గ్రూపు రాజకీయాలతో పార్టీ పూర్తిగా పతనం అవుతుందని లేఖలో పేర్కొన్నారు. ప్రతిపక్షాలతో కాకుండా సొంత పార్టీ నేతలతోనే కాంగ్రెస్ పరిస్థితి దిగజారిందని తెలిపారు. తాను ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించడం లేదని, పార్టీ సిస్టంపై చేస్తున్నట్టు తెలిపారు. నేతలు, కార్యకర్తలతో సుదీర్ఘంగా చర్చించిన తరువాతే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు.

## అధికారుల స్థయిర్యాన్ని దెబ్బతీయొద్దు

**న్యూఢిల్లీ:** ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన నలుగురు మాజీ అధికారులను విచారించడం పట్ల 71 మంది మాజీ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ప్రధాని మోడీకి లేఖ రాశారు. ఇటువంటి చర్య నిబద్ధత, నిజాయితీ అధికారులను కీలక నిర్ణయాలు తీసుకోకుండా నిరోధిస్తుందని చెప్పారు. మాజీ క్యాబినెట్ కార్యదర్శి కె ఎం చంద్రశేఖర్, మాజీ విదేశాంగ కార్యదర్శి, జాతీయ భద్రతా సలహాదారు శివశంకర్ మీనన్, మాజీ విదేశాంగ కార్యదర్శి సుజాత సింగ్, పంజాబ్ మాజీ డీజీపీ జూలియో రిబెరియో తదితరులు ఈ లేఖపై సంతకం చేశారు. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం, మాజీ బ్యూరోక్రాట్లు, అధికారులను టార్గెట్ చేయడంపై వారు ఆందోళన వ్యక్తంచేశారు. ఐఎన్ఎక్స్ మీడియాకు ఎఫ్ఐపిబి క్లియరెన్స్‌కు సంబంధించి నీతి ఆయోగ్ మాజీ సీఈఓ సింధుశ్రీ ఖుల్లర్‌తోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి, ఆర్థిక మంత్రిత్వ శాఖలో అప్పటి డైరెక్టర్ అనుప్ కె పుజారీ, ఆర్థిక వ్యవహారాల శాఖ మాజీ అండర్ సెక్రటరీ రవీంద్ర ప్రసాద్‌పై విచారణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రాజకీయ నేరారోపణల తీవ్రతను జఠిలం చేసేలా అధికారులను ఇబ్బందిపెట్టడంపై వారు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ చర్యలు అధికారిక విధుల నిర్వహణలో సత్ప్రవర్తనకు భరోసా ఇవ్వకపోగా, లేనిపోని భయాలకు గురిచేస్తున్నాయని వాపోయారు. నిజాయితీగల అధికారులు ఆనాటి ప్రభుత్వ విధాన నిర్ణయాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారే తప్ప, ఉద్దేశపూర్వకంగా తప్పు చేయరని, ఇలాంటి వ్యక్తులకు శిక్షలకు గురిచేస్తే, నిబద్ధత గలిగిన అధికారుల సంఖ్య తగ్గిపోతుందన్నారు.

## ఆర్మీ పర్వతారోహణ కవాతు



**న్యూఢిల్లీ:** త్వరలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ నేపథ్యంలో, భారత సైన్యం అరుణాచల్ ప్రదేశ్‌లో అతిపెద్ద పర్వతారోహణకు సిద్ధమైంది. దక్షిణ టిబెట్‌లో అంతర్భాగమైన అరుణాచల్ ప్రదేశ్‌లో అధికభాగం తమదేననంటూ చైనా వాదిస్తున్న నేపథ్యంలో ఆర్మీ టెక్కింగ్ ఈవెంట్‌కు ప్రాధాన్యత సంతరించుకుంది. 'హిమ్ విజయ్' పేరుతో త్రివిధ దళాలు డ్రిల్ చేపట్టనున్నాయి. ఒక్కో దళం నుంచి 4000 మంది సైనికులు ఇందులో పాల్గొంటున్నారు. వాస్తవాధీన రేఖకు 100 కిమీ దూరంలో, సముద్ర మట్టానికి 14,000 అడుగుల ఎత్తులో ఈ విన్యాసం చేపడుతున్నారు. తవాంగ్ సమీపంలోని అరుణాచల్ ఎగువ ప్రాంతాలలో దశలవారీగా జరిగే ఈ డ్రిల్, అక్టోబర్ 25న ముగుస్తుంది. పర్వతారోహణ విన్యాసాల్లో కొత్తగా అవతరించిన అంతర్గత యుద్ధ బృందాల (ఐబీజీ) సామర్థ్యాన్ని పరీక్షిస్తారు. 'హిమ్ విజయ్'లో దళాల సమీకరణ, పర్వతాలపైనుంచి దాడులు, వైమానిక దాడుల కసరత్తు ఉంటుంది. ఫిబ్రవరిలో ఇక్కడ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభానికి మోడీ వెళ్లినప్పుడు చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో సైనిక పర్వతారోహణ కవాతుపై ఆసక్తి నెలకొంది.

## అభిశంసనపై ట్రంప్ నిర్వేదం

- ప్రతినిధుల సభలో డెమొక్రాట్ల ఆధిక్యం దురదృష్టకరం
- ఐనా సెనేట్లో అధిగమిస్తామని ధీమా

**వాషింగ్టన్:** అభిశంసన ప్రక్రియపై డొనాల్డ్ ట్రంప్ ప్రతిపక్షంపై అసహనం వ్యక్తంచేశారు. చివరకు గెలుపు తమదేనని ధీమా వ్యక్తంచేశారు. దురదృష్టవశాత్తు డెమొక్రాట్లకు ప్రతినిధుల సభలో ఎక్కువ ఓట్లున్నాయి. అభిశంసనకు వీలుగా ఓటేశారు. వారిలో చాలా మందికి దీనిపై విశ్వాసం లేదు కూడా అని ట్రంప్ మీడియా ఎదుట వ్యాఖ్యానించారు. రిపబ్లికన్ పార్టీలో నాకు 95 శాతం మద్దతు ఉంది. రిపబ్లికన్లు ఐక్యంగా ఉన్నారు. ఈ అంశాన్ని సెనేట్‌కు తీసుకెళ్తాం. అక్కడ మేమే గెలుస్తాం అని ట్రంప్ పేర్కొన్నారు. ఇదిలావుండగా, తన రాజకీయ ప్రత్యర్థి జో బిడెన్‌పై ఉక్రెయిన్ దర్యాప్తునకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని అమెరికా దౌత్యవేత్తలు బహిర్గతం చేశారు. ఈ మేరకు కొన్ని సందేశాలను విడుదల చేశారు. ఇవి డెమొక్రాట్ల అభిశంసన తీర్మానాన్ని బలపరిచేలా ఉన్నాయి. దర్యాప్తునకు తాను సహకరించనని ట్రంప్ సూచించినట్లు ఈ సందేశాల్లో వెల్లడైంది. ప్రతినిధుల సభలో డెమొక్రాట్లు ఇంటెలిజెన్స్ అధికారిని ఇంటర్వ్యూ చేయడం ప్రారంభించడంతో దర్యాప్తు తెరపైకి వచ్చింది.

### ఉక్రెయిన్‌పై ట్రంప్ ఒత్తిడి

పుట్టగొడుగుల కుంభకోణానికి సంబంధించి తన రాజకీయ ప్రత్యర్థి బిడెన్‌పై విచారణ జరిపించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడైమిర్ జెలెన్సీ మీద ట్రంప్ ఒత్తిడి తెచ్చారన్న అభియోగాలు ఉన్నాయి. ఇందుకు ప్రతిగా 400 మిలియన్ డాలర్ల సైనిక సాయం అందిస్తానని చెప్పినట్లు విమర్శలు ఎదుర్కొంటున్నారు. ట్రంప్ మాత్రం ఇందులో క్విడ్ ప్రో కో లేదని పదేపదే ఖండించారు. ఐరోపాలోని ముగ్గురు అమెరికా దౌత్యవేత్తలు, ట్రంప్ వ్యక్తిగత న్యాయవాది రూడీ గియులియాని మధ్య జరిగి వరుస సంభాషణలను హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీ విడుదల చేసింది.

ఈ సందేశాలు ట్రంప్ వాదనను బలహీనం చేసేలావున్నాయి. అమెరికా దౌత్యవేత్తలు, గియులియాని సహాయం అందించడం, ట్రంప్-జెలెన్స్కీల భేటీలో బిడెన్‌పై అవినీతి దర్యాప్తును ప్రారంభించడానికి ఉక్రెయిన్ అంగీకరించినట్లు ఈ సందేశాలు రూఢీ చేస్తున్నాయి. ఉక్రెయిన్, బిడెన్ పట్ల ట్రంప్ ప్రవర్తన గురించి విజిల్‌బ్లోయర్ ఫిర్యాదు అభిశంసన విచారణకు కీలకంగా మారింది. వచ్చే వారం ఉక్రెయిన్ మాజీ అమెరికా రాయబారి మేరీ యోవనోవిచ్‌ను ఇంటర్వ్యూ చేయాలనికూడా వారు యోచిస్తున్నారు.



## మహిళల 400 మీ. హర్డిల్స్‌లో

# ప్రపంచ రికార్డు

### ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

**దోహా :** ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మహిళల 400మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు బద్దలైంది. అమెరికా క్రీడాకారిణి దలీలా మహ్మద్ తన రికార్డును తానే అధిగమించింది. ఉత్కంఠగా జరిగిన ఫైనల్లో దలీలా 52.16 సెకండ్లలో గమ్యాన్ని చేరగా, ఆమెకు గట్టి పోటీ ఇచ్చిన సిడ్నీ మెక్లాగ్లిన్(అమెరికా) 52.23 సెకండ్లతో రజతంతో సరిపెట్టుకుంది. 29 ఏళ్ల ఒలింపిక్ చాంపియన్ దలీలా 2003లో రష్యా క్రీడాకారిణి యులియా పెంచోంకిన నెలకొల్పిన 52.34 సెంకడ్ల రికార్డును తిరగరాసింది. జమైకాకు చెందిన రిస్తానన ట్రేసీ 53.74 సెకండ్లతో కాంస్యం గెలుచుకుంది.





పురుషుల హైజంప్ ఫైనల్స్ సందర్భంగా మొదటిసారి స్టేడియం తొలిసారి ప్రేక్షకులతో కళకళలాడింది. ఇందుకు కారణం స్థానిక ఆటగాడు ఫేవరెట్‌గా బరిలోకి దిగడమే. కతార్‌కు చెందిన గత టోర్నీ చాంపియన్ ముతాజ్ ఎస్సా బర్షిం 2.37మీ.ను అధిగమించి స్వర్ణాన్ని సొంతం చేసుకుని టైటిల్‌ను నిలబెట్టు కున్నాడు. 2017లో అథ్లెట్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైన బర్షిం తొలి ప్రయత్నం లోనే 2.37మీ. ఎత్తును అధిగమించాడు. రజత, కాంస్య పతకాలు తటస్థ అథ్లెట్లుగా బరిలోకి దిగిన రష్యా ఆటగాళ్లు మిఖైల అకిమెంకొ(2.35మీ.), ఇల్యా ఇవాన్యుక్ (2.35మీ.)లకు దక్కాయి. మహిళల డిస్కస్‌లో స్వర్ణ, రజత పతకాలు క్యూబా వశమయ్యాయి. యైమి పెరెజ్ 69.17మీ., డెనియా కాబల్లెరొ 68.44మీ.తో తొలి రెండు స్థానాలలో నిలిచారు. క్రొయేషియాకు చెందిన శాండ్రా పెర్కోవిక్ 66.72మీ.తో కాంస్యం అందుకుంది.

పురుషుల 400మీ. పరుగును బహమాస్‌కు చెందిన స్టీవెన్ గార్డినర్ గెలుచుకున్నాడు. గార్డినర్ 43.48 సెకండ్లతో జాతీయ రికార్డును నెలకొల్పుతూ స్వర్ణాన్ని దక్కించుకున్నాడు. కొలంబియాకు చెందిన పాన్ అమెరికన్ చాంపియన్ ఆంటోనీ జోస్ జంబ్రానొ తన వ్యక్తిగత రికార్డును మెరుగుపరచుకుంటూ 44.15 సెకండ్లతో రజతం సొంతం చేసుకున్నాడు. అమెరికాకు చెందిన ఫ్రెడ్ కెర్లీ 44.17 సెకండ్లతో కాంస్యంకు పరిమితమయ్యాడు.

పురుషుల 20కి.మీ. నడక పోటీలో జపాన్‌కు చెందిన జపాన్‌కు చెందిన తొషికజు యమనిషి 1గం. 26.34ని.లలో గమ్యాన్ని చేరి విజేతగా నిలిచాడు. తటస్థ అథ్లెట్(రష్యా) వాసిలి మిజినొవ్ 1గం.26.49ని.లతో రజతం, స్వీడన్‌కు చెందిన పెర్సియస్ కార్ల్‌స్టార్మ్ 1గం.27ని.లతో కాంస్యం దక్కించుకున్నారు.

#### శివపాల్ వైఫల్యం

పురుషుల జావెలిన్‌లో భారత అథ్లెట్ శివపాల్ సింగ్ ఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో శివపాల్ 78.97మీ. దూరం విసిరి తన గ్రూపులో పదో స్థానంలో ఓవరాల్‌గా 24వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకోలేకపోయాడు. శనివారం జరిగిన 4-400 మీటర్ల రిలే పోటీలలో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయాయి. పురుషుల జట్టు 3ని.3.09 సెకండ్లతో హీట్స్‌లో 7వ స్థానంలో, ఓవరాల్‌గా 13వ స్థానంలో నిలవగా, మహిళల జట్టు 3ని.29.42 సెకండ్లతో హీట్స్‌లో 6వ స్థానంలో, ఓవరాల్‌గా 11వ స్థానం పొంది పతక రేస్‌నుంచి వైదొలగాయి.

# నీరజ్ ఓటమి

### మహిళా బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్

**న్యూఢిల్లీ :** మహిళా బాక్సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ నీరజ్ పొగట్(57కి.గ్రా.) ఓటమిపాలైంది. తొలి రౌండ్‌లో చైనాకు చెందిన క్వియావొ జీరుతో తలపడిన నీరజ్ తన శాయశక్తులా పోరాడింది. కానీ 2-3 తేడాతో స్వల్ప పాయింట్ల తేడాతో అంపైర్లు చైనా క్రీడాకారిణిని విజేతగా ప్రక టించారు. ఆరంభంలో నీరజ్ ప్రత్య ర్థిపై ఆధిపత్యం ప్రదర్శించింది. చైనా క్రీడాకారిణి నీరజ్‌కు ఏ మాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. అయితే ఆశ్చర్యకరంగా జీరును విజేతగా ప్రకటించారు. నీరజ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొ నడం ఇదే తొలిసారి. ఫలితంపై భారత అధికారులు అభ్యంతరం వ్యక్తంచేసినా ఫలితం లేకపోయింది. సాంకేతిక కమిటీ భారత్ అభ్యంతరాన్ని త్రోసిపుచ్చింది.





## హార్దిక్‌కు

# 4 నెలలు విశ్రాంతి

**న్యూఢిల్లీ :** భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా నాలుగు నెలలపాటు క్రికెట్‌కు దూరం కానున్నాడు. శనివారం లండన్‌లో అతని వెన్ను నొప్పికి విజయవంతంగా చికిత్స నిర్వహించారు. 12-16 వారాలపాటు అతడు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది ఇండిన్ ప్రీమియర్ లీగ్ నాటికి పాండ్యా అందుబాటులోకి రావచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా జట్టుతో జరిగిన టి20 సిరీస్‌లో పాల్గొన్న హార్దిక్ అనంతరం వెన్ను నొప్పి కారణంగా టెస్టు జట్టుకు ఎంపిక కాలేదు. గత సెప్టెంబర్‌లో ఆసియా కప్ సందర్భంగా వెన్ను నొప్పితో బాధపడిన హార్దిక్ అనంతరం కోలుకుని ఐపీఎల్, ప్రపంచకప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇపుడు మరలా వెన్నునొప్పి తిరగబెట్టడంతో శస్త్రచికిత్స అనివార్యమైంది.

## రోహిత్ రికార్డుల మోత

విశాఖ వేదికగా సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ రికార్డుల మోత మోగిస్తున్నాడు. ఇప్పటికే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఎన్నో రికార్డులను బద్దలు కొట్టిన రోహిత్ ఇప్పుడు టెస్టుల్లోనూ తన ప్రతాపం చూపెడుతున్నాడు. ఈ టెస్టులో రోహిత్ సాధించిన కొన్ని రికార్డులను చూద్దాం..

#### అరంగేట్ర మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన ఓపెనర్..

టెస్టుల్లో తొలిసారి ఓపెనింగ్ చేసిన రోహిత్ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. ఓపెనర్‌గా అరంగేట్ర మ్యాచ్‌లోనే అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా రోహిత్ రికార్డుల్లో నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో 176 పరుగులు చేసిన హిట్‌మ్యాన్ రోహిత్ రెండో ఇన్నింగ్స్‌లో 127 పరుగులు సాధించాడు. ఫలితంగా ఓపెనర్‌గా తొలి టెస్టులో అత్యధికంగా 303 పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. అంతకుముందు సౌతాఫ్రికా మాజీ కెప్టెన్ కెప్లర్ వెసెల్స్ (208 పరుగులు) రికార్డును తాజాగా రోహిత్ సవరించాడు.

#### ఆరో భారత బ్యాట్స్‌మెన్‌గా..

ఈ మ్యాచ్‌లో వరుసగా రెండు ఇన్నింగ్స్‌లలో రెండు శతకాలు సాధించిన రోహిత్ శర్మ తన ఖాతాలో మరో రికార్డును వేసుకున్నాడు. భారత్ తరపున ఒకే టెస్టులో రెండు శతకాలు బాదిన ఆరో బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. రోహిత్ కంటే ముందు దిగ్గజ బ్యాట్స్‌మెన్ విజయ్ హజారే, సునీల్ గవాస్కర్ (3 సార్లు) ఒకే టెస్టులో రెండుసార్లు శతకాలు నమోదు చేయగా.. రాహుల్ ద్రవిడ్ (2 సార్లు), విరాట్ కోహ్లీ, రహానేలు ఒక్కొక్కసారి ఈ ఫీట్‌ను అందుకున్నారు.

#### అత్యధిక సిక్సులు..

ఒకే టెస్టులో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాట్స్‌మెన్‌గా కూడా రోహిత్ శర్మ కొత్త రికార్డు సృష్టించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 6 సిక్సర్లు బాదిన రోహిత్ రెండో ఇన్నింగ్స్‌లో 7 సిక్సర్లు కొట్టాడు. దీంతో ఒకే టెస్టులో అత్యధికంగా 13 సిక్సులు బాదిన బ్యాట్స్‌మన్‌గా రికార్డును రోహిత్ సొంతం చేసుకున్నాడు. అంతకుముందు పాకిస్తాన్ ఆటగాడు వసీమ్ అక్రం (12 సిక్సులు) పేరిట ఉన్న రికార్డును తాజాగా రోహిత్ అధిగమించాడు. 1996లో జింబాబ్వేపై అక్రం ఈ రికార్డును సాధించాడు. ఇక భారత్ తరపున 25 ఏళ్ల క్రితం నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ నెలకొల్పిన అత్యధిక సిక్సుల రికార్డు కూడా అధిగమించాడు.

#### 100కు పైగా సగటు..

టెస్టుల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్న టీమిండియా స్టార్ బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ సొంతగడ్డపై 100కు పైగా సగటు సాధించి సంచలనం సృష్టించాడు. ఇప్పటివరకు దిగ్గజ బ్యాట్స్‌మన్ బ్రాడ్‌మన్ పేరిట ఉన్న (98.22) సగటును తాజాగా రోహిత్ దాటేశాడు. భారత్‌లో జరిగిన టెస్టుల్లో రోహిత్ 4 సెంచరీలతో పాటు 6 హాఫ్ సెంచరీలు సాధించాడు.

#### ఆశించని రికార్డు..

ఇక ఈ టెస్టులో ఎన్నో రికార్డు సాధించిన రోహిత్ శర్మ ఒక చెత్త రికార్డును కూడా మూట గట్టుకున్నాడు. రోహిత్ రెండు ఇన్నింగ్స్‌లలో ఒకే తరహాలో ఆవుటయ్యాడు. కేశవ్ మహారాజ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ చేత స్టంప్ అవుట్‌గా వెనుదిరగడంతో ఒక టెస్టులో ఒకే బౌలర్ కు ఒకే తరహాలో వికెట్ సమర్పించుకున్న తొలి భారత బ్యాట్స్‌మన్‌గా రోహిత్ నిలిచాడు.

# మళ్లీ రోహిట్

## రెండో ఇన్నింగ్స్‌లోనూ శతకంతో మెరిసిన ఓపెనర్ రోహిత్ శర్మ

## సౌతాఫ్రికా లక్ష్యం 395.. ప్రస్తుతం 11/1 ● భారత్‌తో తొలి టెస్టు

**విశాఖపట్నం:** సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ మరోసారి తన బ్యాట్‌ను ఝళిపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో సూపర్బ్ సెంచరీతో మెరిసిన రోహిత్ రెండో ఇన్నింగ్స్‌లోనూ శతకం బాది భారత్‌కు భారీ స్కోరును అందించాడు. బౌండరీల వర్షం కురిపించిన రోహిత్ (127; 149 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్సర్లు) విధ్వంసకర బ్యాటింగ్‌తో సఫారీ బౌలర్లను ఆటాడుకున్నాడు. ఇతనికి తోడుగా పుజారా (81) కూడా రాణించడంతో టీమిండియా 323/4 స్కోరువద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి సౌతాఫ్రికాకు 395 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ లక్ష్యంతో దిగిన సఫారీ జట్టు నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 11 పరుగులు చేసింది. ఆదివారం చివరి రోజు విజయం కోసం మరో 384 పరుగులు చేయాల్సి ఉంది. అలాగే భారత బౌలర్లు విజృంభిస్తే కోహ్లీసేనకు విజయం ఖాయం. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా బోణీ చేయాలని అత్రుతగా ఉంది. ఇక చివరి రోజు ఆటకు వరుణుడు అడ్డుపడకూడదని ఇండి యా అభిమానులు కోరుకొం టున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు పడగొట్టిన అశ్విన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటుకు నేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. మరోవైపు తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లు తీయడంలో విఫలమైన షమీ, ఇషాంత్ లు ఈసారి ఎలాగైన సఫారీలను కట్టడి చేయాలని చూస్తున్నారు. ఓవరాల్‌గా టీమిండియాకు ఈ మ్యాచ్ గెలిచే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

#### అశ్విన్ తిప్పేశాడు..

శనివారం 358/8 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన సౌతాఫ్రికా జట్టు మరో 73 పరుగులు జోడించి 131.2 ఓవర్లలో 431 పరుగులకు ఆలౌటైపోయింది. లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ ముత్తుసామీ 33 (నాటౌట్), రబాడా 15 పరుగులతో రాణించడంతో సఫారీ జట్టు భారత్‌కు మంచి పోటీ ఇవ్వగలిగింది. ఆఖరి రెండు వికెట్లను పడగొట్టిన రవిచంద్రన్ అశ్విన్ మొత్తంగా 7 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు జడేజాకు రెండు, ఇషాంత్ శర్మకు ఒక వికెట్ దక్కాయి. భారత్‌కు 91 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.





#### రాణించిన రోహిత్, పుజారా..

అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీతో విజృంభించిన ఓపెనర్ మయాంక్ అగర్వాల్ ఈసారి మాత్రం 7 పరుగులకే పరిమితమయ్యాడు. దీంతో టీమిండియా 21 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. అనంతరం మరో ఓపెనర్ రోహిత్ శర్మ, మిస్టర్ డిపెండబుల్ చతేశ్వర్ పుజారా అద్భుతమైన బ్యాటింగ్‌తో భారత ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఆరంభంలో ఆచితూచి ఆడిన వీరు సింగిల్స్, డబుల్స్‌తో స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. కొద్ది సేపటి తర్వాత పిచ్‌పై నిలదొక్కుకున్న రోహిత్ సఫారీ బౌలర్లపై విరుచుకుపడి బౌండరీలు బాదడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే రోహిత్ 72 బంతుల్లోనే 3 ఫోర్లు, 3 సిక్సర్లతో హాఫ్ సెంచరీ సాధించాడు. పుజారా కూడా 106 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఈ భాగస్వామ్యాన్ని విడగొట్టడానికి సఫారీ బౌలర్లు ఎన్నో ప్రయత్నాలు చేశారు. చివరికి ఫిలాండర్ శ్రమ ఫలించడంతో భారత్ 190 పరుగుల వద్ద పుజారా (81; 148 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సులు) వికెట్‌ను చేజార్చుకుంది. రోహిత్-పుజారాలు రెండో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. అనంతరం క్రీజులోకి వచ్చిన జడేజాతో కలిసి రోహిత్ స్కోరుబోర్డును ముందుకు సాగదీశాడు. వీరిద్దరు కూడా సఫారీ బౌలర్లపై విరుచుకుపడి బౌండరీల వరద పారించారు. ఈ క్రమంలోనే రోహిత్ 133 బంతుల్లో వరుసగా రెండో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఓపెనర్‌గా తొలి మ్యాచ్‌లోనే రెండు ఇన్నింగ్స్‌లలో శతకాలు బాదిన తొలి ఆటగాడిగా రోహిత్ రికార్డు సృష్టించాడు. తర్వాత దూకుడుగా ఆడుతున్న జడేజా 32 బంతుల్లో 3 సిక్సర్లతో 40 పరుగులు చేసి ఆవుటయ్యాడు. మరోవైపు రోహిత్ కూడా 127 పరుగులకు మహారాజ్ బౌలింగ్‌లో పెవిలియన్‌కి చేరాడు. చివర్లో కెప్టెన్ విరాట్ కోహ్లీ (31 నాటౌట్; 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), వైస్ కెప్టెన్ అజింక్య రహానే (27 నాటౌట్; 17 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగి ఆడారు. అనంతరం భారత్ రెండో ఇన్నింగ్స్‌ను 323/4 వద్ద డిక్లేర్ చేసి సౌతాఫ్రికా ముందు 395 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది.

అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌతాఫ్రికాకు ఆరంభంలోనే జడేజా షాకిచ్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో శతకంతో మెరిసిన ఎల్గర్‌ను 2 పరుగులకే ఆవుట్ చేశాడు. దీంతో నాలుగో రోజు ఆటముగిసే సమయానికి సౌతాఫ్రికా 9 ఓవర్లలో వికెట్ కోల్పోయి 11 పరుగులు చేసింది. డి బ్రూన్ (5), మార్కరమ్ (3) క్రీజులో ఉన్నారు.

#### స్కోరు బోర్డు:

**భారత్ తొలి ఇన్నింగ్స్: 502/7 డిక్లేర్డ్.**

**సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** డీన్ ఎల్గర్ (సి) పుజారా (బి) రవీంద్ర జడేజా 160, మార్కరమ్ (బి) అశ్విన్ 5, డి బ్రూన్ (సి) సాహా (బి) అశ్విన్ 4, డేన్ పీట్ (బి) జడేజా 0, టెంబ బవుమా (ఎల్బీ) ఇషాంత్ శర్మ 18, డు ప్లెసిస్ (సి) పుజారా (బి) అశ్విన్ 55, క్వింటన్ డికాక్ (బి) అశ్విన్ 111, ముత్తుసామీ (నాటౌట్) 33, ఫిలాండర్ (బి) అశ్విన్ 0, కేశవ్ మహారాజ్ (సి) మయాంక్ (బి) అశ్విన్ 9, కగిసో రబాడా (ఎల్బీ) అశ్విన్ 15; ఎక్స్‌ట్రాలు: 21, (మొత్తం 131.2 ఓవర్లలో) 431 ఆలౌట్.

**వికెట్ల పతనం:** 1-14, 2-31, 3-34, 4-63, 5-178, 6-342, 7-370, 8-376, 9-396, 10-431.

**బౌలింగ్:** ఇషాంత్ శర్మ 16-2-54-1, షమీ 18-4-47-0, రవిచంద్రన్ అశ్విన్ 46.2-11-145-7, జడేజా 40-5-124-2, హనుమ విహారి 9-1-38-0, రోహిత్ శర్మ 2-1-7-0.

**భారత్ రెండో ఇన్నింగ్స్:** మయాంక్ అగర్వాల్ (సి) డుప్లెసిస్ (బి) మహారాజ్ 7, రోహిత్ శర్మ (స్టంప్డ్) డికాక్ (బి) మహారాజ్ 127, చతేశ్వర్ పుజారా (ఎల్బీడబ్లూ) ఫిలాండర్ 81, రవీంద్ర జడేజా (బి) రబాడా 40, విరాట్ కోహ్లీ (నాటౌట్) 31, అజింక్య రహానే (నాటౌట్) 27; ఎక్స్‌ట్రాలు: 10, మొత్తం (67 ఓవర్లలో) 324/4 డిక్లేర్.

**వికెట్ల పతనం:** 1-21, 2-190, 3-239, 4-286.

**బౌలింగ్:** ఫిలాండర్ 12-5-21-1, మహారాజ్ 22-0-129-2, రబాడా 13-3-41-1, డేన్ 17-3-102-0, ముత్తుసామీ 3-0-20-0.

**సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మార్కరమ్ (బ్యాటింగ్) 3, డీన్ ఎల్గర్ (ఎల్బీ) రవీంద్ర జడేజా 2, డి బ్రూన్ (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు: 1, మొత్తం (9 ఓవర్లలో) 11/1.

**బౌలింగ్:** అశ్విన్ 5-2-7-0, జడేజా 4-2-3-1.

# టైటిల్‌పోరుకు జొకో



**టోక్యో :** జపాన్ ఓపెన్‌లో ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జొకోవిచ్ టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. తొలిసారి జపాన్ ఓపెన్‌లో ఆడుతున్న జొకోవిచ్ శనివారం జరిగిన సెమీస్‌లో వరుస సెట్లలో 6-3, 6-4 స్కోరుతో డేవిడ్ గాఫిన్‌ను ఓడించి ఈ సీజన్‌లో అయిదో ఫైనల్‌కు సిద్ధమయ్యాడు. ఫైనల్లో జొకోవిచ్ ఆస్ట్రేలియా క్వాలిఫయర్ జాన్ మిల్‌మన్‌ను ఢీకొననున్నాడు. మిల్‌మన్ 6-3, 7-6(4)తో రీలీ ఒపెల్కాపై గెలుపొంది జొకోతో పోరుకు రెడీ అయ్యాడు.

# ఫైనల్లో నగల్



**కాంపినాస్(బ్రెజిల్) :** ఏటీపీ చాలెంజర్ కాంపినాస్ టెన్నిస్ టోర్నీలో భారత ఆటగాడు సుమీత్ నగల్ టైటిల్ పోరుకు చేరుకున్నాడు. క్వార్టర్‌ఫైనల్లో నగల్ 7-6, 7-5 స్కోరుతో 13వ సీడ్ సెరుండొలొను ఓడించాడు. గత రెండు వారాలలో నగల్ నాలుగు టోర్నీలలో సెమీస్‌కు చేరుకున్నాడు. ఫైనల్లో నగల్ అర్జెంటీనాకు చెందిన జువాన్ పాబ్లొ ఫికోవిచ్‌ను ఎదుర్కొంటాడు.

# టాపర్‌కు యోధా బ్రేక్

### ప్రొ కబడ్డీ సీజన్-7



**గ్రేటర్ నొయిడా:** ప్రొ కబడ్డీ గ్రేటర్ నొయిడా లెగ్‌లో స్థానిక జట్టు ఢిల్లీ దబాంగ్‌కు తొలి మ్యాచ్‌లోనే చుక్కెదురైంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతున్న దబాంగ్‌ను యూపీ యోధ 50-33 స్కోరుతో చిత్తుగా ఓడించింది. యోధ జట్టులో మోను గోయత్, ఢిల్లీ జట్టులో నీరజ్ నర్వాల్ సూపర్ టెన్స్ సాధించారు. విరామానికి 22-12తో ఆధిక్యం సాధించిన యోధ జట్టు కడదాకా దానిని నిలబెట్టుకుటూ 17 పాయింట్ల తేడాతో విజయం దక్కించుకుంది. యోధ జట్టులో మను గోయత్ 11, శ్రీకాంత్ జాదవ్ 9, నితేష్ కుమార్ 6, సుమీత్ 5, సురేందర్ గిల్, సురేందర్ సింగ్ చెరి 4 పాయింట్లు సాధించగా, ఢిల్లీ జట్టులో నీరజ్ నర్వాల్ 11, సోంబీర్ 9, మిరాజ్ షేక్ 7, అమన్ కడియన్ 3 పాయింట్లు సాధించారు. రెయిడింగ్‌లో(29-23), టాకిలింగ్‌లో(14-8) యోధ జట్టుదే పైచేయి. పైగా ఢిల్లీ జట్టు మూడుసార్లు ఆలౌటయింది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 39-33తో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌ను ఓడించింది. పట్నా జట్టులో పర్దీప్ నర్వాల్ 17 పాయింట్లతో జట్టు విజయానికి దోహదం చేశాడు. ఇతర ఆటగాళ్లలో మహ్మద్ ఇస్మాయిల్ 5, నీరజ్ 3, జంగ్ కున్ లీ, జైదీప్ చెరి 2 పాయింట్లు సాధించగా, గుజరాత్ జట్టులో జిబి మోరె 15, రోహిత్ గులియా 6, సోను, పర్వేష్ చెరి 3, రుతురాజ్ 2 పాయింట్లు సాధించారు. ఆదివారం బెంగాల్ వారియర్స్‌తో పట్నా పైరేట్స్, యుపి యోధతో పుణెరి పల్టన్ తలపడనున్నాయి.

# రాయుడు శ్రమ వృథా

### హైదరాబాద్ ఓటమి, విజయ్ హజారే ట్రోఫీ





**బెంగళూరు:** దేశావాళి వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమిపాలైంది. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో జర్ఖండ్ 6 వికెట్లతో హైదరాబాద్‌పై గెలిచింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 34 ఓవర్లకు కుదించగా తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత ఓవర్లలో 7 వికట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. కెప్టెన్ అంబటి రాయుడు (69; 54 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) చెలరేగి ఆడాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన జార్ఖండ్‌లో సౌరభ్ తివారి (61 నాటౌట్; 47 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), కుమార్ (51) హాఫ్ సెంచరీలతో రాణించారు. దీంతో జార్ఖండ్ 33.4 ఓవర్లలో 193/4 స్కోరుతో మరో రెండు బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకుంది.

# పాక్‌పై లంక విజయం

**లాహోర్:** పాకిస్తాన్, శ్రీలంక మధ్య ప్రారంభమైన టి20 సిరీస్‌లో లంక బోణీ చేసింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 64 పరుగుల తేడాతో ఆతిథ్య పాక్‌ను ఓడించింది. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో లంక 1-0 ఆధిక్యం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. ఓపెనర్ ధనుష్క గుణతిలక (57) రాణించాడు. అనంతరం లక్ష్యఛేదనలో పాక్ 17.4 ఓవర్లలో 101 పరుగులకే కుప్పకూలింది. లంక బౌలర్లలో ఇసు ఉదనా (3/11), నువాన్ ప్రదీప్ (3/21) విజృంభించారు. విజయంలో కీలప పాత్ర పోషించిన గుణతిలకకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

**సంక్షిప్త స్కోర్లు :** శ్రీలంక-165/5, పాకిస్తాన్-101 ఆలౌట్.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

**L**ively **I**nteraction **F**or **E**ver

ఆంధ్రప్రభ

lifepage2012@gmail.com

# లైఫ్

I

ఆదివారం 6 అక్టోబర్ 2019

బతుకమ్మ పండుగ...తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పే పండుగల్లో ముఖ్యమైనది. భగవంతుడిని పూలతో పూజించడం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆచారం అయితే... ఈ పూలనే భగవంతునిగా పూజించడం తెలంగాణ బతుకమ్మ ఉత్సవాల ప్రత్యేకత. పూలను వరుసలుగా పేర్చి ప్రకృతినే దేవతగా పూజించే పండుగ బతుకమ్మ. ప్రపంచంలో మరెక్కడా లేని రీతిలో తెలంగాణకే ప్రత్యేకమైన రంగు రంగుల పూల పండుగ బతుకమ్మ. విభిన్నమైన పూలతో బతుకమ్మను చేసి... ఆడపడుచులు ఆనందోత్సాహాలతో, సంప్రదాయంగా, వేడుకగా జరుపుకునే పూల పండుగ ఇది. తొమ్మిది రోజుల పాటు అన్ని ప్రాంతాల్లో ఒక జాతరలా సాగే ఈ పండుగ జీవన సంబురాన్ని ఆవిష్కరిస్తుంది. నేడు బతుకమ్మ సంబురంలో చివరిరోజయిన సద్దుల బతుకమ్మని జరుపుకుంటున్న సందర్భంలో బతకమని దీవించే బతుకమ్మని తలచుకుందాం-

# పూలదీవెన... బతుకమ్మ!



## నేడు సద్దుల బతుకమ్మ

బతుకమ్మ పూల జాతరతో జీవనాధారమైన చెరువులన్నీ పులకించిపోతాయి. బతుకమ్మ పండుగ అంటే ఆడబిడ్డ పుట్టింటికి వస్తదనే అమ్మ ఆనందం, బతుకమ్మ పండుగ అంటే పూల కోసం ఉరుకులాడే అన్న ఆరాటం, బతుకమ్మ పండుగ అంటే బిడ్డకు చీర పెట్టాలనే తండ్రి బతుకు పోరాటం. బతుకమ్మ అంటే ప్రేమలు, అప్యాయతలు నింపే స్నేహబంధం, బతుకమ్మ అంటే వూరు వూరంతా ఆనందోత్సాహాల్లో ఓలలాడే పూల జాతర.

### భిన్న రూపాల్లో దేశమంతటా బతుకమ్మ

బతుకమ్మ మొదట గ్రామదేవత. గ్రామీణులు సృష్టించిన అమ్మదేవత. తర్వాత శైవం... ఆమెకు శివుని సతీస్థానం ఇచ్చి గౌరమ్మని చేసింది. ఆ తర్వాత వచ్చిన వైష్ణవం సాక్షాత్తు లక్ష్మీదేవే బతుకమ్మ అని ప్రస్తుతించి ప్రచారం లో పెట్టింది.

నామరూప భేదాలతో కొంచెం అటు ఇటుగా ఈ పండుగ భారతదేశమంతటా కనిపిస్తుంది. గర్బా, దాండియా, తీజ్, ఓనం, అట్లతద్ది, బొడ్డెమ్మ తదితర రూపాల్లో ఉంటుంది.

### పూలను పేర్చి..పసుపు ముద్దను ఉంచి..

బతుకమ్మ కోసం పూల అమరికని మొదలుపెట్టినప్పుడు... మొదట తాంబాళంలో గుమ్మడి ఆకులు పరుస్తారు. వాటి కింద నూలు దారాలను రెండువరుసల్లో ప్లస్ ఆకారంలో వేస్తారు. గోపురాకారంలో పేర్చిన బతుకమ్మ పూలు జారి పోకుండా ఈ దారాలను ఆధారంగా కడతారు. బతుకమ్మను పేర్చడానికి గుమ్మడి ఆకు, తంగేడు, గునుగుపూలు తప్పనిసరిగా ఉండాలి. మొదటి వరుసలో తంగేడుపూలు పెడతారు. మధ్యలో తుంచిన పూలకాడలు, ఆకులను వేస్తారు. సాధారణంగా ప్రతి రెండోవరుసా తంగేడు పూలదే ఉంటుంది. గునుగుపూలకు చివరులు చిదిమేసి పది-పన్నెండు పూలను ఒక కట్టగా కట్టి కొన్ని వరుసల్ని పేరుస్తారు. గునుగుపూలు తెలుపురంగులో ఉంటాయి. అందుకని వీటిని ఆకుపచ్చ గులాబి, నీలిరంగులో ముంచి వర్ణరంజితం చేస్తారు. ఇలా ఒక వరుస తంగేడు, ఇంకోవరస గునుగుపూ లను మూడు, నాలుగు వరుసల్లో గోపురాకారంలో పేరుస్తారు. ఆ తర్వాత లభ్యతను బట్టి బంతి, చేమంతి, గన్నేరుపూలను పేరుస్తారు. పైన తమలపాకులో త్రిభుజాకారంలో పసుపు ముద్దను ఉంచి కుంకుమ, పసుపు బొట్లు పెడతారు. అగరవత్తులు వెలిగించి బతుకమ్మకు అలంకరణ పూర్తి చేస్తారు. అందుకే పసుపులో పుట్టిన గౌరమ్మ, పసుపులో పెరిగిన గౌరమ్మ అంటూ పాడతారు.

### ఆటపాటలతో కలిసిమెలిసి...

అలంకరించిన బతుకమ్మలను ఇంటి వాకిట్లోకి తీసుకొస్తారు. మొదట ఎవరి ఇళ్ల వద్ద వాళ్ళు ఆడాక ఆ ఊరిలో ఉండే గుడి వద్దకు చేరుతారు. అక్కడ డప్పులు, కొమ్ము వాయిద్యాలు గంభీరంగా నినదిస్తుంటే చప్పట్లతో అంతా కోలాహలంగా ఉంటుంది. రంగు రంగుల చీరలతో ముస్తాబై వచ్చిన స్త్రీల సందడితో ఊరంతా వారి వెంటే ఉందా అన్నట్లు ఉంటుంది అక్కడి వాతావరణం. ఇక ఈ సందర్భంలో... ఒక మహిళ...'ఒక్కేసి పువ్వేసి సందమామా ఒక్క జామాయె సందమామా' అటూ పాటందు కుంటుంది. మిగిలిన వారందరూ ఆమెను అనుకరిస్తూ బతుకమ్మ చుట్టూ లయబద్ధంగా తిరుగుతూ ఒంగి ఉన్నపుడు ఒకసారి, లేచినప్పుడు రెండుసార్లు చప్పట్లు చరు స్తూ ఆడతారు. పాట ఆట అంతా చాలా హృద్యంగా లయ బద్ధంగా సాగుతాయి. కనీసం నలుగురు కలిసి ఆడే ఆట ఇది. ప్రేమలు, అప్యాయతలు పంచుకొని ఆత్మీయతలను వ్యక్తం చేసు కొనే పండుగ బతుకమ్మ. ఇక అక్కడి నుంచి స్త్రీలంతా ఈ ఊరి చెరువుకు బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి తరలి వెళ్తారు.

### ఒకచోట చేరి సద్దులు తినే సద్దుల బతుకమ్మ

చివరిరోజు బతుకమ్మను సద్దుల బతుక మ్మ అంటారు. ఈ బతుకమ్మను 'పోపో బొడ్డెమ్మ.. .. పోయిరా బొడ్డెమ్మ మల్లెన్నడత్తవ్ బొడ్డెమ్మ' అంటూ బతుకమ్మను సాగనం పుతూ నిమజ్జనం చేస్తారు. సాధారణంగా సంధ్యా సమయాల్లో అంత సందడిగా ఉండని చెరువు... తనపై అలా అలా తేలుతూ మునుగుతున్న బతుకమ్మలతో నిజంగానే సంతృప్తి చెందిందా.. అన్నట్లుగా శోభిల్లే దృశ్యాన్ని చూడాల్సిందే కాని వర్ణించలేం. బతుకమ్మను చెరువులో వేసిన తరువాత ఖాళీ తాంబాళంను ఒక చోట పెట్టి మరోసారి ఆడిపాడిన తరువాత సద్దులు విప్పుకుని తింటారు. ఈ రోజు కార్యక్రమం నిజంగా ఉత్సాహంగా, కోలాహలంగా ఉంటుంది. పంచుకుని తినడంలో ఉన్న ఆనందాన్ని ఆస్వాదించే సందర్భం అది. తమ వెంట ఎవరికి వీలైన సద్దులను వారు తీసుకెళ్తారు. సాధారణంగా మలీద, సున్నండలు, సర్వపిండి, పోలెలు, తియ్యటప్పాలు, పులిహోరా, అటుకులు , పేలాలు, నానబెట్టిన పెసలు, శనగలు, అరిసెలు వంటివి సద్దులుగా తీసుకెళ్తారు.

### చెరువులకు పూల జాతర....

చెరువులకు బతుకమ్మ పండుగతో అవినాభావ సంబంధం ఉంది. ఈ పండుగకు నీటికి ఉన్న సంబంధం



ఏంటంటే... తంగేడు, గునుగు, పసుపు ముద్ద, తమలపాకులు... చెరువునీటిని శుద్ధి చేయడమే కాకుండా అవి కుళ్లి నీటి అడుగుకు పోయి చెరువు మట్టిని సారవంతం చేస్తాయి. వేసవిలో ఈ మట్టిని రైతులు పొలాల్లో వేయడం వల్ల పొలాలు సారవంతం అవుతాయి. బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేయడం ద్వారా తంగేడు, గునుగు, బీర, గుమ్మడి, మందారం, నందివర్ధనం,, బంతి, చేమంతి, గులాబి, పూలల్లోని ఔషధ గుణాలు నీళ్లలోకి చేరి నీళ్లు శుద్ధి అవుతాయి.

**- గుంజులూరి దేవేందర్**
**ప్రభన్యూస్, ఖమ్మం కల్చరల్**

### జీవితాన్ని ఆవిష్కరించే పాటలు

బతుకమ్మ పాటలన్నీ రాగయుక్తమైన శైలి, సరళమైన భాషతో బతుకు చిత్రాన్ని ఆవిష్కరిస్తాయి. ఈ పాటల్లోని సాహిత్య విలువలు అమూల్యమైనవి. జానపద, ఇతిహాస, చారిత్రక ఘట్టాలతో సున్నితమైన మానవ సంబంధాలు ఈ పాటల్లో ప్రధాన వస్తువులుగా ఉంటాయి. బతుకమ్మ పాటల ద్వారా స్త్రీలు తమ జీవితాల్లోని కష్టసుఖాలను చెప్పుకుంటారు. దీంతో వారి మనసులు తేలిక పడతాయి. ఇలా ఆడిపాడటానికి గట్టిగా మాట్లాడటానికి కూడా అవకాశంలేని అనేక కట్టుబాట్లు మహిళలకు ఉంటాయి.

బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు కట్టుబాట్లను మరిచి ఆడిపాడి సేదతీరుతారు. అన్ని వయసుల మహిళలు ఆనందం గా పరవశించి ఆడిపాడతారు. మెట్టినింటి వారి మంచి చెడులను వివరిస్తారు. తమ ప్రాంత వైశిష్ట్యాన్ని పాటల్లో పొందుపరుస్తారు. తమ ప్రాంతాల్లో జరిగిన ప్రధాన సంఘటనలు, ప్రమాదాలు, త్యాగాలు, దానాలను పాటల్లో అల్లుతారు. సున్నిత హాస్యాలు, పరిహాసాలు, గేలిచేయడాలు... కూడా కొద్ది పరిమాణంలో ఉంటాయి.

బతుకమ్మ పాటలు సరళ తాత్వింకాంశాలకు లేదా వారి జీవితా లకు సంబంధించినవై ఉంటాయి. ఇవి ఉయ్యాల, చందమామ, గౌరమ్మ, కోట, వలలో అల్లో నేరేడల్లో... తదితర పదాలతో ముగుస్తాయి. ఇక కొంత నేర్పు ఉన్న మహిళలైతే అప్పటికప్పుడు పాటలు అల్లి పాడతారు. ఆ పాటల్లోని అంశం నచ్చితే ఇతర స్త్రీలు దాన్ని నేర్చుకొని స్థిరపరు స్తారు. తమకు వీలైన పద్ధతిలో మార్చి పాడే వెసులుబాటు పాటల్లో పుష్కలంగా ఉంటుంది.

---

బిడ్డ ఏడుస్తుంటే తల్లి జోలపాట పాడుతుంది. ఏడుపాపిన బిడ్డ తల్లి పాటలోని లాలనతో నవ్వుతుంది. మనందరి జీవితాలు ఇలాగే పాటతో ప్రారంభమవుతాయి. పాటకు మైమరచిపోతాం... కాబట్టే బతుకంతా పాటలాగా సాగాలి అంటారో కవి. మధురంగా పాట పాడేవారిలో అమ్మే కనిపిస్తుంది. ఆ పాటకు రాజు, పేద ఎవరైనా సమానమే. అలాంటి వేలాది పాటలు పాడి కోట్లాది మంది బిడ్డలను అమ్మలా లాలిస్తున్నారు... మెలోడీ క్వీన్ లతా మంగేష్కర్. భారతరత్న అందుకున్న ఒకే ఒక్క గాయనిగా చరిత్ర సృష్టించారామె. ఇప్పుడు 'డాటర్ ఆఫ్ నేషన్' గా తనకు పూర్తిగా అర్హత కలిగిన పిలుపును సొంతం చేసుకున్నారు. ఈ పాటల రాణి జీవన ప్రస్థానం... ఆమె మాటల్లోనే... ఆంధ్రప్రభ లైఫ్‌లో మీకోసం-

# పాటలతల్లి




ఏ కళాకారుడైనా సాధించింది చాలు... సాధించాల్సింది ఇంకేం లేదు అనుకుంటే ఇక అక్కడే ఆగిపోతారు. వాళ్లు నటులైనా, దర్శకులైనా, సంగీత కళా కారులైనా, గాయనీ గాయకులైనా..ఎవరైనా సరే. నిజమైన కళాకారులకు తమ పనిలో సంతృప్తి ఎప్పటికీ ఉండదు. అమితాబ్ బచ్చన్ గారే ఇందుకు గొప్ప ఉదాహరణ. ఆయన ఇప్పటికీ సినిమాల్లో ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. మనలోని సాధించాలనే ఆకలికి వయసుతో పనిలేదు. నా జీవితంలో ప్రతి సందర్భంలో కొత్త కొత్త గమ్యాలు ఏర్పడుతూ వచ్చాయి. వాటిని అందుకునేందుకు నూతన శక్తితో ప్రయత్నించాను. అలా ఇన్నేళ్లు గడిచాయి. కానీ గాయనిగా ఇంకా ఏదో సాధించాలనే తపన నాలో తగ్గలేదు. మీరు అద్భుతంగా పాడారని అంతా అంటారు కానీ పాటలో నేనెక్కడ తప్పులు చేశానో, ఎక్కడ పాటకు పూర్తి న్యాయం చేయలేదో నాకు మాత్రమే తెలుసు. అందుకే ఈ సుదీర్ఘ ప్రయాణంలో నేర్చుకోవడం, పాటకోసం తపించడం ఆపేయలేదు.

### దేవుడు ఎక్కువే ఇచ్చాడు..

కోట్లాది మంది నన్ను గాయనిగా ఆరాధించడం వలన... నాపై మరింత బాధ్యత పెరిగిందని భావిస్తా. అంతేగానీ ఎక్కడా గర్వపడను. నాపై వీళ్లు చూపిస్తున్న ప్రేమకు తిరిగి ఏమివ్వగలను అని ఆలోచిస్తుంటా. నా పాటపై శ్రోతలకు అంచనాలు ఎక్కువగా ఉంటాయి. వాటిని చేరుకునే ప్రయత్నం నిత్యం చేస్తుంటా. జీవితంలో దక్కినదంతా దేవుడి దయే అనుకుంటా. ఆయన చూపిన దయ వల్లే ఇంత ఎదిగా, కొంతమంది నా మాటతో అంగీకరిం చకపోవచ్చు. కానీ నాకున్న ప్రతిభ కంటే ఎక్కువ పేరు, గుర్తింపు దక్కాయన్నది నిజం.

### సంతృప్తినిచ్చిన పాటలవే...

నా సోదరుడు హృదయనాథ్ మంగేష్కర్ స్వరపర్చిన మీరాభాయి భజన్స్ ఆల్బమ్‌లోని పాటలు నాకు గాయనిగా అత్యంత సంతృప్తినిచ్చాయి. ఇప్పటికీ ఆ పాటలంత బాగా మరే పాటలూ పాడలేదని అనుకుంటా. దిగ్గజ సంగీత దర్శకులు సలీల్, మదన్ మోహన్, జైదేవ్‌లకు పాడిన పాటలు కూడా నాకు సంతోషాన్నిచ్చాయి. వీరిలో జైదేవ్ గారికి పాటలు పాడటానికి ఎక్కువ శ్రమించా. సంప్రదాయ సంగీతంలో నేర్పరి జైదేవ్ గారు. ఆయన ఒకసారి నేపాల్ రాజు గారు రాసిన పాట ఒకటి పాడమని ఇచ్చారు. ఆ పాట పాడేందుకు కష్టపడ్డాను. జైదేవ్ గారు పాట స్వరపరిచి... 'లతాకు ఎలా పాడాలో వివరించాను. ఇక ఆమె చూసుకుంటుందిలే' అని నామీద ఆ పాట భారం మోపేవారు. అప్పుడు నా బాధ్యత మరింత పెరిగేది.

### కష్టాలకు ఎదురునిలిచి..

నా చిన్నప్పుడే నాన్న పోయారు. ఇంట్లో నలుగురు అమ్మాయిలం, ఒకబ్బాయి. నేనే పెద్దదాన్ని. దాంతో నాపై ఇంటి బాధ్యతలు పడ్డాయి. నాన్న చనిపోయేప్పటికి తమ్ముడు హృదయనాథ్‌కు కేవలం నాలుగేళ్లు. ఇంటి పెద్ద లేరంటే సాధారణంగా పిల్లలు భయపడిపోతారు. తమ కుటుంబీకుల సంరక్షణలోకి వెళ్తారు. నా విషయంలో అది జరగలేదు. నేను కుటుంబం కోసం నిలబడ్డాను. అత్యంత శ్రమకోర్చి గాయనిగా పేరు తెచ్చుకున్నాను. కుటుంబానికి ఏం కావాలో అవన్నీ చేశాను. ఎంత సంపాదించినా నాకో సొంత ఇల్లు ఉండాలని కూడా అనుకోలేదు. కుటుంబంతో కాకుండా నేను విడిగా ఉండాలన్న ఆలోచన కూడా ఎప్పుడు రాలేదు. ఇప్పుడు అలా అనుకోవాల్సిన సందర్భమే రాదు. అంతా దేవుడి ఆజ్ఞే అనుకుంటా. 'నేను గొప్పవాడిని' అని ఎవరు అనుకున్నా అప్పుడే వాళ్ల పతనం ప్రారంభం అవుతుందని నమ్ముతాను. నేనో అసాధారణ గాయనిని అని ఎప్పుడూ అనుకోను.

### కొత్త వాళ్లతోనూ అంతే ప్రేమగా..

నేను అనుభవజ్ఞురాలైన గాయనిని కాబట్టి కొంతమంది కొత్త సంగీత దర్శకులకు భయం ఉండొచ్చు కానీ నేను ఏఆర్ రెహమాన్, విశాల్, అనూ మాలిక్, జతిన్ లలిత్ లాంటి యువ సంగీత దర్శకులకు చక్కగా పాటలు పాడాను. పేరున్న సంగీత దర్శకుల దగ్గర ఎంత జాగ్రత్తగా పాట నేర్చుకుని పాడానో, అంతే గౌరవాన్ని వీళ్ల పాటలకూ ఇచ్చాను. నాకున్న అనుభవాన్ని కొత్తవాళ్లపై ఎప్పుడూ చూపించలేదు. కొత్త సంగీత దర్శకులు నాతో పాడించే అవసరం ఒక పాటకు ఉందని భావిస్తే ఖచ్చితంగా నా దగ్గరకు రావొచ్చు. ఆ పాట బాగా లేకుంటే నేను పాడలేనని చెబుతుంటా.

### రెహమాన్‌కు పాడటం ఇష్టం..

మనసు ఎక్కువ పాటలు పాడాలని ఆరాటపడినా వయసు సహకరించదు కదా. అప్పట్లోలా ఒక స్టూడియో నుంచి మరో స్టూడియోకు పరుగులు పెడుతూ ఇప్పుడు పాటలు పాడలేను. కొంత విరామంతో, నింపాదిగా పాటలు పాడుతున్నా. పాటల విషయంలో సినిమాలే నా మొదటి ప్రాధాన్యత. ఇక్కడ నాకు సన్నిహితులు ఎక్కువ. చాలా మంది దర్శకులు నాకు... కుటుంబ సభ్యుల్లాంటి వారు. అంతలా వారితో అనుబంధం ఉంది. ఆ తర్వాతే ప్రైవేటు ఆల్బమ్స్. ఏఆర్ రెహమాన్ నాకు ఈతరంలో ఇష్టమైన సంగీత దర్శకుడు. అతనితో పాటలు పాడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తుంటా. అతని పాటలను ఆస్వాదిస్తా.



### పాటకేం కావాలో అలాగే పాడతా..

సంప్రదాయ సంగీతాన్ని ఆలపించడంలో గాయనీ గాయకులకు కావాల్సినంత స్వేచ్ఛ ఉంటుంది. కానీ సినిమా పాటలు అలా కాదు. ఆ సందర్భం, ఆ పాట పాడే పాత్రల స్వభావం, గీతరచన, స్వరాల స్వరూపం ఇలా అన్నింటినీ చూడాలి. నేను ఓ పాట పాడే ముందు... నాయిక ఎందుకు ఆ పాట పాడుతుంది. ఆమె పాడే సందర్భం ఏంటి అని ఆలోచించి, స్వరకర్త చెప్పిన కొలతలతో పాట పాడతాను. అందుకే చాలా మంది పాటకు కావాల్సినట్లు లత పాడారని అంటుంటారు. కేఎల్ సెహగల్, నూర్‌జహాన్ జీ నా కంటే బాగా పాటలు పాడతారని నమ్ముతుం టాను. ప్రతి కళాకారునికీ ఒక ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. ఆ ప్రతిభను ఎంతలా ఉపయోగించుకుంటారనేది వాళ్ల శ్రమ మీద ఆధారపడి ఉంటుంది.

### కిటుకులు దాచుకునేదాన్ని..

పాట పాడేప్పుడు సంగీత దర్శకుడు చెప్పిన దానికంటే ఎక్కువ మెరుగుపరచి పాడటాన్ని ఇంప్రువైజింగ్ అంటారు. అలాంటి అవకాశం ఉన్న పాటను మరింత ప్రతిభావంతంగా పాడేందుకు ప్రయత్నించేదాన్ని. ఆ ప్రయత్నాలను రిహార్సల్ సమయంలో ఉపయోగించకుండా, పాట ఫైనల్ టేక్ అప్పుడు పాడేదాన్ని. దాంతో సహ గాయకుడు ఆశ్చర్యపోయేవారు. అలా రఫీ గారిని చాలా సార్లు ఆశ్చర్యపరిచా. ఆయన ఉడుక్కునేవారు. ఇదంతా సరదాగా తీసుకుని నవ్వుకునేవాళ్లం.

### అతనే అభిమాన గాయకుడు..

కిషోర్ కుమార్ నా అభిమాన గాయకుడు. పాట పాడే ముందు, తర్వాత మేమిద్దరం ఎంతో సరదాగా గడిపేవాళ్లం. నన్ను తన సోదరిగా చెప్పుకునేవారు కిషోర్ కుమార్. బయట ఎంత అల్లరి చేసినా సంగీత దర్శకుడి ముందు బుద్ధిగా ఉండేవారాయన. ఆయన కొద్దిరోజులకు మరణిస్తారనగా నన్ను కలిసి తన బాధంతా చెప్పుకున్నారు. చివరి రోజుల్లో ఎంతో వేదన అనుభవించారు. ఏ కష్టం వచ్చినా, అవసరం ఉన్నా మీకు నేనున్నా... అని చెప్పేదాన్ని.



### కుటుంబమే నా బలం..

కుటుంబ బాధ్యతల నిర్వహణలో... నా సోదరీమణులు, నా తమ్ముడు ఎప్పుడూ నన్ను కష్టపెట్టలేదు. నాకొచ్చిన పేరును తమదిలా భావించారు. నా ఆస్తిపాస్తులు ఆశించలేదు. వాళ్లకున్న ప్రతిభతో తమకంటూ సొంత జీవితాలు సాధించుకున్నారు. అందుకే నాకేదైనా చిన్న జబ్బు చేసినా వాళ్లకు చెప్పను. చెబితే వెంటనే కంగారుగా వచ్చేస్తారు. బాధపడతారు.

### శ్రోతల ప్రేమే కోరుకుంటా..

నన్ను ఎంతగానో ప్రేమించే అభిమానులున్నారు. వాళ్ల శుభ కామనలు, ఆశీర్వాదాలు కోరుకుంటా. వాళ్ల ప్రేమ కంటే గొప్ప పురస్కారం నాకు లేదు. వాళ్ల అభిమానమే నాకింత పేరు ప్రతిష్టలు తీసుకొచ్చింది.

**- రమేష్ గోపిశెట్టి**

# దినఫలాలు

**మేష రాశి**
సన్నిహితుల కూటమిలో కొత్తవారిని చేరుస్తారు. సమిష్టిగా నూతన వ్యవహారాలను ప్రారంభిస్తారు. లిఖితపూర్వక వ్యవహారాలలో అప్రమత్తంగా ఉండాలి. వివాదాస్పద అంశాలకు దూరంగా ఉండటం ఉత్తమం.

**వృషభ రాశి**
మంచి ప్రోత్సాహం లభిస్తుంది. సకాలంలో స్పందించి సానుకూల ఫలితాలను సాధిస్తారు. అస్తవ్యస్తంగా ఉన్న చాలా వ్యవహారాలను మీ వ్యక్తిగత ప్రతిభతో చక్కదిద్దుతారు. వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

**మిథున రాశి**
భవిష్యత్తులో ఉపకరించే అంశాలపైన ప్రధానంగా దృష్టిని సారిస్తారు. వాహనం మార్పు చేసే సూచనలు ఉన్నాయి. విలువైన పత్రాలను అందుకుంటారు. ఆహార నియమాలను పాటిస్తారు.

**కర్కాటక రాశి**
చికాకులు స్వల్పంగా ఇబ్బంది కలిగిస్తాయి. గృహ మరమ్మతులు సాగిస్తారు. మాయమాటలతో మోసం చేసేవారు దగ్గరలోనే ఉంటారు. విఘ్నేశ్వరునికి దీపారాధన చేయండి మంచి ఫలితాలు కలుగుతాయి.

**సింహ రాశి**
నత్తనడకన సాగుతున్న పనుల్లో చురుకుదనం తీసుకురావడానికి విశేషంగా శ్రమిస్తారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా ఉంటుంది. స్వల్ప ధనలాభ సూచన. రోజూ దీపారాధన చేయండి.

**కన్యా రాశి**
సంచలనాత్మక నిర్ణయాలను తీసుకుంటారు. కుంకుమతో మహాలక్ష్మీదేవిని పూజించండి. కొనుగోలు, అమ్మకాలు లాభిస్తాయి. మందు జాగ్రత్తలతో వ్యవహరిస్తారు. ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉంటాయి. ఉన్నతమైన భావాలను కలిగి ఉంటారు.

**తులా రాశి**
రాజీలేని ధోరణిని కనబరుస్తారు. ధనాని కన్నా ధర్మమే ముఖ్యమని భావిస్తారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆత్మీయులను మందలిస్తారు. వాహన సంబంధమైన విషయాలు ప్రతికూలంగా ఉంటాయి. రోజూ దీపారాధన చేయండి. అన్ని విషయాలలో విజయ ప్రాప్తికలుగుతుంది.

**వృశ్చిక రాశి**
ఆశ్చర్యం కలిగించే సమాచారాన్ని తెలుసుకుంటారు. అపాత్రదానం చేస్తారు. దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొడతారు. సంతృప్తిని అలవరుచుకుంటే జీవితం సుఖమయమవుతుంది.

**ధనూ రాశి**
నిష్కారణ ఈర్ష్యాద్వేషాలు అధికమవుతాయి. ధనం చేతికందుతుంది. బంధువుల నుంచి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి, ఉద్యోగపరంగా సానుకూల ఫలితాలు వింటారు.

**మకర రాశి**
ముక్కసూటిగా వ్యవహరిస్తారు. అధికార పరిధి దృష్టిలో కీలకమైన నిర్ణయాలను తీసుకుంటారు. ఓర్పు సహనం కలిగి ఉండటం చెప్పదగిన సూచన. ఖర్చులు మితిమీరి ఉంటాయి.

**కుంభ రాశి**
టెక్నికల్ రంగాల వారికి అనుకూలంగా ఉంటుంది. వాస్తవాల పరిశీలన ఆధారంగా నిర్ణయాలను తీసుకుంటారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**మీన రాశి**
ప్రయోజనాలను పదిలంగా పరిరక్షించుకుంటారు. శ్రమ అధికం కావడంతో ఒత్తిడి కలిగి ఉంటారు. ఋణ సంబంధమైన విషయాల నుంచి ఊపిరి పీల్చు కోగలుగుతారు. ప్రతిష్ఠ పెరుగుతుంది.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

# మంగళకారిణి మహాగౌరి



నవరాత్రులలో తొమ్మిది రోజుల పాటు పరాశక్తిని రోజూ ఒక పేరున ఆరాధిస్తూ ఉంటారు. అనేక రూపాలలో అమ్మను ఆరాధించినా వీరిలో నవదుర్గలను ఆరాధించేవారు ఎనిమిదో రోజున పరాశక్తిని మహాగౌరిగా అర్చిస్తారు. మహాగౌరి సకల సౌభాగ్య ప్రదాయిని. మంగళప్రద. ఆది ముత్తయిదువ. నిత్య సువాసిని. పరాశక్తికి గల అనంత నామాలలో పార్వతి, భవాని, ఉమా, కామేశ్వరి, గౌరి ఉన్నాయని కొన్ని పురాణాలు పేర్కొన్నాయి. అందులో మహా గౌరీ రూపాన్ని వర్ణిస్తూ

**శ్వేతే వృషే సమారూఢే శ్వేతాంబర ధరా శుచిః**
**మహాగౌరీ శుభం దద్యాత్ మహాదేవ ప్రమోదదా**

నిర్మలమైన శ్వేత వర్ణంతో ప్రకాశిస్తూ, శ్వేత వస్త్రాలు ధరించి, మహాదేవుని నేత్రాలకు, మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తూ తెల్లని వృషభ వాహనంపై ఆసీనురాలై విరాజిల్లుతున్న మహాగౌరి మాకు శుభాలను ప్రసాదించుగాక అని ఈ శ్లోక భావం.

సమస్త మంగళాలకు అధిష్ఠాత్రి మహాగౌరి. అందుకే మంగళ గౌరి అని మహాగౌరి అని ఆరాధిస్తున్నారు.

మార్కండేయ పురాణాంతర్గత 'దేవీ మాహాత్మ్యం'లో మహామంత్రంగా ప్రసిద్ధి పొందిన ఈ శ్లోకం మహిళామణుల మనోఫలకాలపై ఈనాటికీ నర్తిస్తూనే ఉంది. అది

**సర్వ మంగళ మాంగళ్యే శివే సర్వార్థ సాధకే**
**శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణి నమోస్తుతే**

సర్వ మంగళ (సమస్త మంగళాలకు నెలవైన), మాంగళ్యే (మంగళ రూపిణీ), శివే (శివుని పత్నీ), సర్వార్థ సాధికే (కార్యసిద్ధినీ), త్ర్యంబకే (సకల జీవరాసులకు శరణునీ, అభయాన్ని, ఆశ్రయాన్ని ప్రసాదించే గౌరి, నారాయణి (విష్ణు సహోదరి) నీకు నమస్కరిస్తున్నాను. అని దీని భావం. గౌరి రూపంలో వ్యక్తమవుతున్న పరాశక్తి తత్త్వమంతా ఈ శ్లోకంలో నిబద్ధించబడింది.

'గౌ' అనే శబ్దానికి స్వర్గం, కిరణం, వాక్కు, భూమి, జలము, దృష్టి అని చాలా అర్థాలున్నాయి. తాను ప్రకాశిస్తూ లోకాలకు వెలుగునిచ్చేది మహాగౌరి. గౌరిని గీర్వాణిగా చెప్పారు పండితులు. ఆమె శబ్ద బ్రహ్మ స్వరూపిణి, దేవతలకు జ్ఞానాన్ని ఇచ్చింది గౌరీ దేవియే. ఉమాదేవిగా ఇంద్రునికి బ్రహ్మ విద్యను ప్రసాదించిన తల్లి. భవానిగా ప్రసిద్ధి పొందిన ఈమెను ఆరాధిస్తే ఇహలోక భోగాలు అనంతంగా ప్రసాదిస్తుందని శాస్త్రాలు అంటున్నాయి. గౌరీదేవిని గృహిణీత్వానికి, మాంగళ్య భాగ్యానికి, సంతాన భాగ్యానికి కుటుంబ క్షేమానికీ కూడా ప్రతీకగా కారుణ్యమూర్తిగా వర్ణిస్తారు.

పరమశివుని పత్నిగా, గజానన, షడాననుల తల్లిగా, కైలాస అధిష్ఠాత్రిగా, విశ్వ కుటుంబానికి మాతగా ఆమెను పేర్కొంటారు. ఆ కారణంతోనే ఆదిశంకరులు '**మాతాచ పార్వతీదేవీ, పితాదేవో మహేశ్వరః**' అని స్తుతించారు. ఆదిదంపతులుగా కీర్తింపబడ్డారు. పార్వతీ పరమేశ్వరులను వాగర్థాలతో పోల్చాడు కాళిదాస మహాకవి. అంటే వాక్కు, అర్థం మాదిరి వారిది విడదీయరాని

# చింతన

బంధమని ఆయన ఉద్దేశం. పాతివ్రత్యానికీ, పరమ పవిత్రతకీ, మాంగళ్య శక్తికీ ప్రతీక గౌరీదేవి. క్షీర సాగర మథన సమయంలో శివుడు హాలాహలం మింగడానికి సంసిద్ధమైన తరుణంలో ఆమె మాంగళ్యశక్తిని పోతన గారు తమ భాగవతంలో అద్భుతంగా వర్ణించారు. అది తెలియనివారుండరు. అది గౌరి మాంగల్య ప్రభావమే. లలితా సహస్రంలో '**కామేశ బద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధర**' అనే నామం ప్రత్యేకంగా ఆమె మాంగళ్యాన్ని ప్రస్తావించినది.

మంగళప్రదమైన గౌరీదేవిని ఉత్తముడైన భర్త కోసం కన్యలు పూజిస్తారు. ఇతిహాస పురాణాలలో ఇందుకు సంబంధించిన కథలున్నాయి. శ్రీరామునిపతిగా పొందేందుకు సీతాదేవి, శ్రీకృష్ణుని వివాహం చేసుకునేందుకు రుక్మిణీ దేవి గౌరీ పూజ నిర్వహించారని కథలున్నాయి. మహాభాగవతంలో పోతనామాత్యుడు, ఆదిదంపతులను రుక్మిణీ దేవి నమ్ముకున్న వైనాన్ని కడు రమ్యంగా వర్ణించారు.

**నమ్మితి నా మనంబున సనాతనులైన**
**యుమామహేశులన్**
**మిమ్ము బురాణ దంపతుల మేలు భజింతు గదమ్మ**
**మేటి పె**
**ద్దమ్మ దయాంబురాశివి గదమ్మ**
**హరింబతిజేయుమమ్మ నిన్**
**నమ్మిన వారి కెన్నటికినాశము లేదు గదమ్మ యీశ్వరీ**

గౌరీదేవి అంతటి మహిమాన్వితురాలైనందున నూతన వధువు చేత వివాహానికి ముందు గౌరీ పూజ చేయిస్తారు. వివాహానంతరం తొలి ఏడాదిలో మాంగళ్య శక్తి కోసం, సత్సంతానం కోసం శ్రావణ మంగళవారాలలో మంగళ గౌరీ వ్రతం చేయిస్తారు.

జ్యోతిష్యశాస్త్ర రీత్యా నవగ్రహాలలో చంద్రునికి అధిదేవత గౌరీదేవి. గౌరిని పూజిస్తే చంద్రగ్రహం వల్ల సంభవించే దోషాలు నివృత్తవుతాయంటుంది జ్యోతిష శాస్త్రం.

ఏ. సీతారామారావు

## నేటి అవతారం

# దుర్గాదేవి



"దుర్గాం దేవీం శరణమహం ప్రపద్యే" అని శృతి వాక్యం. సూర్యభగవానుని శివ, విష్ణు, బ్రహ్మరూపాలుగా చెప్పుకున్నాం. త్రిమూర్తి స్వరూపుడైన ఈ శివుడే 'యజ్ఞరూపుడు'. యజ్ఞంతో మూడు లోకాలు అనగా మూడు భువనాలు నిర్మించబడతాయి. ఈవిధంగా మూడు భువనాలను సృష్టించి, రక్షించి, సంహరించే పరమాత్మ శక్తినే దుర్గ లేదా భువనేశ్వరి అని అంటారు.

శుంభ, నిశుంభ అను రాక్షసులను సంహరించుటకు వచ్చిన దేవిని 'దుర్గ' అని అంటారు. శుంభుడు అనగా కామము, నిశుంభుడు అనగా క్రోధము. శరీరంలోని ప్రతీ భాగము కదిలించే శక్తి 'శుం' అనే దాన్ని ఉత్తేజపరిచేవాడు శుంభుడు. కామశక్తిని అణిచి పెట్టి ఉద్వేగాన్నిచ్చేది క్రోధము దీనిని ఉత్తేజపరిచేవాడు 'నిశుంభుడు'. శుంభనిశుంభులు కూడా జగన్మాత సౌందర్యాన్ని చూసి మోహించారు. ఆమె మందలిస్తే కోపించిన వారివురిని సంహరించింది 'దుర్గ'. ఈమెకు వాహనం వ్యాఘ్రం. వ్యాఘ్రము అనగా విశేషంగా ఆఘ్రాణించేది. మనకు కోరికలు, క్రోధము అనేవి పూర్వజన్మ వాసనను బట్టి వస్తాయి. ఆ వాసనను అధిష్టించి జీవుల కామక్రోధాలను నియంత్రించి పరమాత్మ యందు భక్తిని, మోక్షము నందు ఆనందాన్ని కలిగించేది దుర్గ. భాగవతంలో శ్రీకృష్ణావతార సమయంలో నారాయణుడు యోగమాయతో యశోదకు పుత్రికగా జన్మించి మధురకు వచ్చి కంసుడికి బుద్ధి చెప్పి పన్నెండు నామాలతో అందరిచే పూజింపబడ్డాడు. అలా అవతరించిన యోగమాయనే దుర్గ. నారాయణి, కాత్యాయని, శివ, చండీ త్రయంబిక మొదలగు నామాలతో పూజింపబడే తల్లి కూడా దుర్గే. "విద్యాందేహి శ్రియందేహి జ్ఞానం దేహి" అనగా క్రామక్రోధాలను, అహంకారాలని అణిచి జ్ఞానాన్ని ప్రకాశింపచేసేది దుర్గ.

**"యాదేవీ సర్వభూతేషు జ్ఞానరూపేణ సంస్థితాః**
**నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః"**

అని దుర్గా స్తుతి. ఈ అమ్మ దుర్గా అష్టమి నాడు అవతరించినది కావున ఆ రోజు దుర్గాష్టమిగా ప్రసిద్ధి. దుర్గాదేవి నక్షత్రం పూర్వాషాఢతో కూడి ఉన్న ఉత్తరాషాఢ కావున ఆ అమ్మను

**ఆషాఢ ద్వయ సంభూతా వ్యాఘ్రవాహ మహేశ్వరీ**
**త్రిశూల ఖడ్గ హస్తాచ దుర్గాదేవీ నమోస్తుతే ॥**

దుర్గాదేవినే భువనేశ్వరీ దేవిగా కూడా సేవిస్తారు.

దుర్గాదేవికి ప్రియమైన నైవేద్యం పాయసం

## రేపటి అవతారం

# మహిషాసుర మర్దిని



మహిషాసురుడు ఘోరమైన తపస్సు చేసి మరణము లేని వరము కోరాడు. పుట్టిన వారు గిట్టక తప్పదు కావున మరో వరం కోరుకోమని బ్రహ్మ సూచించగా పదహారు నుండి ఇరవైనాలుగు సంవత్సరాలలోపు వయస్సు ఉన్న యువతి చేతిలోనే మరణాన్ని కోరుకున్నాడు. తన బల పరాక్రమాల ముందు స్త్రీ ఎంతన్న చులకన భావంతోనే ఈ వరం కోరుకున్నాడు. అతనిని వధించడానికే జగన్మాత అవతరించింది. జగన్మాతను వక్ర దృష్టితో చూడటం వలన రక్తబీజుడు, శుంభ, నిశుంభులు ఇలా అనేక మంది అసురులు సంహరింపబడిన అనంతరం మహిషాసురుడు అమ్మతో యుద్ధం చేసి వధించబడ్డాడు. మహిషాసురుడిని వధించిన తల్లి మహిషాసురమర్దిని. 'మహి' అనగా భూమి మీద, 'షా' అనగా ఉండువాడు. అంటే మహిషాసురుడు అనగా భూమి మీద ఉండువాడు. తమోగుణ భూయిష్ఠమైన ఈ భూమి మీద ఉండేవారు పూర్తిగా ఆ గుణాన్ని అలవర్చుకున్నవారు. తమోగుణ లక్షణాలైన నిద్ర, తంద్ర (సోమరితనం), భయం, క్రోధం, ఆలస్యం వంటి వాటిని సంహరించేది తల్లి. ఇవి కోరికలతో నాలుగు, కోపంతో మూడు, లోభంతో మూడు దోషాలు. ఈ విధంగా మొత్తం పది దోషాలు అనగా పది పాపాలు. ఈ పది పాపాలు కలవాడు మహిషాసురుడు.

మనస్సుతో మూడు, శరీరంతో నాలుగు, వాక్కుతో మూడు కలిపి పది తప్పులు కూడా పది పాపాలే. ఈ పది పాపాలను హరించుట అనే పండుగను 'దశహరా' అంటాం. 'దశ' అనగా పది 'హరా'అనగా తొలగించేది అని అర్థం. పదిపాపాలు, పది దోషాలు కలిగిన ప్రతీ వ్యక్తి మహిషాసురుడే. మనలోని పదిపాపాలను తొలగించేది బుద్ధి, ఆ బుద్ధినే మహిషాసురమర్దిని, దశహరి అని అంటారు. ఆ బుద్ధిని, బుద్ధిరూపంలో ఉన్న జగన్మాతను మహిషాసురమర్దినిగా పూజించే దినమును 'దశహరా'గా వ్యవహరిస్తారు. దీనినే వాడుక భాషలో 'దసరా'గా పేర్కొంటారు. ఆనాడు మంచి బుద్ధితో తల్లిదండ్రులను పూజించి పదిమందికి మంచిని పంచాలి.

మహిషాసుర మర్దినికి ప్రియమైన నైవేద్యం దోశలు, బూరెలు, ఆవ నూనెతో పులిహోర.



డా॥ కందాడై రామానుజాచార్య

# బ్రహ్మోత్సవ సంరంభం

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారు నేడు సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపైన, రేపు రథంపైన, అశ్వవాహనంపైన భక్తులకు కనువిందు చేస్తారు.



సూర్యప్రభ వాహనం



చంద్రప్రభ వాహనం



రథం



అశ్వవాహనం

epaper.prabhanews.com



# సంస్కృతి

## మన సంప్రదాయ పండుగల్లో

# బొమ్మల కొలువు



పండుగ రోజుల్లో ఏర్పాటు చేసే బొమ్మల కొలువులు పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయటమే కాదు, పెద్దలు వివిధ పురాణ పాత్రలను, చారిత్రక సంఘటనలను పిల్లలకు సోదాహరణంగా వివరించటానికి ఉపకరించే చక్కని సాధనాలు కూడా! బొమ్మల కొలువుకు బంధుమిత్రులను ఆహ్వానించి వారికి చందన తాంబూలాలు ఇవ్వటం ఆనవాయితీ. దీని వల్ల మానవ సంబంధాలు బలపడతాయి.

అసలు ఈ ప్రపంచమే ఒకపెద్ద బొమ్మల కొలువు. మనమంతా ఆ దేవుడు చేసిన బొమ్మలం. చిన్న, పెద్ద, ధనిక, పేద తారతమ్యాలతో, విభిన్న వేషధారణలతో సంస్కృతులతో - మెట్లు, మెట్లుగా విశ్వ వేదికపైన కొలువుదీర్చబడిన రంగు రంగుల బొమ్మలు ఈ మనుషులు. ఎన్ని వైరుధ్యాలు, వ్యత్యాసాలు ఉన్నా అందరూ సహజీవనం చేస్తూ కలిసి ఉండడమే వసుధైక కుటుంబ లక్ష్యం పండుగ రోజుల్లో మనం పెట్టే బొమ్మల కొలువుల్లో ఈ సత్యమే అంతర్లీనంగా ఉంటుంది.

అంతే కాదు. దీనికి మరో పార్శ్వం కూడా ఉంది. ఘనమైన మన సాంస్కృతిక వారసత్వాన్ని ముందు తరాలకు కొనసాగించటం, మన సంప్రదాయాలను ఇతర దేశాల వారికి పరిచయం చేయటం కూడా బొమ్మల కొలువుల ఉద్దేశం (ప్రవాస భారతీయులు విదేశాల్లో చేస్తున్న వేడుకలే ఇందుకు నిదర్శనం.)

మన సంస్కృతి, సాంప్రదాయాల్లో పండుగలు ముఖ్య భూమిక పోషిస్తే, ఆ వేడుకలను మరింత శోభాయమానం చేసేవి బొమ్మలు. శ్రావణ మాసంలో వచ్చే వరలక్ష్మీ వ్రతంలో పూజలు అందుకొనే అమ్మవారి ప్రతిమను ఇంట్లో లభ్యమయ్యే వస్తువులతో తయారు చేసి, అలంకరిస్తారు మన ఆడపడుచులు. గణేశ చతుర్థి నాడు బొజ్జ గణపయ్యను మట్టితో తయారు చేసే పద్ధతి ప్రతి కుటుంబంలోనూ ఉండేది (ఇప్పుడంటే మార్కెట్లో దొరికే రంగు రంగుల వినాయకుడి ప్రతిమలు కొంటున్నారు.) ఇక కార్తీక మాసంలో శివుని మృత్తికా లింగాలను చేయటం, ప్రతి పూజ లోనూ, వ్రతంలోనూ పసుపుతో గణపతిని చేసి అర్చించడం తెలిసిందే. ఇవన్నీ మనలో ఆధ్యాత్మిక చింతనను పెంచుతూనే మనలోని సృజనాత్మక శక్తిని వెలికి తీస్తాయి. ఇవేకాకుండా రకరకాల బొమ్మలను కళాత్మకంగా కొలువు తీర్చి కొలిచే పద్ధతి తెలుగు వారిలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో సంక్రాంతి పండుగ మూడు రోజులు, మరికొన్ని ప్రాంతాల్లో దేవీ నవరాత్రులు జరుపుకునే తొమ్మిది రోజులు బొమ్మల కొలువులు పెడతారు. సంక్రాంతి బొమ్మల్లో పౌష్య లక్ష్మికి ప్రాధాన్యం ఇస్తే, దసరా నవరాత్రుల్లో అమ్మ వారి తొమ్మిది అలంకారాలకు ప్రాధాన్యం ఇస్తారు.

దేవీ నవరాత్రుల్లో పెట్టే బొమ్మల కొలువు వెనుక ఆసక్తికరమైన పురాణ గాథ ఒకటి ప్రచారంలో ఉంది. పూర్వం మహాలయ పక్షాల రోజుల్లో దేవ, దానవ సంగ్రామం జరిగింది. ఆ యుద్ధంలో దేవతల బలం క్షీణించి, పరాజయం పాలయ్యారు. అప్పుడు ఆ దేవతలు తమకు శక్తిని ప్రసాదించమని జగదాంబను వేడుకుంటారు. ఆ జగన్మాత దేవతలకు అవసరమైన ఆయుధ సంపత్తిని ప్రసాదించి, దేవతల భార్యలకు బొమ్మలు ఇస్తుంది. దేవతలు యుద్ధం చేస్తుంటే వారి భార్యలు జగదాంబ ప్రసాదించిన బొమ్మలను కొలువు తీర్చి పూజిస్తారు. ఫలితంగా దేవతలు యుద్ధంలో విజేతలుగా నిలుస్తారు. అప్పటి నుంచి దసరా బొమ్మల కొలువు మొదలైందని చెపుతారు.

బొమ్మల కొలువులో బొమ్మలను మెట్లు మెట్లుగా కొలువు తీర్చడంలో ఒక ప్రత్యేకమైన పద్ధతి ఉంది. మెట్లు మూడు, ఐదు, ఏడు, తొమ్మిదిగా బేసి సంఖ్యలో ఉంటాయి. సరి సంఖ్యలో మెట్లు పెట్టకూడదు. సాధారణంగా పెద్ద బొమ్మలు (ఇవి దేవుడివే అయి ఉంటాయి) పై మెట్ల మీద పెట్టి, తరువాత బొమ్మల పరిమాణాన్ని బట్టి క్రింద మెట్ల మీద ఉంచుతారు. ఇలా కొలువు తీర్చే బొమ్మలు సత్వ, రజో, తమో గుణాలను కలిగించేవిగా ఉంటాయి. పై మెట్టు మీద దేవతల బొమ్మలు, తరువాతి మెట్ల మీద పురాణ ఘట్టాలు. రాజులు, నాయకులు. ఆ తరువాత వివిధ వృత్తులు చేసే వారి బొమ్మలు, కుటుంబ బాంధవ్యాలను ప్రతిబింబించే బొమ్మలు, గృహోపకరణాల బొమ్మలు, దిగువ మెట్ల మీద జంతువులు, పక్షుల బొమ్మలు, చెట్లు, పూలతో నిండిన ఉద్యానవనాల ప్రతిరూపాలు ఉంచుతారు. కొన్ని చోట్ల ఏకంగా థీమ్ పార్క్ లు కూడా బొమ్మల కొలువులో చేర్చుతున్నారు. కొలువు తీర్చే బొమ్మలు ఇంతకు ముందు కొని దాచినవే అయి ఉంటాయి. కానీ ప్రతి సంవత్సరం కనీసం ఒక కొత్త బొమ్మ అయినా కొలువులో చేర్చాలి. బొమ్మల కొలువులో తీర్చే బొమ్మలన్నీ ఎక్కువగా మట్టితోనో, కొయ్యతోనో చేసి, రంగులు వేసినవే అయి ఉంటాయి. నిజానికి ఇవి



పర్యావరణ హితమైనవి కూడా! వీటితోపాటు మన తెలుగు రాష్ట్రాలకే గర్వకారణమైన కొండపల్లి, ఏటికొప్పాక, నిర్మల్ బొమ్మలను కూడా అలంకరించడం చూడవచ్చు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ప్లాస్టిక్ బొమ్మలు, ప్లాస్టరాఫ్ పారిస్ బొమ్మలు హానికరమైన రంగుల బొమ్మలు మన ఇళ్ళల్లో కొలువు తీరుతున్నాయి. బొమ్మలు కొనేటప్పుడు సాధ్యమైనంత వరకు సంప్రదాయ పద్ధతిలో చేసిన బొమ్మలనే కొనాలి. వినాయక చవితి మంటపానికి పాలవెల్లి కట్టినట్లే, బొమ్మల కొలువును కూడా పాలవెల్లితో అలంకరిస్తారు ఇక్కడ పాలవెల్లి కి పూలతో పాటుగా, వివిధ రకాల కూరగాయలను కూడా కట్టి వ్రేలాడ దీస్తారు. ఉద్వాసన చెప్పిన తర్వాత వీటిని వంటలలో వినియోగిస్తారు.

బొమ్మలు కొలువు తీర్చటమంటే ఒక రకంగా దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించినట్లే! ఒకసారి బొమ్మలు పెట్టాక, వాటిని ఎప్పుడుపడితే అప్పుడు తాకకూడదు. శుచి, శుభ్రత పాటించి రెండు పూటలా అమ్మవారిని అర్చించి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించాలి. ఇలా బొమ్మలకు ఉద్వాసన చెప్పే వరకూ ఈ నియమం పాటించాలి. సాధారణంగా ఆడపిల్లలు ఉన్న కుటుంబాలలో బొమ్మల కొలువు వేడుకగా జరుపుకుంటారు. దేవీ నవరాత్రులలో అమ్మ వారిని బాల రూపంలో (ఆడపిల్లలను అమ్మ వారి రూపంగా భావించి, వయసుల వారీగా తొమ్మిది రోజులు బాల పూజ చేయటం) కొలవటం దసరా బొమ్మల కొలువులో ప్రత్యేక సంప్రదాయం. అయితే నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఇలాంటి సంప్రదాయాలు తమ ఉనికిని కోల్పోతున్నాయి. పండుగ రోజుల్లో ఏర్పాటు చేసే బొమ్మల కొలువులు పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయటమే కాదు, పెద్దలు వివిధ పురాణ పాత్రలను, చారిత్రక సంఘటనలను పిల్లలకు సోదాహరణంగా వివరించటానికి ఉపకరించే చక్కని సాధనాలు కూడా! బొమ్మల కొలువుకు బంధుమిత్రులను ఆహ్వానించి వారికి చందన తాంబూలాలు ఇవ్వటం ఆనవాయితీ. దీని వల్ల మానవ సంబంధాలు బలపడతాయి. మరుగున పడిపోతున్న మన సాంప్రదాయక కళలు, సంస్కృతి పట్ల ఈ మధ్య కాలంలో మళ్ళీ ఆసక్తి కలగటం ముదావహం. శ్రీరామ నవమి, గణేష్ చతుర్థి ఉత్సవాలు సామూహికంగా నిర్వహిస్తున్నట్లే - సంక్రాంతి, దసరా లాంటి పండుగ రోజుల్లో సామూహిక బొమ్మల కొలువులు పెట్టటం కొన్ని కాలనీల్లో, అపార్ట్మెంట్ల్లో మొదలైంది. ఇది ఆహ్వానించదగ్గ శుభ పరిణామం.

**- బలభద్రపాత్రుని ఉదయ శంకర్**
**9494536524**

# జానపద కళారూపం తప్పెట్లు



తప్పెట లేక డప్పు ఒక వాయిద్య విశేషం. నిమ్న జాతుల్లో 'మాదిగ వగైరా ఉపకులాలకి చెందిన వారు అనాదిఆ కాలం నుంచీ ఈ సంగీత వాద్య విశేషాన్ని కులపరమైన సాధనంగా ఉపయోగిస్తున్నారు. కడప జిల్లాలోనున్న వల్లూరు మండలంలో 'తప్పెట్ల' అనే పేరుగల ఒక గ్రామం కూడా ఉన్నది. అదే విధంగా తప్పెట్ల వాయిద్యంలో ఉపయోగించే ''తుడుము'' పేరుతో ఖాజీపేట మండలంలో ''తుడుముల దిన్నె'' అనే ఊరు వుండటం విశేషం. ఒక వాయిద్యం పేరుతో ఇంటిపేర్లు/గ్రామాల పేర్లు ఉండటం గొప్పంటే/గొప్పేం కాకపోవచ్చు. కడప, చెన్నూరు, మెడమీద పల్లె, కమలాపురం, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ఈ ఇంటి పేర్లు ఉన్నవారు ఎక్కువగానే కనిపిస్తారు. తెలంగాణాలో కూడా ఈ వాద్యాన్ని వాయించే అదే కులానికి చెందిన వారున్నారు. అలాగని వారిలో విద్యాధికులు, ఉన్నతోద్యోగులు లేకపోలేదు. కోస్తాంధ్రలో ''మద్దెల'' ఇంటిపేర్లు ఉన్నవారున్నారు. వాయిద్య విశేషాలతో ఇంటిపేర్లుండటం తప్పేంకాదు.

దరువు కొట్టడం, పలకలు వాయించడం, తప్పెట్లు వాయించడం (డప్పులు మోగించడం) యిలా పలు పేర్లతో ఈ బృంద వృత్యాసాన్ని వ్యవహరిస్తుంటారు. కేవలం పురుషులకే పరిమితమైన, అభ్యాసయోగ్యమైన ఈ కళ యావదాంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలోను ప్రచారంలో ఉన్న ది. ఇటీవలి కాలంలో అక్కడక్కడ అరుదుగా మహిళలు కూడా డప్పులు వాయిస్తుండటం గమనించాల్సిన అంశం. ఈ ''తప్పెట్ల''కు గల సాంస్కృతిక నేపథ్యం గురించి పరిశీలిద్దాం! ''డప్పు'' అనే ఒక గుండ్రని ఆకారం లో గల డోలు వంటి పరికరం. ఇది ఒక చర్మ వాయిద్యం. మేక చర్మం గాని, గొర్రెపొట్టేలు చర్మంగాని ఒక గుండ్రని చట్రంలో బిగించి దీనిని తయారు చేస్తుంటారు. ఈ వాయిద్యాన్ని వేడి చేసి వాయిస్తే మోత బాగా మోగుతుంది. ఇంకా వివరాల్లోకి మనం వెళ్లినట్లైతే ''తప్పెట'' అనగా గుండ్రని ఆకారంలో డోలు వంటి పరికరం అని చెప్పుకున్నాం కదా! ఈ వాయిద్యం నుంచి వెలువడే శబ్దం అందర్ని ఆకర్షిస్తుంది. గ్రామాలలో చాటింపువేసేటప్పుడు ప్రజలు ఆశ్చర్యంగా ఇండ్లలోంచి బైటికొచ్చి వీధుల్లో వేస్తున్న దండోరాను శ్రద్ధతో వింటారు. ప్రభుత్వ ఉత్తర్వులు గాని, ప్రజా సంబంధింత విషయాలుగాని, వేలం పాటలు గాని, హెచ్చరికలు గాని, ప్రచారం చేయగలందులకు ఈ డప్పు మోగిస్తూ చెబుతారు. ముఖ్యంగా రచ్చబండ దగ్గర ఎక్కువగా ఈ దండోరా వేస్తారు. సామాన్యంగా ఒక వ్యక్తి మాత్రమే దండోరా వేస్తాడు. డప్పు కొట్టడం ఆపిన పిదప విషయాన్ని బిగ్గరగా చదువుతూ అందరికీ వినిపిస్తారు. ''ఇందుమూలంగా గ్రామ ప్రజలు యావన్మందికీ తెలియజేయునదేమనగా... మన నాగుల చెరువు చుట్టూ ఉన్న గడ్డికొబ్బరి దానిలోనున్న చేపలు వేలం పాట పాడుతున్నారు. కాబట్టి పాడదల్చుకున్నవారు సాయంత్రం నాలుగున్నర గంటలకు ఊరి పంచాయితీ కార్యాలయం దగ్గరకు రావలసిందంటూ వీధులన్నీ తిరుగుతూ డప్పు కొడుతూ ''డముకు'' వేస్తాడు. అధికంగా ప్రభుత్వ పథకాల ప్రచారం, ప్రభుత్వ ఉత్తర్వులు, సకాలంలో పన్నుల చెల్లింపులు, ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించిన హెచ్చరికలు తెలియజేయడం, రేషన్ సరుకులు ఇస్తున్నారన్న భోగట్టా తెలపడం వంటివీ తెలియపరచగలందులకు ఈ డప్పు వాయిద్యం విశేషంగా ఉపయోగపడుతుంది. ''గ్రామీణ సమాజానికి వాళ్ళకు చిరపరిచితమైన కళల ద్వారానే ప్రచారం సాగించడం ఉచితమే... అని ఆచార్య నాయని కృష్ణకుమారి గారి అభిప్రాయం.

దీని ప్రదర్శనా నిర్మాణ నేపథ్యం గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం! ''డప్పులను 'తప్పెటగతులు', 'తప్పెటగుళ్లు'' అనే పేర్లతో సమిష్టి కళారూపంగా ప్రదర్శిస్తారు. ఒకే కళారూపం వ్యష్టిగా మరియు సమిష్టిగా ప్రదర్శించే కొన్ని కళారూపాల్లో ఇది ఒకటి. ఈ కళారూపం నేటికీ గొప్ప వినోద సాధనంగా గ్రామీణులే కాకుండా పట్టణ ప్రజలూ విశేషంగా ఆదరిస్తున్నారు. ప్రతి శుభ-అశుభ కార్యాలకు ఇది తప్పనిసరిగా ఉపయోగించడం మనం చూస్తున్నాం! నరనరాల్లో కొత్తదైన ఉత్తేజాన్ని రేకెత్తించే ఈ వాయిద్య ధ్వని వింటే ప్రతి మనిషిలో కూడా కొద్దోగొప్పో చైతన్యం కలుగకమానదు. చాలమంది ఈ శబ్దానికి అనుగుణంగా (దరువు) తమకు తెలియకుండానే అడుగులు (చిందులు) వేస్తుంటారు. పైగా ఈ తప్పెటకు చర్మంతో చేసిన ''బెల్టు'' ఉంటుంది. దానిని కళాకారులు మెడలో వేసుకుని చంక మధ్యలో కుదురుగా డప్పును అమర్చుకుంటారు. ఆ తప్పెటను రెండు దబ్బల (కర్రముక్కలు) సహాయంతో క్రమపద్ధతిలో వాయిస్తారు. ఒకటి వెదురుదబ్బతో తయారు చేసిన సన్నని కర్రముక్క. రెండోది కొద్దిగా లావుగా సన్నని రూళ్లకర్ర మాదిరిగా ఉంటుంది. రెండు చేతులతో ''జగ్‌లకన్''జతితో వాయిద్యాన్ని ప్రారంభిస్తారు. దీనిని 'కోపులు' అని పిలుస్తారు. 1-2-3-4-5 మొదలైనటువంటి అడుగుల పేర్లతో ఈ కోపులు ప్రసిద్ధి చెందాయి. రాయలసీమ జిల్లాయైన కడపలో 'దండువారి కోపు, పులి అడుగు, గుండం కోపు, మదివి కోపు- మొదలైనవి ప్రసిద్ధమైన జతులు. ఇంకా యిదే జిల్లాలో పలు ప్రాంతాలలో ఈ కళాబృందాలు ఉండటం విశేషం. అయితే ఖాజీపేట మండలం ''దుంపలగట్టు'' గ్రామానికి చెందిన బృందానికి మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఈ డప్పు వాయిద్య కళలో గురువు ప్రాధాన్యాన్ని గురించి చెప్పుకుందాం! భజన బృందాలలో గురువువలె దీనిలోనూ గురువు వుండి ప్రత్యేక శిక్షణ ద్వారా కళా బృందాలను తయారు చేస్తాడు. శిక్షణ పూర్తియైన కళాకారులు ఆయనకు గురుదక్షిణ సమర్పించుకోవడం అనవాయితీ. తీరిక సమయాలలో పనిపాటలు లేని సందర్భాలప్పుడు రాత్రిపుట మాత్రమే ఈ శిక్షణ ఉంటుంది. కళారూపాన్ని ప్రదర్శించేటప్పుడు ఎక్కువ అనుభవం ఉన్న వ్యక్తినే మిగితా బృందం సభ్యులు అనుసరిస్తుంటారు. అతగాడు చేసే హెచ్చరికల ద్వారా ఏ ఒక్కరైనా వరస తప్పినప్పుడు వెంటనే జతులను సవరించుకుంటారు.

ఈ కళా ప్రదర్శన వివరాల్లోకి వెళితే నేటి రాకెట్ యుగంలో కళాకారుల వేషధారణలో కొంత మార్పు రావడం జరిగినది. ప్రోత్సాహం, ఆదరణ పెరిగే కొద్దీ కళాకారులు ఒకే రంగు దుస్తువులు (యూనిఫాం) ధరిస్తున్నారు. సైకిల్ కట్టులాగ కట్టుకుని, కాళ్లకు గజ్జెలు ధరించి, తలకు ఎర్రటిపాగలు చుట్టుకుంటారు. మెడలో అలంకారంగా పూసల దండలు వేసుకుంటారు. ఈ కళాప్రదర్శనలో పది నుంచి పదిహేను వరకు సభ్యులు పాల్గొంటారు. ప్రదర్శనకు ముందుగా చెత్త గడ్డితో మంటలేసి, ఆ సెగ లోపల డప్పుకు ''కాక'' పెట్టుకుంటారు. పలకలను కాలివేళ్లపైన పెట్టుకుని ప్రదర్శనకు సిద్ధమౌతారు.

తొలి బృందం సభ్యులు ఒకరి వెనుక ఇంకొకరు డప్పులు వాయిస్తూ వేదికపైకి ప్రవేశిస్తారు. అటుపిమ్మట వృతాకారంలో నిలబడతారు. ఇలా నిలబడేటప్పుడు. జతి ఆదితాళం జామ్‌తక చప్పుడుతో నాలుగు అడుగులను రెండు పర్యాయాలు వేస్తారు. అనగా మొత్తం ఎనిమిది అడుగుల్లో నృత్యం కొనసాగుతుంది. తరువాత ఎదురెదురు వరుస లో నిలబడి ముందు వెనుకకు కదులుతూ నృత్యం చేస్తారు. రెండు వరుసల్లో వృత్తాకారం లోపల ఒక వరుస, బయట ఒక వరుస నిలబడి తమతమ విన్యాసాలతో వరుసలన్ని మార్చుకుంటూ నృత్యం చేస్తారు. కూర్చుని చేసే వరుసలో ఒకేసారి అందరూ గుండ్రంగా తిరుగుతూ చిందు మాదిరిగా అడుగులు కలుపుతారు. సందర్శకులను ఈ దృశ్యం ఎంతగానో ఆకట్టుకుంటుంది. చివర్లో పిరమిడ్ విన్యాసాలు ప్రదర్శిస్తారు. మొదటి ఆరుగురు కళాకారులు నిలుచుంటారు. వారి భుజాలపైన ముగ్గురు కళాకారులు వారిపైన ఇద్దరు, వారిపైన ఒకరు నిలబడి ''జాంజాంజాం'', ''జగ్‌లకన్'', ''జగ్‌లకన్'' జతలతో తప్పెట్లు మార్మోగించడంతో ప్రదర్శన పరిసమాప్తమౌతుంది.

కొన్ని ఇతర కళారూపాల ప్రదర్శనకు కూడా ఈ వాయిద్యం తప్పని సరి. కర్రసాము, కత్తిసాము, కీలుగుర్రం, పులివేశం, నామాల సింగడు, కవ్వాయి కట్టేలు, చక్క భజన, కోలాటం, విచిత్ర వేషాలు, గరగల ఊరేగింపు వగైరా రూపాల ప్రదర్శనలో ఈ వాయిద్యం (తప్పెట) ప్రేక్షకులను ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది. పండుగలు, జాతర్లు, ఊరేగింపులు, ఉత్సావాలు మొదలైన వాటిలో ఈ కళారూపం ప్రాధ్యానం తప్పక ఉంటుంది. ఇంకా వివిధ ప్రజా ఉద్యమాలో ప్రజలను చైతన్య పరచగలందులకు డప్పుల సహాయంతో ఉద్యమ గీతాలను ఆలపిస్తూ, నర్తిస్తూ ప్రచార సాధనంగా వాడుతుంటారు. సంగీతం, నృత్యం, సాహిత్యంతో కలిసి సమూహిక కళగా రూపాంతరం చెందినది వాయిద్యం. ప్రాచీన కళారూపాలలో ఈ తప్పెట్లు కూడా ఒకటి.

**- డా. మంతెన సూర్యనారాయణ రాజు**

# జైనమతంలో విగ్రహారాధన?

జైన మతం తన సిద్ధాంతాల వ్యాప్తికై కళలను పూర్తిగా ఉపయోగించుకున్నది. శిల్పకళ, చిత్రకళ, చిత్రలేఖనం జైనమత సౌందర్యాన్ని చాటుతున్నాయి. క్రీ.శ. తొలి శతాబ్దంలో బౌద్ధుల మాదిరిగానే జైనులు కూడా తమ మతాచార్యుల గౌరవానికి గుర్తుగా, విగ్రహాలను స్తూపాలను నిర్మించారు. మధురలో అలాంటివి అనేక పూరాతత్వ అవశేషాలు బయల్పడ్డాయి. జైన తీర్థంకరులు 24 మందిని, ఇతర దేవతలను జైనులు పూజించారు. ఋషభదేవ (అధినాథ) జిత్‌నాథ, సంభవనాథ, అభినందన్, సుమతినాథ, ప్రద్మప్రభు, సుపార్శ్వ నాథ, చంద్రప్రభ, పుష్పదంత్, శీతలనాథ, శ్రేయాంసనాథ, పసుపూజ్య, విమలనాథ, అనంతనాథ, ధర్మనాథ, శాంతినాథ, కుంతినాథ, అరనాథ, మల్లనాథ, మునుసు వీరనాథ, నేమినాథ, అరిష్టనాథ, పార్శ్వనాథ, వర్ధమాన మహావీర్ వంటివారు జైనతీర్థంకరులుగా ప్రసిద్ధి చెందారు.



జైనులు విగ్రహారాధనను మౌర్య-శుంగ కాలం నుంచి చేస్తున్నారని తెలుస్తున్నది. మౌర్యులకంటే ముందు కూడ జైనులు విగ్రహారాధన ఉన్నట్లు కొందరు తెలుపుతారు. మగధ రాజైన నందుడు కళింగ (ఒరిస్సా) పై దండెత్తిన సందర్భంలో జైన విగ్రహాన్ని పాటలీపుత్రానికి తీసుకువచ్చాడని తర్వాత కాలంలో ఖారవేలుడు క్రీ.పూ. మొదటి శతాబ్దంలో మగధపై దండెత్తి ఆ విగ్రహాన్ని కళింగకు తెచ్చాడని హాథిగుంఫ శాసనం స్పష్టంగా తెలుపుతున్నది. ఒరిస్సాలో ఉదయగిరి, ఖండగిరి గుహలలో జైన శిల్పాలు కొన్ని ఉన్నాయి. పార్శ్వనాథుని జీవిత చరిత్ర ఉదయగిరి కొండమీద రాణి నురార్ గుహలో చెక్కబడ్డది. మధుర ప్రాంతంలో కూడ జైనులు విగ్రహారాధన చేశారనడానికి పురాతత్వ ఆధారాలున్నాయి. మొదటి తీర్థంకరుడైన అధినాథుని విగ్రహం, సింహాసనం పైన కనిష్కుని కాలంనాటి శాసనల్లో ఒకటి లభించింది. తొలిగుప్తుల కాలంనాటి సుందర జైన విగ్రహాలలో మహావీరుడు చెట్టుకింద యోగాసనంలో కూర్చున్న విగ్రహం ఒకటి. మైసూరులో శ్రావణ బెళగోళ ప్రాంతంలో కొండ శిఖరాగ్రం పైన 21.5 మీటర్ల ఎత్తైన బాహుబలిన్ లేక గోమతేశ్వర నిలుచున్న విగ్రహాన్ని గంగరాజు రాచమల్లుని మంత్రి చాముండరాయుడు క్రీ.శ. 984లో ప్రతిష్ఠించాడు. ఇది చాలా ప్రసిద్ధిమైన ఎత్తైన విగ్రహం.

జైనులు 'విద్యాదేవియన్' అనే స్త్రీ దేవతలను పూజిస్తారు. సరస్వతి విద్యకు అధిపతిగా పూజించడం ఉంది. మధ్యకాలం నాటి జైన దేవాలయాలలో ముఖ్యంగా రాజస్థాన్‌లో దిలావర్ (మౌంట్ అబు) మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయాలలో విద్యాదేవియన్ విగ్రహాలను మనం చూడవచ్చు. ఈ దేవతలేగాక దిక్పాలకులను, నవగ్రహాలను, అరవై నాలుగు యాగినులను, క్షేత్రపాల, లక్ష్మి తదితర దేవతలను జైనులు పూజింస్తుండేవారు. జైనుల తీర్థయాత్ర స్థలాలలో పార్శ్వనాథ కొండలు, పాతపురి రాజగిరి, పాలితానా, సోనాఘర్, కుందలాపూర్, బర్వని, ముక్తగిరి, రణక్‌పూర్, మౌంట్ అబు, శ్రావణ బెళగోళ మొదలైనవి ముఖ్యమైనవి. జైనమతం బౌద్ధమతం కంటే పురాతనమైనది. ఇది భారతదేశంలో ఒక ప్రాబల్యం గల మతం కాక పోయినప్పటికి, విదేశాలలో వ్యాపించినప్పటికి, ఈ దేశంలో ఒక వ్యవస్థితమైన శాఖగా రూపొందింది. ఇది సనాతన వైదిక మతానికి చాలా సన్నిహితంగా ఉండటం వల్ల, ఇతర మతాలలో విద్వేషం లేకుండటం వల్ల ఈ నాటికి జైన మతం మన దేశంలో అనేక ప్రాంతాలలో మనుగడ కొనసాగిస్తున్నది.

**- రమణ**

epaper.prabhanews.com


కాజల్ అగర్వాల్

# అమ్మాయిలకు నా సందేశం...

మనం చూసే దృష్టిలోనే అందం ఉంటుందని అంటోంది ముద్దుగుమ్మ కాజల్ అగర్వాల్. మనం ఎలా ఉన్నామో అలా స్వీకరించుకోవడమే స్వీయసౌందర్యమని చెబుతోంది. అందం విషయంలో మరొకరితో పోల్చుకోవడం తగదని ఈతరం అమ్మాయిలకు సందేశాన్నిస్తోంది. అందంగా కనిపించడం ముఖ్యమే కానీ అందుకు నానా హైరానా పడకండని చెబుతోంది. తెలుగు, తమిళంలో అగ్ర కథానాయకులందరితోనూ నటించింది కాజల్. వాణిజ్య విలువల చిత్రాలతో సాగిపోయినా...ప్రతిభ చూపించే పాత్రల్లో మెప్పించినా...అన్నింట్లో కాజల్ సమతూకమే చేసింది. తెరంగేట్రం చేసిన గత పన్నెండేళ్లలో యాభై చిత్రాలు పూర్తి చేసి వంద చిత్రాలకు పరుగులు పెడుతోంది. ప్రస్తుతం భారతీయుడు 2 లాంటి ప్రతిష్టాత్మక చిత్రంలో భాగమవుతోంది కాజల్. యువతకు ఓ మంచి మాట చెప్పాలని ఈ సుందరి మాట్లాడుతూ..అందం విషయంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేకమే. ఎవరి అందం వాళ్లకుంటుంది. వారిలా మరొకరు ఉండరు..అలాగే మరొకరిలా తాము ఉండాలనుకోవడం తప్పు. ముఖ్యంగా మాలాంటి తారలను అమ్మాయిలు ఊహించుకుంటూ ..అలా మేమూ ఉండాలనుకుంటారు. మీకో సౌందర్యముంది, దాన్ని గుర్తించి, సంతృప్తిగా ఉండండి. అందంగా కనిపించడం తప్పు కాదు. అలా కనిపించాలని ఒత్తిడికి గురికాకండి. అని చెప్పింది.



## గవర్నర్ తమిళిసైను కలిసిన చిరంజీవి

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళి సైను మెగాస్టార్ చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్ భవన్ వెళ్లిన చిరంజీవి ఆమెను కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తన కొత్త సినిమా సైరా నరసింహారెడ్డిని తిలకించాల్సిందిగా గవర్నర్‌ను చిరు కోరారు. చిరంజీవి విజ్ఞప్తికి గవర్నర్ తమిళిసై సానుకూలంగా స్పందిస్తూ...త్వరలో సైరాను చూడాలనుకుంటున్నట్లు చెప్పారు.

# సత్తేపే సత్తా రీమేక్‌లో...


హృతిక్ రోషన్

అమితాబ్ బచ్చన్ సూపర్ హిట్ సినిమా సత్తా పే సత్తా రీమేక్ లో నటిస్తున్నట్లు హృతిక్ రోషన్ ప్రకటించారు. ఫరా ఖాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనుండగా..రోహిత్ షెట్టి నిర్మాణ బాధ్యతలు తీసుకోనున్నారు. అమితాబ్ చిత్రాన్ని హృతిక్ రీమేక్ చేయడం ఇది రెండో సారి. గతంలో బిగ్ బీ అగ్నిపథ్ పునర్నిర్మాణ సినిమాలో హృతిక్ నటించారు. ఆ సినిమా విజయవంతమైంది. త్వరలో సత్తా పే సత్తా కసరత్తులు ప్రారంభం కానున్నాయి. మాతృకలో హేమా మాలిని పోషించిన పాత్రకు దీపికా పదుకొనేను తీసుకోవాలనుకుంటున్నారు. సెవన్ బ్రైడ్స్ అండ్ సెవన్ బ్రదర్స్ అనే ఆంగ్ల చిత్రం సత్తే పే సత్తాకు ఆధారం. తన సూపర్ హీరో సినిమా క్రిష్ వరుసలో కొత్త చిత్రాన్ని చేయనున్నట్లు హృతిక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ...సత్తే పే సత్తా రీమేక్ చేయాలనే ఆలోచనలో ఉన్నాం. అమితాబ్ గారి అగ్నిపథ్ సినిమా రీమేక్ చాలా కష్టంతో కూడింది. అయినా మేం ప్రయత్నించాం. మంచి విజయం దక్కింది. త్వరలో క్రిష్ 4 సన్నాహాలు ప్రారంభిస్తాం. నాన్న రాకేష్ రోషన్ ఆరోగ్యం కొన్నాళ్లు బాగా లేదు. అందుకే క్రిష్ 4 పనులు ఆలస్యమయ్యాయి. ఇప్పుడాయన బాగున్నారు. మళ్లీ అందరినీ పోగేసి, కథా చర్చలు, నిర్మాణ సన్నాహాలు ప్రారంభిస్తాం. అన్నారు.


పాయల్ రాజ్‌పుత్

# ఇలాంటి చిత్రాల్లో నేనే నటించాలి..

ఆర్‌ఎక్స్ 100 చిత్రంతో తెలుగు తెరకొచ్చిన పంజాబీ భామ పాయల్ రాజ్‌పుత్. ఈ బోల్డ్ బ్యూటీ నటిస్తున్న కొత్త సినిమా ఆర్‌డీఎక్స్ లవ్. సీకే సినిమాస్, హ్యాపీ మూవీస్ పతాకాలపై సి కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శంకర్ భాను దర్శకుడు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఆర్‌డీఎక్స్ లవ్ సినిమా విశేషాలను పాయల్ తెలిపింది. ఆమె మాట్లాడుతూ...ఆర్‌ఎక్స్ 100 విజయం తర్వాత నాకు మంచి గుర్తింపు గౌరవం వచ్చాయి. దాదాపు ఏడాది తర్వాత మళ్లీ ఈ చిత్రంలో నటిస్తున్నా. ఆర్‌డీఎక్స్ లవ్ సినిమా కథ నచ్చి ఒప్పుకున్నాను. ఇందులో బోల్డ్ సన్నివేశాలున్నా, కథ నాకు నచ్చింది. ఇలాంటి సినిమా నేను కాకుండా మరెవరు చేస్తారు. అందుకే నేనే ముందుకొచ్చా. పాపికొండలు అనే ఊరిలో కథ సాగుతుంటుంది. నేను అలివేలు అనే సామాజిక కార్యకర్త పాత్రలో నటిస్తున్నాను. ఊరిలోని కొన్ని సమస్యలపై నేను పోరాడుతుంటాను. ఇందులో మహిళా సమస్యలుంటాయి. సినిమా టీజర్ చూసి ఇందులో ఇంకా చాలా సన్నిహిత సన్నివేశాలుంటాయని అంతా అనుకుంటారు గానీ...మొత్తం సినిమాలో ఉన్న ముద్దు సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్ అన్నీ టీజర్‌లోనే పెట్టేశారు. అంతకంటే ఇంకేమీ ఉండవు. చిత్రీకరణలో భాగంగా ఓ చిన్న గ్రామంలో 40 రోజులకు పైగా ఉన్నాను. కనీస సౌకర్యాలు కూడా లేని ఆ ఊరిలో అన్ని రోజులు కష్టపడుతూనే షూటింగ్ చేశాను. అయితే దాని వల్ల అలివేలు పాత్రను మరింత సహజంగా పోషించేందుకు వీలయింది. ఇది కాకుండా మరో మూడు చిత్రాల్లో నటిస్తున్నాను. వెంకీ మామ, డిస్కో రాజా చిత్రాలు ఈ ఏడాదిలోనే విడుదలకానున్నాయి. ఐపీఎస్ అధికారి పాత్రలో మరో చిత్రంలో నటిస్తున్నాను. ఈ సినిమా వచ్చే ఏడాది తెరపైకి వస్తుంది. ఆర్‌ఎక్స్ 100 సినిమా హిందీ రీమేక్ కోసం నన్ను పిలిచి మరో తారను తీసుకున్నారు. లేకుంటే అక్కడా నటించేదాన్ని. అన్నారు.

# వినోదాత్మకం



రమాకాంత్, మోనాల్, శ్వేతారెడ్డి నటిస్తున్న చిత్రం 'సముద్రుడు'. నగేష్ నారదాసి దర్శకుడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. తొలి షెడ్యూల్ పూర్తిచేసుకుంది. ''సముద్రం నేపథ్యంలో నడిచే కథ ఇది అని, యాక్షన్‌కి ప్రాధాన్యత ఉందని, తదుపరి చిత్రీకరణ చీరలలో జరుగుతుందని'' దర్శకుడు తెలిపారు. ''పాటలను విదేశాల్లో చిత్రీకరిస్తామని'' నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సుభాష్ ఆనంద్, ఛాయాగ్రహణం: వాసు.

# ఎవరికీ చెప్పొద్దు

## ప్రీ రిలీజ్ వేడుక


రాకేష్ వర్రె, గార్గేయి ఎల్లాప్రగడ

రాకేష్ వర్రె, గార్గేయి ఎల్లాప్రగడ హీరో హీరోయిన్లుగా బసవ శంకర్ దర్శకత్వంలో రాకేష్ వర్రె నిర్మిస్తున్న చిత్రం 'ఎవ్వరికీ చెప్పొద్దు'. దిల్ రాజు ఈ చిత్రాన్ని అక్టోబర్ 8న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమంలో దిల్ రాజు, రాకేష్ వర్రె, దర్శకుడు కెఎస్. రవీంద్ర, తరుణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076

# భావోద్వేగాల కథతో...


గణేష్

నిర్మాత బెల్లంకొండ సురేష్ మరో కుమారుడు గణేష్ హీరోగా అరంగేట్రం చేశారు. ఆయన నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ ప్రారంభోత్సవం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో ఘనంగా జరిగింది. ఈ చిత్రాన్ని బీటెల్ లీఫ్ ప్రొడక్షన్స్, లక్కీ మీడియా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్నారు. గణేష్ సినిమా ప్రారంభోత్సవానికి నిర్మాత దిల్ రాజు, సురేష్ బాబు, అభిషేక్ సోదరులు, దర్శకుడు వీవీ వినాయక్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ..పవన్ సాధినేని చెప్పిన కథ బాగుండటంతో కొన్ని రోజులుగా ఈ కథ మీద కసరత్తులు చేశాము. కథ పూర్తయ్యాక బెల్లంకొండ సురేష్ గారికి కథ చెప్పి, గణేష్‌కు బాగుంటుందని అన్నాం. ఆయన కథ నచ్చి ఒప్పుకున్నారు. బీటెల్ లీఫ్ ప్రొడక్షన్స్ మాతో కలిసి సినిమా చేస్తుండటం సంతోషంగా ఉంది. అన్నారు. హీరో బెల్లంకొండ గణేష్ మాట్లాడుతూ..మా ఇష్టాలను తెలుసుకుని ప్రోత్సహిస్తున్న నాన్నకు రుణపడి ఉంటాను. మంచి కథతో ఈ సినిమా చేస్తున్నాం. కథ విన్నప్పుడు చాలా భావోద్వేగానికి గురయ్యాను. పవన్ సాధినేని, బెక్కం వేణుగోపాల్ గారికి కృతజ్ఞతలు. మంచి సాంకేతిక నిపుణులు మా సినిమాకు కుదిరారు. వాళ్ల ప్రతిభతో కథ మరింత అందంగా తెరకెక్కుతుందని నమ్ముతున్నాను. అన్నారు. దర్శకుడు పవన్ మాట్లాడుతూ...మంచి కథతో మీ ముందుకొస్తున్నాం. గణేష్‌కు ఇది చక్కగా సరిపోయే స్క్రిప్ట్. త్వరలో మిగతా నటీనటుల వివరాలు తెలియజేస్తాను. అన్నారు. ఈ చిత్రానికి మాటలు - వివేక్ ఆత్రేయ, సంగీతం - రధన్, సినిమాటోగ్రఫీ - కార్తీక్ ఘట్టమనేని.



## శంకర్ హీరోగా

# 2+1

కమెడీయన్ శంకర్ హీరోగా మరో చిత్రం రూపొందనుంది. కాచిడి గోపాల్ రెడ్డి దర్శకుడు. ఎస్‌కె. పిక్చర్స్, ఆకృతి క్రియేషన్స్ కలిసి నిర్మిస్తున్నారు. సురేష్ కొండేటి, ఎడవెల్లి వెంకట్‌రెడ్డి నిర్మాతలు. సినిమా పేరు '2 + 1'. దర్శకుడు మాట్లాడుతూ ''రెండు విభిన్నమైన పాత్రల్లో శంకర్ కనిపిస్తాడు. వీటిలో మాస్ టచ్ ఉన్న స్టూడెంట్ పాత్ర కూడా ఉంది. ఇదే సినిమాలో హైలెట్ అవుతుంది'' అన్నారు. ''ఐదు యాక్షన్ ఎపిసోడ్స్, నాలుగు పాట్లతో కడుపుబ్బ నవ్వించే సీన్స్‌తో నిర్మితమవుతున్న చిత్రమని'' సురేష్ కొండేటి పేర్కొన్నారు. శంకర్, రుబికా, ఆక్సాఖాన్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం : హరిగౌర, ఛాయాగ్రహణం: మొటం సతీష్.

